# కబీర్



జాతీయ జీవిత చరిత్ర గ్రంథమా

# కబీరు

రచన

**పరస్‌నాథ్ తివారీ**

అనువాదం

**డా॥ సి. నరసింహశాస్త్రి (అమరేంద్ర)**

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

సుమారు అయిదువందల యాభై సంవత్సరాల కిందట కాశీ పట్టణానికి చెందిన నీరూ అనే సాలెకులస్తుడూ అతని భార్య నీమా లహర్‌తారా అనే ప్రదేశంలో ఒక అనాధబాలకుని కనుగొన్నారు. ఆ దంపతులకు వివాహం జరిగి ఎక్కువ దినాలు కాలేదు కనక కొన్ని చిక్కులు ఏర్పడినాయి. ఆ శిశువు చాలా అందంగా వుండ టంచేత వారికి వదిలి పెట్టటానికి మన సొప్పలేదు. ఆ శిశువును తీసుకు వెళ్తే లోకులు ఏమనుకుంటారో అనే భయం బాధించింది. భార్యా భర్తల మధ్య కొంత చర్చ జరిగింది. జాగర్తగా ఆలోచించవలసిందనీ తొందరపాటు తగదనీ నీరూ హితబోధ చేశాడు. కాని నీమా హృదయంలో మాతృప్రేమ వెల్లివిరిసి ఆ పిల్లవా డిని తీసుకువెళ్ళి పెంచుకుందామని పట్టుపట్టింది. చివరికి నీమా మాట నెగ్గిం దని మనం వూహించవచ్చును.

నీరూ కాశీ నగరంలో ఇప్పుడు కబీర్ చౌరా అనీ, నీరూతలా అనీ పిలువబ డుతున్న ప్రాంతంలో కాపురం వుండేవాడు. శిశువును తీసుకుని తమ నివాసానికి వెళ్ళారు. ఒక మత బోధకుని పిలిచి పిల్లవాడికి పేరు పెట్టవలసిందని అడిగారు. ఆ మత బోధకుడు నామకరణంకోసం కొరాన్ గ్రంథాన్ని సంప్రదించగా అరేబి యన్ భాషలో దైవ నామాలైన కబీర్, కుబ్రా, అక్బర్ వంటివే లభించాయి. మళ్ళీ మళ్ళీ ఆ పవిత్ర గ్రంథాన్ని తిరగవేయగా దైవపరమైన నామాలే ఎదురై నాయి. ఇతర మతబోధకులను అడిగినప్పటికీ వాళ్లూ అదే మాట చెప్పారు. బోధకులు భయపడి ఆ శిశువును చంపివేయవలసిందనీ లేకపోతే ఏదైనా ఉప ద్రవం రాగలదనీ నీరూకు సలహా యిచ్చారు. మత బోధకుల సలహాప్రకారంగా నీరూ ఆశిశువును కత్తితో నరకాలని ప్రయత్నించాడనీ, కాని ఆశిశువుకు దెబ్బ తగలలేదనీ ఒక కథ చెబుతారు. ఈ కథ ఎంతవరకు నిజమో చెప్పటం కష్టం. ఆ దంపతులు శిశువును సంహరించలేక పోయారు. ఆపేక్షతో ఆ బిడ్డను పెంచా రు. మతబోధకుని ఆజ్ఞను ఆ దంపతులు శిరసావహించలేక పోయారు.

చివరికి ఆ శిశువుకు కబీర్ అని పేరు పెట్టారు. కబీరు ఎప్పుడు జన్మిం చాడో నిర్ధారణచేసి చెప్పటం కష్టం. కబీరు జన్మదినాన్ని గురించి పద్యం ఒకటి వున్నది. కాని అది ఎంతవరకు సత్యమో, ఎవరు రచించారో తెలుసుకోలేము. ఆ పద్యం ప్రకారం కబీరు విక్రమ శకం 1455 సంవత్సరం గడిచిన తరువాత

అంటే క్రీస్తుశకం 1398వ సంవత్సరంలో జ్యేష్ఠపూర్ణిమ నాడు సోమవారం జన్మిం చినట్లూ, ఆనాడు వటసావిత్రి పండుగ అయినట్లూ విదితమవుతుంది. కబీరు అను యాయులు ఆయన జన్మదినం ప్రతి సంవత్సరమూ వటసావిత్రి ఉత్సవంనాడు జరుపుకుంటారు. కొందరు అభిప్రాయం ప్రకారం జ్యేష్ఠ పూర్ణిమ సోమవారం నాడు రావటం 1456లో జరుగుతుంది. కాని 1455లో కాదు. 1455వ సంవ త్సరం గడిచాక అంటే 1456వ సంవత్సరంలో జ్యేష్ఠ పూర్ణిమదినాన సోమవా రంనాడు కబీరు జన్మించాడని చెప్పవచ్చు. మరికొందరు కబీరు జీవితంలోని ఇతర సంఘటనలతో సమన్వయం కుదర్చటం కోసం ఆయన ఇంకొక పాతిక ముప్పైసంవత్సరాలు ముందుగా జన్మించినట్లు అభిప్రాయ పడుతున్నారు.

కబీరు జన్మవృత్తాంతానికి సంబంధించిన గాథలు అనేకం ప్రచారంలో వున్నాయి. అందులో ఒక కథ ఈవిధంగా వుంది. ఒక నాడొక బ్రాహ్మణుడు తన వితంతు పుత్రికను వెంటపెట్టుకుని స్వామి రామానందుని దర్శనానికి వెళ్ళాడు. ఆమె రామానందునికి పాదనమస్కారం చేసింది. ఆమె వితంతువనే సంగతి తెలియక రామానందుడు 'నీకు త్వరలోనే పుత్రుడు జన్మిస్తాడు' అని దీవించాడు. మహనీయుల ఆశీర్వచనం అమోఘం కనక ఆప్రకారం జరిగితీరుతుంది. కొన్నాళ్ల తరవాత ఆ వితంతువుకు పుత్రుడుదయించాడు. అపవాదులకు భయపడి ఆమె తన శిశువును లహర్ తారాలో కొలనులో పడవేసింది. కొందరు ఈ సంఘటనకు ఒక అద్భుతాన్ని జతపరచారు. ఆ వనిత వితంతువని తెలుసుకున్నాక రామానం దుడు 'బిడ్డా! నేను అన్నమాటకు తిరుగులేదు. అందువల్ల నీకు ఏ కళంకమూ రాదు. నువ్వు ప్రసవించే బిడ్డ ఒక సాధుపుంగవుడు అవుతాడు' అన్నాడట. ఆ వితంతువు చేతిమీద ఒక కురుపు లేచిందట. అది బాగా ఎదిగిన తరవాత బద్దలై అందులో నుంచి ఒక మాంసపుముద్ద బైట పడిందట. బైటికి వచ్చిన క్షణమే ఆ ముద్దకు శిశువురూపం ఏర్పడిందట. ఈ కథప్రకారం కబీరు అసలు పేరు కరవీ రుడు, అంటే చేతినుంచి పుట్టినవాడు. ఈ కథ ముఖ్యోద్దేశం ఏమంటే కబీరు స్త్రీ గర్భంనుంచి జన్మించలేదని ప్రతిపాదించటం.

ఇంకా ఆశ్చర్యకరమైన కథ మరొకటి వుంది. ఒకనాడు లక్ష్మీదేవితో సరసస ల్లాపా లాడుతున్న విష్ణుమూర్తి ఆమెకు ఏమాటా చెప్పకుండా చివాలునలేచి వెళ్ళిపోయాడు. లక్ష్మీదేవికి కోపం వచ్చింది. ఆమెకోపం చల్లార్చటంకోసం విష్ణు మూర్తి తన భక్తులలో ఒకడు ఆపదలో చిక్కుకుని మొరపెట్టగా అతన్ని రక్షించ టంకోసం ఉన్నపాళాన లేచి వెళ్ళానని చెప్పాడు. నాకంటే ఆప్తులయిన భక్తులు

న్నారా అని లక్ష్మీదేవి ప్రశ్న వేసింది. ఎందరో వున్నారనీ, వాళ్ళు ఆపదలో ఆక్రందిస్తే వెంటనే తాను వెళ్ళి కాపాడవలసిన కర్తవ్యం వుందనీ విష్ణువు సమాధానం చెప్పాడు. లక్ష్మీదేవి అభిమానం దెబ్బతిన్నది. తనకు అడ్డువచ్చి అవమానం కలిగించిన ఆ వ్యక్తి భక్తిని పరీక్షించాలని అనుకున్నది. వెంటనే తోట మాలి భార్యరూపం ధరించి భూలోకానికి వచ్చింది. అద్భుతమైన పుష్పవనాన్ని సృష్టించింది. ఆదారినే రామానందస్వామి వస్తూ తోటలో ప్రవేశించాడు. పూజ కోసం రెండు పుష్పాలు కోయగానే 'ఆగు, నువ్వు దొంగతనంగా పూలు కోస్తు న్నావు' అని లక్ష్మీదేవి కేకలు వేసింది. ఆ రెండుపూలూ తోటమాలి భార్యమీదికి విసిరేసి రామానందస్వామి వెళ్ళిపోయాడు. ఆయన వెనక్కి తిరిగి చూసేసరికి అతి సుందరమైన ఆ పుష్పవనం అదృశ్యమైపోయింది. పరమభక్తుడైన రామా నందుని పైన దొంగతనం నేరం మోపగలిగాననే సంతోషంతో లక్ష్మీదేవి వైకుం ఠానికి తిరిగి వెళ్ళి విష్ణుమూర్తికి జరిగినదంతా చెప్పింది. ఆ రెండుపువ్వులూ ఆయనకు నిదర్శనంగా చూపటం కోసం చీర మడతల్లో వాటికోసం వెదికింది. ఆ పువ్వులకుబదులు ఒక అందమైన బాలుడు కనిపించాడు. 'ఇదేమిటి?' అని ఏమీ తెలియనట్లు ఆశ్చర్యం నటిస్తూ విష్ణుమూర్తి అడిగాడు. లక్ష్మీదేవి ఏమీ చెప్పలేక తికమకపడింది. తన పరాజయాన్ని అంగీకరించింది. 'ఈ బాలుడు ఎక్కడ దొరికాడో అక్కడికి తీసికెళ్ళి వదిలి పెట్టు. నా భక్తాగ్రేసరుడుగా ఈ బాలుడు ప్రసిద్ధిపొందగలడు' అన్నాడు. లక్ష్మీదేవి ఆబాలకుని తీసికెళ్ళి లహర్ తారాలో కొలనులో తామరాకుమీద పడుకోబెట్టి వచ్చింది. ఆ శిశువే కబీరుగా లోకంలో పేరు పొందాడు.

ఇంకొక గాథప్రకారం కబీరు శుకదేవుని అవతారం. మానవ కళ్యాణం కోసం శుకదేవుడు మళ్ళీ అవతరించాలని శివుడు ఆదేశించాడట. కిందటి జన్మలో శుక దేవుడు మాతృగర్భంలో పన్నెండు సంవత్సరాల సుదీర్ఘ యాతన అనుభవించి వున్నాడు. అందువల్ల ఇంకొకసారి గర్భవాసపు చెఱ అనుభవించటం ఆయనకు ఇష్టం కాలేదు. అందువల్ల ఒక శుక్తిలో తాను ప్రవేశించి దానిని గంగానదిలో పడ వేయమన్నాడు. ఆ శుక్తి ప్రవాహంలో తేలిపోయి లహర్‌తారాలో కొలనులోకి చేరి అక్కడ ఒక తామరాకుమీద బద్దలయింది. అందులోనుంచి ఒకబాలుడు బైటికి వచ్చాడట. ఆ బాలుడే కబీరు.

కబీరు నిర్యాణం చెందిన తరవాత ఇటువంటి కథలు ఎన్నో ప్రచారంలోకి వచ్చాయి. ఊహలతో వన్నెలూ చిన్నెలూ దిద్దిన చిలవలూ పలవలూ అల్లిన

కథలు ఇవన్నీ. లక్ష్మీదేవికి శుకదేవునికీ ప్రమేయం కల్పించిన కథలు పురాణ యుగానికి చెందిన కల్పన. ఇందులో మొదటి కథలో కొంత వాస్తవాంశం ఆధారంగా కనిపిస్తుంది. కాని కబీరు అనుయాయులు ఈ కథలను వేటినీ విశ్వసించరు. కబీరు వారి అభిప్రాయం ప్రకారం అయోనిజుడు. సత్పురుషుడైన పరమాత్మని అంశగా భావిస్తారు. అందువల్ల కబీరు జననమరణాలకు అతీతుడని వారి విశ్వాసం. అటువంటి దివ్యాంశసంభూతుల అవతరణానికి అవసరం ఏర్పడినప్పుడు వారు సంకల్పమాత్రంచేతనే నరాకారం ధరించి ఆవిర్భవిస్తారని వారి అభిప్రాయం. గతించిన మూడు యుగాలలో కబీరు పదమూడుసార్లు అవతరించాడట. కలియుగంలో పధ్నాలుగోసారి కబీరు అవతరించాడు. విక్రమ శకం 1455 లో కాశీ నగర సమీపంలో వున్న లహర్ తారా గ్రామంలో సత్పురుషుని దివ్యకాంతి జ్యేష్ఠపూర్ణిమనాడు భూమి పైన అవతరించిందని వీరి నమ్మకం. ఆ జ్యోతి ఆవిర్భవించే శుభముహూర్తంలో అష్టానంద వైష్ణవుడనే భక్తుడు కొలనువద్ద వున్నాడు. ఆకాశంలో మబ్బులుకమ్మి సన్నటి జల్లు పడుతున్నది. మధ్యమధ్య చీకటిని పటాపంచలు చేస్తూ మెరుపుతీగెలు తళుక్కుమంటున్నాయి. ఆ కాంతిలో మధుపాలు ఝుంకరిస్తున్న వికసితకుసుమాలు మెరుస్తున్నాయి. ఆ దివ్యపురుషుని మహాప్రకాశంవల్ల అష్టానందుడి కళ్ళు మిరుమిట్లుగొలిపి దిగ్భ్రాంతి కలిగింది. తాను చూసిన అద్భుత దృశ్యాన్ని తన గురువైన రామనందస్వామికి నివేదించాడు. 'ఎవరిని దర్శించి ధన్యుడివైనావో ఆ సత్పురుషుని నామంతో అచిరకాలంలో ఈ భూమి ప్రతిధ్వనిస్తుంది' అని రామానందస్వామి అన్నాడు. ఆ దివ్యకాంతి ఒక బాలకుని రూపం ధరించింది. కొలనులోని తామరాకు ఆ బాలునికి శయ్యగా అమరింది. ఆ శిశువే నీమాకు దొరికిన దివ్య బాలకుడు.

కబీరు శాఖకు చెందిన గ్రంథాలు నీరూ నీమాలు పూర్వజన్మలో భంగీ కులానికి సంబంధించిన వారని పేర్కొంటున్నాయి. వారికి సుదర్శన్ అనే కుమారుడుండేవాడనీ, అతను గొప్ప భక్తుడనీ చెబుతున్నాయి. అందువల్ల తరవాత జన్మలో వారిద్దరూ బ్రాహ్మణకులంలో పుట్టి, నరహరి, లచ్చిమా అనే నామాలతో చందవర్ అనే పట్టణంలో జీవించారు. వారి భక్తికి సంతసించి భగవంతుడు వారికి కబీరును పుత్రుడుగా అనుగ్రహించాడు. అజ్ఞానంవల్ల కబీరును దైవప్రసాదంగా వారు గుర్తించలేక పోవటంవల్ల అతను అదృశ్యమైపోయాడు. వాళ్ల దుఃఖానికి అంతులేదు. ఇద్దరూ మరణించి కాశీనగరంలో సాలెకులానికి చెందిన నీరూ నీమా అనే దంపతులుగా జన్మించారు. మిగతా కథ అంతా మామూలుగానే సాగుతుంది.

ఒక్క తేడా మాత్రం కనిపిస్తుంది. మతబోధకుడు కాజీ నీరూతో శిశువుకు నామక రణం చేసే సందర్భంలో బిడ్డను చంపవలసిందని ఆజ్ఞాపించగా నీరూ కత్తి పైకి ఎత్తి నప్పుడు శిశువుగా వున్న కబీరు ఈ పదం ఆలాపించినట్లు చెబుతారు.

'నేను మీరు తెలుసుకోలేని తావునుంచి వచ్చాను.
ఎవరూ నా రహస్యాన్ని భేదించలేరు.
నాకు పుట్టుకలేదు, గర్భవాసం లేదు.
నేను ఒక సాలెవానికి వనంలో దొరికాను.
నేను భూమికీ ఆకాశానికీ చెందను.
నేను అజ్ఞేయుడను, అప్రమేయుడను.
నిరంజన దివ్యాకాంతి నా నామధేయం.
నిరాకార సాకారుడను, నా నామం కబీరు.
గతజన్మలో చేసిన వాగ్దానంప్రకారం నేను ఇక్కడికి వచ్చాను.
రక్తమాంస శల్యాలకు నేను అతీతుడను.
నేను కాలాతీతుడను; మీ భయాలు పారద్రోలి
మిమ్ము తరింపజేయటానికి వచ్చాను.'

ఈ పదంలోవున్న పూర్వజన్మప్రసక్తి పైన వివరించాను. కబీరు సత్యాయు గంలో శత సుక్రుతుడనే పేరు తోనూ, త్రేతాయుగంలో మణీంద్రుడనే పేరు తోనూ, ద్వాపరంలో కరుణామయుడనే పేరుతోనూ జన్మించాడు. ఇది ఆ మత స్తుల నమ్మకం. విశ్వాసం మూలాధారంగావున్న నమ్మకాలను కాదనటానికి వీలు లేదు. అటువంటి నమ్మకాలకు కొంత ప్రాముఖ్యం వుంది. కాని వాటికి మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వరాదు. మరి ఈ గాథలన్నిటిలోనూ లౌకిక దృష్టికి స్వీకారయో గ్యంకాని అంశాలు కనిపిస్తాయి.

ఈ కథ లన్నిటినీ సమన్వయిస్తే తేలే సారాంశం ఏమంటే కబీరు తల్లి దండ్రు ల్నిగురించీ జన్మస్థలాన్ని గురించీ నిర్ధారణగా చెప్పటం కష్టమని. అన్ని గాథ ల్లోనూ లహర్‌తారా ప్రసక్తి వున్నది. కాని కబీరు జన్మస్థలం లహర్‌తారా అనే అంశం అందరూ అంగీకరించడంలేదు. కొందరు అజాంగర్ జిల్లాలోవున్న బెల్ హరా పట్టణంలో కబీరు జన్మించినట్లు వాదిస్తారు. భాషా పరిణామాలను అనుస రించి బెల్‌హరాయే లహర్‌తారా అయిందని వీళ్ళప్రతిపాదన. ఎంత విచారిం

చినా బెల్‌హరా ఎక్కడ వున్నదో తెలియలేదు. అది అజంగర్ జిల్లానుంచి కాశీకి ఎందుకు మారిందో బోధపడదు. మరి కొందరు కబీరు మఘర్ అనే పట్టణంలో జన్మించాడనీ మఘర్ లోనే పరమపదించాడనీ అభిప్రాయపడుతున్నారు.

వాళ్ళు తమ వాదానికి ఆధారంగా కబీరు రచించిన ఈ పంక్తిని పేర్కొంటు న్నారు:

నేను మొట్టమొదట మఘర్‌లో ఈ లోకాన్ని దర్శించాను. తరవాత కాశీలో స్థిరపడ్డాను.

ఇక్కడ ఒకచిక్కు వస్తున్నది. ఈ పంక్తి కబీరు రచించినదేనని నిర్ధారణగా చెప్పటానికి వీలులేదు. ఇటువంటి పంక్తులూ పదాలూ ఎన్నో ఇతరులు రాసి కబీ రుకు ఆపాదించినట్లు తోస్తుంది. కర్తృత్వం నిర్ధారణకాని ఈ పంక్తులను చారిత్రకా ధారాలుగా పరిగణించటానికి వీలులేదు. కబీరును నీరూ నీమాలు పెంచి పెద్ద చేసినట్లు నిశ్చయంగా చెప్పవచ్చు. నీరూ నీమా దంపతులు కాశీలో నివసించి నట్లు నిశ్చయంగా అనవచ్చును.

కబీరు బాల్యాన్ని గురించికూడా ఎన్నోకథలు ఇటువంటివే ప్రచారంలో వున్నా యి. కబీరు ఎటువంటి ఆహారమూ పుచ్చుకోకుండానే పెరిగి పెద్దవాడయ్యాడం టారు. పెంచిన తల్లిదండ్రులు అతను ఆహారం ఏదీ పుచ్చుకోకపోవటం చూసి చాలా బాధపడ్డారు. వాళ్ళు బతిమాలుకోగా చివరికి కబీరు పాలు త్రాగటానికి అంగీకరించాడట. ఆయన త్రాగేపాలు ఈవిధంగా లభించేవట. దూడలేని ఒక ఆవు పొదుగుదగ్గర పాలకుండను వుంచేవారు. కబీరు ఆ వంక చూస్తూ పాలు కావాలని అనుకోగానే ఆవు పాలు చేపేది. పాత్ర నిండిపోయేది. ఈ విధంగా లభించిన పాలను మాత్రమే కబీరు త్రాగేవాడు.

ఇస్లాం మతానికి చెందిన సాలెవారి కుటుంబంలో కబీరు పెరిగి పెద్దవాడైన ప్పటికీ రామా, గోవిందా, హరి అనే భగవన్నామాల మీద ఆయనకు ప్రీతి. అప్పటి ముస్లిం పరిపాలకుడు పరమత సహనంలేని సంకుచితత్వం కలవాడు. అసహనంవల్ల ఇతర మతస్థులను హింసించటం పరిపాటిగా వుండేది. అందు వల్ల హిందూ మహమ్మదీయ మతస్థుల మధ్య మైత్రీభావానికి బదులు ద్వేషమే ప్రబలంగా వుండేది. అటువంటి పరిస్థితుల్లో కబీరు రామనామం ఉచ్చరించడం సాలెకుటుంబంలోని వాళ్లకి బాధాకరంగా వుండేది. అతని ధోరణి చూసి చాలా మంది ముస్లింలు ఏవగించుకున్నారు. కబీరు పెద్దవాడైనాక మత విరోధిగా తయా రవుతాడన్నారు. పరధనాన్ని హరించి, కపట నటనలతో లోకాన్ని వంచించ

అమాయకులను సంహరించినవాడే మతవిరోధి అని కబీరు వాళ్ళకి సమాధానం చెప్పాడు. కబీరు రచించిన అనేక పదాలలో ఈ భావమే ప్రకటితమవుతున్నది. ఇవి నిజంగా ఆయన రచనలే అని నిరూపించవచ్చును. ముస్లిం కుటుంబంలో పెరిగినందువల్ల ముందుగా ఇస్లాం మతస్తులనే విమర్శించాడు. ఒక పదంలో ఇస్లాం మతబోధకుని రామనామం స్మరించి కాఠిన్యాన్ని వర్జించవలసిందని హిత బోధ చేస్తాడు.

మతగ్రంథాన్ని వదిలేసి రాముని స్మరించు
ఓ ఉన్మత్త కఠినాత్ముడా!
తురకలమాట నేను వినను
రామనామ కీర్తనమే కబీరుపాటకు పల్లవి.

ఇంత సూటిగానూ కబీరు వేదపురాణాలను నిరసించాడు. కబీరు స్మరించే రాముడు హిందువుల దేవుడుకాడు. రామనామమే కబీరు హృదయాన్ని చూరకొన్నది.

బాల్యంలో కబీరు రాముని ధ్యానిస్తూ తన్మయుడౌతూ వుండేవాడు. ఆ పాంపశ్యంలో కులవృత్తియైన నేతపనిని విస్మరించేవాడు. ఇతని పరిస్థితి చూస్తే నీమాకు మతి పోయినట్లనిపించేది. ఈ మూర్ఖుడు ఎప్పటికైనా దారికి వస్తాడా? ఎట్లాపొట్టపోసుకోగలుగుతాడు? మగ్గం నేయటం వల్ల రామనామస్మరణకు అంతరాయం కలుగుతున్నదనేవాడు కబీరు. అమ్మా నువ్వు దిగులు చెంద నవసరం లేదు. ఈ మూడు లోకాలనూ పాలించే పరమాత్ముడే మన కుటుంబాన్ని పోషిస్తాడు అనేవాడు.

కబీరు పడుగుపేకల గొడవ వదిలేశాడు
నిలువెల్లా రామనామమే లిఖించుకున్నాడు.
కబీరుతల్లి కలవరపడుతూ కన్నీరు పెట్టుకుంటుంది.
భగవంతుడా! నీ బిడ్డకు జీవనోపాధి ఎలాగు?
అంటూ తల్లడిల్లుతుంది.
మగ్గంపైన నూలు వేయగనే
మరుపున పడతాడు నా రాముడు
నామాటవిని దిగులు వీడు తల్లీ!

సకలలోకనాధుడే మనకు అన్నం పెట్టి ఆదుకోగలడమ్మా!

హిందూదేవతల నామాలను స్మరిస్తున్నాడని కబీరు మీద ముస్లిము లందరికీ కోపం. అతను స్మరించే రాముడు హిందువుల దేవుడు రాముడు కాదని హిందువులకు కూడా కబీరు మీద ఏవగింపు. విగ్రహారాధనమూ, అంటరాని తనమూ, ఇతర హైందవాచారాలూ కబీరు తీవ్రంగా విమర్శించాడు.

కాని బాహ్యావేషంలో కబీరు వైష్ణవభక్తునిలాగా వుండేవాడు. ఇది చూసి బ్రాహ్మణులు కంటగించుకున్నారు. ముస్లింకుటుంబంలో పుట్టినమనిషి వైష్ణవ వేషంలో సంచరించటం కూడని సాహసంగా వారికి తోచింది. నువ్వు ఏ గురువు దగ్గర ఉపదేశం పొందావని తరచు ప్రశ్నించేవారు. వైష్ణవ సంప్రదాయంలో గురువు ఉపదేశంలేకుండా ముక్తి కలగదనే నమ్మకం. కనక కబీరు చిక్కుపడ్డాడు. అప్పుడు వైష్ణవభక్తులలో అగ్రగణ్యుడైన రామానందస్వామి కాశీలో నివసిస్తూవుండేవాడని అంటారు. రామానందుని వద్ద ఉపదేశం పుచ్చుకోవాలని కబీరు అనుకున్నాడు. కాని రామానందుడు ఒక సాలెమనిషికి ఉపదేశం ఇచ్చి శిష్యుడుగా స్వీకరిస్తాడా? కబీరు ఒక మార్గం ఆలోచించాడు. ప్రతిదినమూ ప్రభాత వేళ రామానందస్వామి గంగాస్నానానికి వెళ్ళేవాడు. ఆయన నడిచివెళ్ళేదారిలో కబీరు పోయి కూచున్నాడు. కొంత సేపటికి రామానందస్వామి ఆ దారివెంబడే వచ్చి రామరామ అంటూ కబీరును దాటి వెళ్ళాడు. రామ నామం తనకు గురువు ఉపదేశించినట్లుగా కబీరు సంతోషపడ్డాడు. ఇంటికి వచ్చి జపమాలను చేతబట్టి తను రామానందునికి శిష్యుడినైనానని అందరితోనూ చెప్పాడు. కొందరు ఏమంటారంటే ఆ మసకచీకట్లో రామానందుడు పావుకోళ్ళతో కబీరును తొక్కి అతని శరీరం తగలగానే, 'ఓ రామా!' అన్నాడనీ అదే కబీరు తనకు ఉపదేశంగా భావించుకున్నాడనీ చెబుతారు.

కబీరు వేషభాషలు చూసి తల్లిదండ్రులు నిరూ నీమాలు చాలా కలవరపడ్డారు. తమ ఇస్లాం మతానికి విరుద్ధంగా వైష్ణవులందరిలాగా నుదుటమీద గంధం పూసుకుని కంఠంచుట్టూ తులసీమాల వేసుకుని వ్యవహరించటం వాళ్ళకి గిట్టలేదు. ఒక ముస్లిం మతస్తునికి ఉపదేశం చేసినందుకు రామానంద స్వామి మీద కూడా హిందువులకు ఆగ్రహం కలిగింది. ఈ సంగతి రామానందస్వామి దాకా వెళ్ళింది. ఆయన ఆశ్చర్యపడ్డాడు. తను ఉపదేశం ఇవ్వలేదు. కబీరును తనవద్దకు రమ్మని కబురుచేశాడు. ఆయనదగ్గరికి కబీరు వెళ్ళినప్పుడు రామానంద స్వామి తెరచాటున పూజ చేసుకుంటూ వున్నాడు. పూజకు కావలసిన వస్తువు

లన్నీ అమర్చివున్నాయి. ఒక్కటి మాత్రం లేదు. కబీరు తెర ఇవతల నిలబడి 'ఓ మహాత్మా! మీరు తులసీ దళం మాట మరిచిపోయారు. మీ పూజాద్రవ్యాలలో తులసీదళం సమర్పించలేదు' అని బిగ్గరగా అన్నాడు. రామానందస్వామి విస్మితుడైపోయాడు. 'కబీరూ! నా శిష్యుడినని చెప్పుకుంటున్నావుటకదా! నేను నీకు ఉపదేశం ఎప్పుడు ఇచ్చాను?' అని రామానందుడు ప్రశ్నించాడు. జరిగిన సంఘటనను కబీరు వివరించాడు. కాని స్వామికి తృప్తికలగలేదు. 'గురువు శిష్యుడికి ఉపదేశం ఇచ్చేపద్ధతి ఇదికాదు' అన్నాడు. 'అన్నిశాస్త్రాలలోనూ రామనామం కంటే అమూల్యమైన దేమున్నది?' అని కబీరు ప్రశ్నవేశాడు. 'అది నిజమే. భగవన్నామంకంటే శ్రేష్ఠమయినది లేదు' అని రామానందస్వామి అంగీకరించాడు. 'ఉపదేశం ఇచ్చి శిష్యులుగా స్వీకరించేవారికి ఇంత కంటే గొప్పరహస్యం మీరు ఆవిష్కరిస్తారా?' అన్నాడు కబీరు. ఇది వినగానే రామానందుడు సంతసించాడు. తెరలు తొలగించమని కోరాడు. కబీరుకి తన దర్శనమిచ్చి శిష్యుడుగా స్వీకరించాడు.

అనేకసందర్భాలలో తననుమించిన వివేకం కబీరులో వున్నట్లు గుర్తించి రామానందస్వామి సగౌరవంగా తలవంచవలిసివచ్చింది. అనేక విచిత్ర సన్నివేశాల్లో ఈ కథ ఒకటి. ఒకసారి రామానందునికి పితృదేవత పూజా సమయంలో ఆవుపాలు కావలిసవచ్చాయి. తీసుకురమ్మని కబీరుని పంపించాడు. కబీరు వెళ్ళి ఒక చచ్చిపోయిన ఆవు పొదుగు దగ్గర పాత్రనుపెట్టి దాని నోటిముందు మేతవేయటం మొదలుపెట్టాడు. ఎన్నిగంటలు గడిచినా చచ్చిన ఆవు పాలుఇవ్వలేదు. కబీరు ఎక్కడ వున్నాడో చూసిరమ్మని రామానందుడు కొందరు శిష్యుల్ని పంపాడు. వాళ్ళు తిరిగివచ్చి కబీరు చచ్చిన ఆవుకు పాలుపిదికే విడ్డూరమైనపని చేస్తున్నాడని చెప్పారు. అప్పుడు కబీరు తన గురువుగారితో ఇలా అన్నాడు: 'చచ్చిపోయిన పితృదేవతలకు చచ్చిన ఆవుపాలు సముచితమని తలపోశాను. కాని ఈ ఆవు మేత తినదు, పాలు ఇవ్వదు' అన్నాడు. 'చచ్చిన ఆవు ఎక్కడైనా మేత తింటుందా?' అని రామానందుడు ప్రశ్నించాడు. 'ఇంతకుముందే చచ్చిన ఆవు మేత తినకపోతే ఎప్పుడో గతించిన మీ పితృదేవతలు ఆవుపాలు ఎలాతాగగలరండీ?' అని ఎదురుప్రశ్నవేశాడు. రామానందుడు బదులు చెప్పలేక పోయాడు.

ఈ కథ నిజం కావచ్చు, కాకపోనూవచ్చు. కాని కబీరును గురించి ప్రజల మనస్సుల్లో ఏర్పడిన అభిప్రాయం ఇందులో ప్రకటితమవుతున్నది. ఆయన తర్కం అసమానం. ఆయన వివేకం పదునుకత్తిలా మెరుస్తుంది. ఆయన రచనల్లో కబీరు నిర్భయమైన, స్వతంత్రమైన, సంప్రదాయ వ్యతిరేకమైన ధోరణి ప్రస్ఫుటమౌ

తుంది. ఆయన తెలివితేటలను హిందూమతాన్నీ ఇస్లాం మతాన్నీ ఆవరించిన కపటవంచనను బట్టబయలు చేయటానికి వినియోగించాడు. ఇంకొక కథ వున్న ది. ఒకసారి ఇద్దరు బ్రాహ్మణులు భగవంతుని తత్వం ద్వైతమా అద్వైతమా అని వితర్కించుకుని చివరికి కబీరు దగ్గరికి వెళ్ళి ఆయన అభిప్రాయం కోరారు. ఇద్దరి వాదాలూ ఓపికగా విన్నాడు. చివరికి 'మీ ఉద్దేశంలో దేవుడి రంగు ఏమిటి? ఆకుపచ్చా, పసుపుపచ్చా? నలుపా? ఎరుపా?' అని అడిగితే ఇద్దరు బ్రాహ్మణులూ భగవంతుడికి రంగులేదన్నారు. 'భగవంతుని ఛాయ పసిమా, నలుపా?' అని కబీరు అడిగితే వాళ్ళు రెండూ కాదన్నారు. భగవంతుడి ఆకార మెలా వుంటుంది? ఆయన పరిమాణం ఎంత అని కబీరు అడిగాడు. భగవంతుడు రూపాతీతుడు. అప్రమేయుడు అన్నారు విప్రులిద్దరూ. 'విప్రులారా! భగవంతుడు రంగు, పరిమాణం, రూపంలేనివాడయితే ఆయన ఒకడా ఇద్దరా అని మీరు ఎలా లెక్క పెట్టగలరు? సంఖ్యలలో ఆయన స్వరూపం ఇముడుతుందా? ఆయన ద్వైతమూకాదు అద్వైతమూకాదు. ఆయన అంతటా అందరిలో వున్నాడు' అన్నాడు.

ఈ సన్నివేశం కూడా తరవాత కల్పితమైనది కావచ్చు. కాని ఇందులో కబీరువైఖరి ప్రస్ఫుటమవుతున్నది. ఆయన ఒక చోట ఇలా అన్నాడు.

ఈ వివాదం పరిష్కరించు రామా!
నీ సృష్టిమీద నీకు మమకారం వుంటే
బ్రహ్మ గొప్పా? ఆయనను సృజించినవాడా?
వేదం గొప్పా? దాని జన్మస్థానం గొప్పా?
మనస్సు గొప్పా? దాని ధ్యేయం గొప్పా?
రాముడు గొప్పా? రాముని మర్మం తెలిసినవాడు గొప్పా?
ఈ ప్రశ్నలతో కబీరు తికమకపడుతున్నాడు.
ఈశ్వరుడు గొప్పా? ఈశ్వరసేవకుడు గొప్పా?
ఎంత సులభంగా కనిపిస్తాయో
అంత గంభీరమైన వీ ప్రశ్నలు!

కబీరు అనుచరులేకాకుండా ఇతరులుకూడా రామానందస్వామి ఆయన గురువు అని వాదించేవారున్నారు. చారిత్రకదృష్టితో పరిశీలిస్తే ఇది అసంభవంగా కనిపిస్తుంది. స్వామి రామానంద విక్రమ శకం 1467 లో పరమపదించాడు. కబీరు 1455 లో

పుట్టాడు. కనక రామానందస్వామి చనిపోయేనాటికి కబీరువయస్సు పన్నెండు సంవత్సరాలు మాత్రమే. ఉపదేశం ఇంకొక మూడు నాలుగు సంవత్సరాలముందు జరిగిందనుకుంటే అప్పటికి కబీరు మరీ చిన్నవాడు. అంత పిన్నవయస్సులో కబీరు వైష్ణవమతం పుచ్చుకుని ఉపదేశం పొందివుండటం అసంభవంగా తోస్తుంది. అందుచేత కొందరు కబీరు ఇంకా ముందుగానే జన్మించాడంటారు. ఆ వాదం ఎంతవరకు సమర్ధనీయమో చెప్పటం కష్టం.

కబీరు జననానికి సంబంధించిన గాథ లన్నిటిలోనూ రామానందుని ప్రసక్తి వున్నట్లు మనం గమనించాం. సమకాలికుల్లో రామానందుడు సాధుసత్తముడన్నది నిర్వివాదం. అంతమాత్రాన ఆయనకూ కబీరుకూ గురుశిష్య సంబంధం వుండ నవసరంలేదు. నిజంగానే కబీరు రచించాడని చెప్పదగిన పంక్తులలో రామానందుని గురించిగాని మరి ఏ ఇతర సమకాలిక సాధువులను గురించిగాని ప్రశంస కనిపించదు. ఆయన రచన లన్నిటిలోనూ ఒక్కపదంలో మాత్రం మతి సుందర్ అనే మహనీయుని ప్రసక్తి కనబడుతుంది. దాని పల్లవి ఇలా వుంది:

నా మతిపోయి రాముని మరిచాను. ఇక జీవితం ఎలా సాగాలి?
సుఖశయన లాలసతో నాకళ్ళు మూత విప్పలేదు.
ఈ దుఃఖగాధ ఎవరికి చెప్పను?

ఆపదం చివర ఇలా వుంది:

ఇదే తగిన అదను. హృదయంలోని సంగతిని బాగా యోచించు. కబీరు అంటున్నాడు. ఓ మతి సుందరా! విను. రాముని ధ్యానమే అనుభవనీయం ఆనందప్రదం.

ఇక్కడ మతిసుందర శబ్దానికి మనస్సు సరియైనదారిలో సాగేవాడనే అర్థం చెప్పవచ్చు. అది ఒకవ్యక్తి నామంకూడా కావచ్చును. మతిసుందరుడనే మహనీయుడు రచించిన పదాలు కొన్నివున్నాయి. కాని కబీరు తన పదంలో ఆ మహనీయునే సంబోధించినట్లు నిశ్చయంగా చెప్పటానికి వీలు కాదు.

కబీరు సాధువరేణ్యుడే కాక గృహస్థుకూడాను. సంసారజీవనం గడుపుతూనే భక్తిమార్గంలో సంచరించవచ్చునని కబీరు అభిప్రాయం. ఆయన రచనవల్లనూ జీవితకథవల్లనూ ఈ సత్యం నిరూపితమవుతున్నది.

అనంతదాసు అనే సాధువు 1645 లో కబీరు జీవిత చరిత్ర రచించాడు.

"కబీర్ సాహెబ్‌కీ పరిచయ్" అని ఆ గ్రంథానికి పేరు, అందులో కబీరు సాలెవా డని పేర్కొన్నాడు. బట్టలు నేసి బజారుకు మోసుకుపోయి వాటిని అమ్మి వచ్చిన డబ్బుతో తన కుటుంబాన్ని పోషించుకోటమే కాక భక్తులకు అన్నదానం చేసేవా డు. ఒకనాడు బజారులో ఒక బీద బ్రాహ్మణుడు ఎదురై తనకు బట్ట ఇమ్మని కబీ రును అర్థించాడు. తనదగ్గర వున్న వస్త్రంలో సగం ఇవ్వటానికి కబీరు అంగీక రించాడు. కాని ఆ బ్రాహ్మణుడు మొత్తం తనకు ఇమ్మని పట్టుపట్టాడు. ఆ బ్రాహ్మ ణుని పేదరికాన్ని చూసి జాలిపడి కబీరు తనదగ్గర వున్న బట్టను పూర్తిగా ఇచ్చే శాడు. సాయంకాలం ఇంటిదగ్గర తన కుటుంబానికి ఆహారం ఎలా సమకూర్చా లనే సమస్య తలెత్తింది. రోజూలాగా తనదగ్గిర డబ్బు ఏమీ లేదు. కబీరు మనస్సు వికలమైపోయి ఇంటికి వెళ్ళ బుద్ధిపుట్టలేదు. ఆయన ఎక్కడికి వెళ్ళాడో ఇంట్లో ఎవరికీ తెలియలేదు. మనస్సులో బాధపడినా ఏమీ చెయ్యలేకపోయాడు. అల్లా మూడుదినాలు గడిచాయి. ఇంటిదగ్గిర అందరూ పస్తు పడుకున్నారు. అప్పుడొక అద్భుత సంఘటన జరిగింది. ఎవరో ఒక మనిషి ఎద్దువీపున ఆహారపదార్థాలు వేసుకుని కబీరు ఇంటి గడపదగ్గిర పడేసి వెళ్ళాడు. నీమా విస్మితురాలయింది. తనకుమారుడు ఇతరులవద్దనుంచి దానం గ్రహించడనీ, కష్టార్జితంకాని దేదీ పరి గ్రహించడనీ ఆమెకు తెలుసు. సరుకులు తెచ్చినమనిషి ఇలా చెప్పాడు: 'విశ్వ నాథుని దర్శనంకోసం ఒక రాజా వచ్చాడు. ఆయన నీ కుమారుని భక్తికి మెచ్చి ఎంతో ధనం దానంగా ఇస్తానన్నాడు. కబీరు స్వీకరించలేదు. ఎంతో బతిమాలిన తరవాత ఈ సరుకులు ఇంటికి పంపటానికి ఒప్పుకున్నాడు. కొంచెంసేపట్లో నీ కొడుకు ఇంటికి తిరికి వస్తాడు.' ఇలా చెప్పి ఆ సరుకులు తెచ్చిన మనిషి మాయమైపోయాడు. ఈ సంగతి కబీరుకు తెలిసింది. ఈ సంఘటన కరుణామ యుడయిన పరమాత్ముని అనుగ్రహానికి నిదర్శనంగా ఆయన గుర్తించాడు. పస్తులు పడివున్న తనకుంటుంబాన్ని ఇంకెవరు ఆదుకోగలరు? ఈ సంఘటనవల్ల భగ వంతుని మీద సంపూర్ణ విశ్వాసం అతని మనస్సులో ఏర్పడింది. మగ్గంపని కట్టి పెట్టి తనకాలమంతా భగవన్నామ సంకీర్తనకూ దైవచింతనకూ వినియోగించ సాగాడు. భక్తులందరికీ పెద్ద సంతర్పణ ఏర్పాటుచేసి తన కున్నదంతా ఖర్చుచే శాడు.

దీనివల్ల కాశీలోవున్న బ్రాహ్మణులందరికీ కబీరు మీద అసూయ కలిగింది. కబీరును పరాభవించటంకోసం కాచుకుని కూచున్నారు. కబీరు ముక్కు కోసివేసి అతన్ని వూళ్ళోంచి వెళ్ళగొట్టాలని నిశ్చయించుకొన్నారు కొందరు. కబీరు పేద

గుడిసెను చుట్టు ముట్టింది ఒక పెద్ద జనసమూహం. కబీరు వాళ్లందరినీ సగౌర వంగా ఆహ్వానించి ఆసీనులకమ్మని చెప్పి వచ్చిన పని యేమిటని అడిగాడు. 'నువ్వు వెంటనే వూరువిడిచి వెళ్ళాలి అని వాళ్ళు అరిచారు.' 'నేను ఏమి అప రాధం చేశాను' అని కబీరు అడిగాడు. 'నేను ఎవరికీ అపకారం చేయ్యలేదు. నా దారిన నేను రామనామం చేసుకుంటూ పోతున్నాను.'

'నువ్వు శూద్రులందరికీ సంతర్పణ చేశావు. మా మాట మరిచిపోయావు. ఇప్పుడు నువ్వు మా కందరికీ సంతర్పణ చెయ్యాలి. లేకపోతే వూరువిడిచి వెళ్ళాలి' అన్నారు బ్రాహ్మణులు. కబీరు చిక్కులో పడ్డాడు. ఇంట్లో బియ్యపు గింజకూడా లేదు. సంతర్పణకు సరుకులు తెస్తానని సాకుచెప్పి కబీరు వెళ్ళాడు.

అప్పుడు ఇంకో అద్భుతసంఘటన జరిగింది. కేశవబంజారా అనే మనిషి అక్కడికి వచ్చాడు. కూలీలచేత గోధుమపిండీ, పంచదారా, బియ్యం సంచులతో మోయించుకువచ్చాడు. ఒక్కొక్క బ్రాహ్మణుడికీ రెండుసూరశేర్ల ఆహారపదా ర్థాలు ఇచ్చి తాంబూలం ఇచ్చాడు. బ్రాహ్మణులు సంతోషపడి వెళ్ళిపోయారు. కబీరుని ప్రశంసించారు. ఇకనుంచీ కబీరుని ఎవరైనా నిందిస్తే నరకాగ్నిజ్వా లల్లో మాడిపోతారని వాళ్ళలోవాళ్ళు అనుకుంటూ వెళ్ళిపోయారు.

అప్పుడు భగవంతుడే బ్రాహ్మణవేషం ధరించి కబీరువున్నచోటికి వెళ్ళాడు. 'నువ్వు కబీరు ఇంటికి వెళ్ళు. అక్కడ బ్రాహ్మణుల గుంపువుంది. వాళ్లకి సత్కారం జరిగింది. ఆహారపదార్థాలు దానంగా ఇచ్చారు. నేను అక్కడినుంచే వస్తున్నాను. ఇవిగో నాకు దానంగా ఇచ్చిన వస్తువుల్వి' అని చూపించాడు. కబీరు ఇంటికి వెళ్ళి తను విన్నదంతా సత్యమేనని గ్రహించాడు. కబీరు పైకి ఏమీ అనలేదు. హృదంతరంలో 'ఇదంతా నన్ను సృజించిన ఆ మహాశక్తి లీలావిలాసం. భగవం తుడు తప్ప ఆపదలో నన్ను ఎవరు ఆదుకోగలరు? ఆయనే నాకు ఆశ్రయం' అనుకున్నాడు. దైవం పట్ల విశ్వాసం మరింత దృఢంగా నాటుకున్నది.

ఇది జరిగిన సంఘటనలకు అతిశయోక్తి కథనం కావచ్చు. కాని దీనిని బట్టి ఆయన తన సంసారపు యోగక్షేమాలపట్ల శ్రద్ధ కనబరిచేవాడనీ. సాధువులప ట్లనూ భక్తులయెడలనూ ఇంకా ఎక్కువశ్రద్ధ కనబరిచేవాడనీ. వాళ్ళ కష్టాలు నివా రించటానికి శక్తివంచనలేకుండా పాటుపడేవాడనీ స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఆయననుగురించి ఇటువంటి గాథలు వ్యాపించటంవల్ల కబీరు గృహానికి జనులు తండోపతండాలుగా రావటం మొదలుపెట్టారు. నిరంతర ప్రవాహంగా జనం రావటంవల్ల కబీరు ధ్యానానికి భంగం కలిగింది. కబీరు ఒక ఉపాయం

ఆలోచించాడు. ఒకనాడు పొద్దున్నే ఒక వేశ్యయింటికివెళ్ళి ఆమె బుజాలమీది చెయ్యివేసి ఆమెతో వీధుల వెంట తిరగటం మొదలు పెట్టాడు. పూజాస్థలం నుంచి పవిత్రమైన ఉదకం పట్టుకు వెళ్ళి నడివీధిలో మద్యపానం చేస్తున్నట్లు ఆనీళ్ళు తాగుతూ నటించాడు. కాశీ నగరంలో కబీరును గురించి ఎన్నో అపవాదులు బయలుదేరాయి. అతన్ని అందరూ ఎగతాళి చేయసాగారు. 'సాధుజీవనం గడపటం సాలెవాడికి సాధ్యమా? అదంతా మూడు నాళ్ల ముచ్చట. తక్కువ కులంవాళ్లకి గొప్పబుద్ధులు ఎక్కడినుంచి వస్తాయి?' అన్నారు. కబీరు ఆ వేశ్యను వెంటబెట్టుకుని కాశీరాజుదగ్గరికి వెళ్ళాడు. అంతకు పూర్వం కబీరు దర్బారుకు ఎప్పుడు వచ్చినా రాజుగారు ఎంతో గౌరవించి తన సరసన కూచోబెట్టుకునేవాడు. వేశ్యను వెంటబెట్టుకుని కబీరు రావటం చూసి ఆశ్చర్యపడి బైటికి గెంటివేయమని ఆజ్ఞాపించాడు. కబీరు ఇంతటి పతనం పొందటం చూసి దర్బారులో వున్నవాళ్లంతా విస్తుపోయారు.

అప్పుడు కబీరు తన పాత్రలోవున్న జలం కొంత నేలమీద చల్లాడు. నీరు ఎందుకు చిలకరించావని అడిగారు. పూరీ జగన్నాథ దేవాలయంలో వున్న ఒక పూజారికి వొళ్ళు కాలిందనీ దాన్ని చల్లార్చటంకోసం తను ఆవిధంగా చేశాననీ కబీరు బదులు చెప్పాడు. రాజుగారు కబీరు నీరు చిలకరించిన సమయం గుర్తు పెట్టుకుని వెంటనే ఒకదూతను పూరీకి పంపించాడు. కబీరు వెళ్ళిపోయాడు. రాజుగారు పంపినవాడు పూరీ చేరుకోవటానికి పది రోజులు పట్టింది. అక్కడ విచారించగా ఒక పూజారి వంట చేసేటప్పుడు వొళ్ళు కాలిందనీ. కబీరు చల్లిన నీళ్ళవల్ల గాయాలు మానిపోయాయనీ తెలిసింది. ఆ దూత అనుమానంగా అడిగాడు, 'కాశీలో వుండే కబీరేనా నీళ్ళు చల్లింది?' ఆ కబీరే అని పూజారి గట్టిగా చెప్పాడు. కబీరు ప్రతి దినమూ జగన్నాథుని దర్శనానికి పూరీ వస్తాడని కూడా పూజారి అన్నాడు. ఇది విని రాజదూత మరీ విస్మితుడయ్యాడు. కాశీకి తిరిగి వచ్చి విన్న సంగతులన్నీ రాజుగారికి నివేదించాడు. ఇది విని కబీరును అవమానించినందుకు రాజు పశ్చాత్తాపం పొందాడు. కబీరు దగ్గరికి వెళ్ళి క్షమార్పణ వేడుకోవాలని నిశ్చయించుకున్నాడు. కబీరు ఎవరివద్దనుంచీ కానుకలు స్వీకరించడు. కనక రాజు తన కుటుంబంలోని వారందర్నీ వెంటబెట్టుకుని నెత్తిమీద ఒక కట్టెల మోపునూ, మెడలో ఒక గొడ్డలినీ కట్టుకుని కబీరు ఇంటికి వెళ్ళాడు. ఆ రోజుల్లో క్షమాభిక్ష కోరుకోటానికి ఈ మాదిరిగా చేయటం రివాజు. కట్టెలమోపు కిందపెట్టి ఆసనం స్వీకరించవలసిందని కబీరు మర్యాదగా అన్నాడు. 'రాజా!

నువ్వు నిజంగా గొప్పవాడివి. సత్యాసత్యాల విభేదం గొప్పవారికి మాత్రమే తెలుస్తుంది.' ఈవిధంగా కబీరు తన సద్గుణాలను దాచుకోటానికి ప్రయత్నించినకొద్దీ అవి మరింతగా ప్రకాశించాయి. లోకానికి ఆయన మహిమ బాగా వెల్లడి అయింది.

పూరీ జగన్నాధాలయపు పూజారికి సంబంధించిన కథ కల్పితం కావచ్చు. కాని సాధు పురుషుల జీవితాల్లో దివ్యమహిమలు అసాధారణం కావు. వేశ్యకు సంబంధించిన కథను మాత్రం పూర్తిగా విశ్వసించవచ్చు. కబీరు సంప్రదాయ విరుద్ధమైన నిర్లక్ష్యధోరణికి ఈ కథ పొసగుతుంది. కబీరు మత గ్రంథాల్లో పూజారి కథగాని వేశ్యకథగాని కనిపించవు. కాని ధర్మదాసు తన శబ్దావళిలో కబీరు కాశీ నగరవీధుల్లో వేశ్యను వెంటవేసుకుని తిరిగినట్లు పేర్కొన్నాడు.

కబీరు మహిమ త్వరితంగా వ్యాప్తి చెందింది. ఇది బ్రాహ్మణ పురోహితులకు ముస్లిం కాజీలకు అసూయ రేకెత్తించింది. కబీరును అవమానించటంకోసం ఇరు తెగలవారూ సమయంకోసం కాచుకొని వున్నారు. ఆసమయంలో లోడీ వంశానికి చెందిన సికందర్ షా అనే పాదుషా ఢిల్లీ నుంచి కాశీకి వచ్చాడు. ఆయన చాలా కాలంగా ఎన్ని చికిత్సలు చేసినప్పటికీ నయంకాని జ్వరంతో బాధపడుతున్నాడు. రాజ్యంలో వున్న ఘనవైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. కాశీలో రామానందస్వామి, కబీరూ వ్యాధులు నివారణచేయగల మహిమాన్వితులని విని కాశీకి వచ్చాడు. కాశీకి చేరుకోగానే రామానందుని చూడటానికి వెళ్ళాడు. కాని మ్లేచ్ఛుల ముఖం చూడకూడదనే కఠిన నియమం ఆయనది. అందువల్ల నిరాశచెంది కబీరు దగ్గరికి వెళ్ళగానే ఆయన దృష్టి ప్రసారంవల్లనే జ్వరతాపం శమించింది. సికందర్ షా కబీరు కాళ్ల మీద పడ్డాడు. రామానందుని దగ్గరికిపోయి దర్శనం చేసుకోమని కబీరు సలహా ఇచ్చాడు. కబీరు సిఫార్సు చేసినందువల్ల రామానందుడు సికందర్ షాకు ప్రత్యేకంగా దర్శనం ఇచ్చాడు. సికందర్ షాకు కబీరుపట్ల గాఢాభిమానం ఏర్పడింది. ఇందువల్ల సికందర్ షా గురువైన షేక్ తకీ కబీరుపట్ల తీవ్రమైన అసూయాద్వేషాలు పెంచుకున్నాడు. ఒకే ఒరలో రెండుకత్తులు ఇమడవుకదా. తన శిష్యుడైన పాదుషా మత ద్రోహియైన ఒక ఫకీరును గౌరవించటం ఆయన ఎలా సహించగలడు? కనక కబీరును తుద ముట్టించటంకోసం కుట్రలు పన్నాడు. అప్పటికే కబీరుపట్ల కన్నెర్రగావున్న హిందూ పురోహితులూ, ముస్లిం కాజీలూ అతనితో చేతులు కలపటానికి సిద్ధంగావున్నారు. వాళ్ళు అతనిదగ్గరికిపోయి కబీరు మీద తమకున్న కడుపుమంట అంతా వెళ్లగక్కుకున్నారు.

అనంతదాసు రచించిన పరిచయ గ్రంథంలో సికందర్ షా కాశీ వచ్చినట్లు రాశాడుకాని జ్వరనివారణ ప్రసక్తి అందులో కనబడదు. షేక్ తకీ సికందర్ వెంట వచ్చినట్లు ప్రశంస లేదు. సికందర్ కాశీకి రాగానే కాజీలూ,ముల్లాలూ, బ్రాహ్మ లూ, వైశ్యులూ కట్టకట్టుకుని ఆయనదగ్గరికి వెళ్ళారట. కబీరు మీద తమకున్న ద్వేషమంతా వెల్లడిస్తూ ఎన్నో అభియోగాలు చేశారు. 'ఓ రాజా! మాకు న్యాయం చేకూర్చు. నువ్వు గొప్పవాడివి. ఒక సాలెవాడు అందరికీ అసహ్యంగా తయారై నాడు. తన మతమైన ఇస్లామును విడిచిపెట్టాడు. హిందూమతాన్నికూడా దుర్భాష లాడుతున్నాడు. ఏకాదశి నాడు ఉపవాసం వుండే ఆచారాన్ని ఖండిస్తున్నాడు. వేదాలనూ, యాత్రాస్థలాలనూ, శివ, సరస్వతి, గణేశ మొదలైన దేవతలనూ నిర సిస్తున్నాడు. హిందూ ముస్లిం మతాలను రెంటినీ కాదని తను ప్రత్యేకమతాన్ని స్థాపిస్తున్నాడు. తనే దైవమని చాటుకుంటున్నాడు. ఈ మతద్రోహి కాశీ నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్నంత కాలమూ ఎవరూ బ్రాహ్మణ పురోహితులనూ . ముస్లిం కాజీలనూ లక్ష్యం చేయరు. నువ్వు మా తండ్రివి. సంరక్షకుడవు. కబీ రును కాశీనుంచి బహిష్కరించి మమ్మల్ని కాపాడాలి' అని విన్నవించుకున్నా రు. ఇద్దరు భటులను పంపించి కబీరును తీసుకురమ్మని రాజు ఆజ్ఞాపించాడు. సికందర్ షా పాదాలకు మోకరిల్లవలసిందని కాజీ కబీరును ఆదేశించాడు. కబీరు అందుకు అంగీకరించలేదు. సికందర్‌కు ఆగ్రహం కలిగింది. 'ఓ క్షుద్రకులస్తుడా! నువ్వు నీ మతం నిర్దేశించేమార్గాన్ని వదిలి వినాశాన్ని ఎందుకు కోరుతున్నావు?' అని సికందర్ గర్జించాడు. కబీరు తొణుకూ బెణుకూ లేకుండా సమాధానం చెప్పా డు. 'నేను హిందువులూ, ముస్లిములూ చేసే విమర్శలకు జంకను, సరుకుచే యను, నా గురుకటాక్షం వల్ల రామ చింతనతో రామనామ సంకీర్తనతో జీవిస్తు న్నాను. పైనుంచి రాముడు నన్ను కాపాడుతున్నందువల్ల నేను రాజులకూ, రైతులకూ భయపడ నవసరంలేదు.'

'ఇతను మత ద్రోహి. ఇస్లాముకు విరోధి. జపమాల లాగివేసి గంధం చెరిపి వేసి రాతిబండకేసి కొట్టండి వీడిని' అని కాజీ ఆదేశించాడు.

'మతవిరోధివి నువ్వే. ఇంకెవరూ కారు. ఆవులనూ, మేకలనూ. పక్షులనూ చంపమని ఏమతం చెబుతున్నది? ఏ పవిత్ర గ్రంథం ఆదేశిస్తున్నది? యమధ ర్మరాజు హంతకుల బొమికెలు సున్నం చేస్తాడు, రామనామ మహిమలో నాకు సంపూర్ణ విశ్వాసం. నేను ఎవరిని చూసీ బెదరను' అని కబీరు నిర్భయంగా బదులుచెప్పాడు.

సికందర్‌కు కోపంలో వొళ్ళు తెలియలేదు. కాళ్లూ చేతులూకట్టి కబీరును గంగానదిలో పారవేయమన్నాడు. భటులు ఆయన ఆజ్ఞప్రకారం చేశారు. కాని, కబీరు రాముని స్మరించగానే కట్లు సడిలిపోయాయి. కొయ్యకుర్చీలో కూచు న్నట్లు కబీరు గంగాతరంగాల మీద హాయిగా కూచున్నాడు.

కొన్నిగ్రంథాల్లో సికందర్ షా కబీరును పరీక్షించటంకోసం ఒక గోవును చంపించి తెప్పించి 'నువ్వు నిజంగా భగవంతుడివైతే ఈ గోవును బతికించు, చూద్దాం!' అన్నాడని వుంది. కబీరు చేత్తో తాకినవెంటనే గోవు బతికిందట. ఇటు వంటి కథ నామదేవుని గురించి కూడా చెబుతారు. అదే కబీరుపేరుకు జోడించి వుండవచ్చు.

కబీరు నీళ్లలో మునగకపోవటం చూసి అతనికి ఇంద్రజాలం తెలుసుననీ రహస్యశక్తులున్నాయనీ వాళ్లు అనుకున్నారు. తరవాత ఇంకోసారి కాళ్లూ చేతులు కట్టేసి ఒకయింట్లోపడేసి ఆ ఇంటికి నిప్పు అంటించారు. ఈ ఆపదలో కూడా కబీ రును దైవమే కాపాడాడు. ఇల్లంతా కాలి బూడిదపోగుగా మారినా కబీరువంటికి సెగ తగలలేదు. లేశమైనా ప్రమాదం కలగలేదు.

కబీరు ప్రహ్లాదునికోవకు చెందిన భక్తుడు. ప్రహ్లాదుని కూడా ఇటువంటి కఠిన పరీక్షలకు గురిచేశారు. హోళికాదహన పరీక్షకు ప్రహ్లాదుడు గురి అయినాడు. కబీరు కూడా ప్రహ్లాదుని మాదిరిగానే చెక్కు చెదరకుండా అన్ని పరిక్షలకూ తట్టు కుని బైటపడ్డాడు.

కబీరువద్ద ఏవో మంత్ర శక్తులున్నాయని సికందరుకు నమ్మకం ఏర్పడింది. కనక ఇంకోసారి కాళ్ళూ చేతులూ కట్టివేయించి ఒక మత్తగజం వచ్చేమార్గంలో దాని కాళ్ళకిందపడి నలిగిపోవాలని పడవేయించాడు. ఆ మత్త గజం వెర్రి ఆవే శంతో మావటీడుని లక్ష్యపెట్టక తన నీడను చూసుకుని బెదిరి పడుతూ కాళ్ళతో మట్టగించేటట్లున్నది. దానివల్ల యుద్ధరంగంలో వీరులెందరో మరణించారు. రణ జీత్ అనే బిరుదు ఆమత్తేభాని కున్నది. ఆ గజాన్ని గొలుసులతో కట్టకుండా విడిచి పెట్టినప్పుడు ప్రజలు గగ్గోలుపడి పారిపోతారు.

కాని ఆ మదపుటేనుగు కబీరు దగ్గరికి రాగానే కాస్సేపు ఆగి దూరంగా పారి పోయింది. దాని కళ్లకు కబీరు ఒక సింహంలాగా కనిపించాడు. ఏనుగు బారినుంచి కూడా కబీరును భగవంతుడు రక్షించాడు. సికందరూ, షేక్‌తకీ కలిసి కబీరును కనీసం యాభై రెండుసార్లు రకరకాల పరీక్షలకు గురిచేశారని చెబుతారు. చిట్టచి వరికి వారిద్దరూ కబీరుకు పాదాక్రాంతులై క్షమాభిక్ష వేడుకున్నారు.

కబీరూ సికందర్ లోడీ సమకాలీనులనీ, ఇద్దరూ కలుసుకున్నారనీ ఒక వాడుక చాలా కాలం నుంచీ వున్నది. అంతేకాక పైన చెప్పిన మూడు రకాల పరీక్షలకు—నీళ్లలో పడెయ్యటం, నిప్పుల్లో తోయటం, ఏనుగు కాళ్లకిందకు విసిరెయ్యటం-సికందర్ లోడీ కబీరును గురిచేసినట్లు కూడా చెబుతారు. భక్తమాల కావ్య వ్యాఖ్యానంలో ప్రియదాసు సింకదర్ లోడీకి సంబంధం వున్న ఈ మూడు సంఘటనలనూ ఈ విధంగా వర్ణిస్తున్నాడు:

కబీరు కీర్తివల్ల బ్రాహ్మణులకు కన్ను కుట్టింది.
వాళ్ళు సికందర్ అనే రాజుదగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నారు.
కబీరు తల్లికూడా శత్రువుల్లో చేరింది.
కబీరువల్ల కాశీపురం నానా బాధలూ పడుతున్నదని విన్నవించుకున్నారు.

'అతన్ని నా దగ్గరికి తీసుకురండి. తగిన బుద్ధి చెబుతాను. తన తాహతు ఏమిటో గుర్తించుకునేట్లు చేస్తాను' అన్నాడు సికందర్.

కబీరును పట్టుకువచ్చారు. 'రాజుకు ప్రణామం చెయ్యి' అని కాజీ ఆదేశించాడు.

'రాముడే నా జీవనాధారం. ఇంకెవరికీ నేను ప్రణామం చెయ్యను' అన్నాడు.

అప్పుడు లోగడ పేర్కొన్న పరీక్షలకు కబీరును గురిచేశారు. దాదూదయాల్ అనే సాధుసత్తముని శిష్యుడు రజ్జబ్‌జీ ఈవిధంగా వర్ణించాడు:

వాళ్లు గొలుసులతో కబీరును బంధించి నీళ్ళలో విసిరేశారు. కాని నిప్పునూ, నీళ్ళనూ, ఏనుగునూ చూసి కబీరు చలించలేదు.

ఇదేవిధంగా రోహతక్ జిల్లాకుచెందిన చుదానీ గరీబ్‌దాస్ సాహెబ్ ఈ సంఘటనలను తన *గ్రంథసాహెబ్*లో పేర్కొన్నాడు.

'హృదయంలో నెలకొన్న భగవంతుని చరణారవిందాలపైన మనస్సు పగ్నమైనప్పుడు దేహ భీతి ఎందుకు?'

గంగాదేవి అతి గంభీరమైనది.
కబీరును గొలుసులతో బంధించి నీళ్లలో విసిరివేశారు.

తరంగాలు తగలగానే గొలుసులు తెగి పడిపోయాయి.
కబీరు కృష్ణాజినంమీద కూచున్నంతసుఖంగా అలలపైన ఆసీనుడైనాడు.
కబీరు అంటున్నాడు ఇంకే సఖుడూ సహాయకుడూ లేడు.
రాముడే రక్షకుడు నేలమీద వున్నా నీళ్లలో వున్నా.

అని కబీరు రచించిన ఒక పదంలో ఈ సంఘటన ప్రసక్తి కనిపిస్తున్నది.
ఇంకొక పదంలో అగ్నిపరీక్షనుగురించి ఈ విధంగా అన్నాడు:

రాముని ధ్యానిస్తుంటే అగ్ని దహించలేదు.
దేవుని నామంతో హృదయం నిండారిపోయినప్పుడు
తనలోనే అగ్ని తనలోనే పెనుగాలి.
భగవంతుడే దహిస్తే ఎవరు రక్షించగలరు?
ఎవరు దగ్ధమౌతారు? ఎవరు గాయపడతారు?
ఇదంతా భగవంతుని చర్యకదా!
కబీరు రెండుముక్కలు చెబుతున్నాడు.
భగవంతుడుంటే ఆయనే రక్షిస్తాడు.

ఈ పదాలు చాలా పురాతనగ్రంథాల్లో వున్నాయి. అవి నిస్సంశయంగా కబీరు రచనలని చెప్పవచ్చు. కనక ఈ సన్నివేశాల చిత్రణలో కొంత సత్యమున్నదని భావించవచ్చు. ఈ కఠిన పరీక్షల్లో నెగ్గినందువల్లనే కబీరు ప్రఖ్యాతి భారతదేశమంతటా వ్యాపించివుండవచ్చును. మాటలవల్లనే ప్రఖ్యాతి స్థిరపడదు. మాటలను, చేతలు బలపరచినప్పుడే స్థిరకీర్తి కలుగుతుంది. ఇరవైయోశతాబ్దపు పాఠకులు పై సంఘటనలను చారిత్రక సత్యాలుగా అంగీకరించకపోవచ్చు. అటువంటి వారికి మన ఆధ్యాత్మిక సంపదను చాలా భాగం కోల్పోయామనీ ఆ వారసత్వానికి మనం దూరమైనామనీ జ్ఞాపకం చేయటం సమంజసం. కబీరు యోగిపుంగవుడు, సాధుసత్తముడు. అటువంటి మహనీయుడు నిప్పునూ నీటినీ జయించటం అసంభవం కాదు. వాటి సహజ గుణాలు ఆయనను బాధించలేకపోయాయనటం అవాస్తవంకాదు. నేడు కూడా ఎందరో మహాయోగులు క్రూరమృగాలతో నిండిన దట్టమైన అడవుల్లో ఏకాంతంలో తమ ఆధ్యాత్మిక సాధనలను నిరాటంకంగా కొనసాగిస్తున్నవారు కనిపిస్తారు.

కాని బాధాకరమైన ఈ పరీక్షలన్నీ కబీరుకు సికందర్ లోడీ కల్పించాడా అనేది సమంజసమైన ప్రశ్న. కబీరూ సికందర్ లోడీ సమకాలికులనే వాదాన్ని ఆమోదించటం కష్టం. సికందర్ విక్రమ శకం 1545 నుంచీ 1575 వరకూ పరిపాలించాడు. చరిత్రకారులు కూడా ఆయన 1551 లో కాశీ నగరానికి వెళ్ళినట్లు చెబుతున్నారు. కబీరు 1505 నాటికే దేహయాత్ర చాలించి నట్లు మనకు తరవాత తెలుస్తుంది. కొందరి అభిప్రాయం కబీరు 1575 లో పరమపదించాడు అని. కబీరూ, సికందరూ కలుసుకున్నట్లు చెప్పటానికి చారిత్రకమైన ఆధారాలు లేనేలేవు. సికందర్ చాలా క్రూరమైన పరిపాలన సాగించాడు. హిందువులపట్ల చాలా అసహనం ప్రదర్శించాడు కనక కబీరు చరిత్రను మొదట రాసిన రచయితలు కబీరును పెట్టిన బాధలన్నిటినీ సికందర్‌కే ఆరోపించేసి ఆయన కారకుడని చిత్రించి వుండొచ్చు. కబీరు శాఖకు చెందిన కొన్ని గ్రంథాల్లో సికందర్ లోడీని పొరబాటున అలెగ్జాండరుగా పేర్కొనటం కూడా జరిగింది.

సికందర్ తోపాటుగా పేర్కొన్న షేక్ తకీయే కబీరుకు గురువనే అభిప్రాయం చాలా కాలం వుండేది. ఈ దురభిప్రాయం ఏర్పడటానికి మొదటి కారకుడు మౌలానా గులాం సర్వార్ కావచ్చు. ఖజేనతుల్ అసీఫా అనే గ్రంథంలో ఇలా అన్నాడు. 'సాలెవాడయిన షేక్ కబీర్ షేక్‌తకీ శిష్యుల్లో ఒకడు. భగవంతుని గురించీ ఆయన తత్వం గురించీ హిందీలో ప్రప్రథమంగా రచన చేసినవాడు ఆయనే. ఆయన ఉదార సహనశీలంవల్ల ముస్లిములూ హిందువులూ కూడా ఆయనను గురువుగా స్వీకరించారు. ఆయన విక్రమ శకం 1651 లో పరలోకగతుడైనాడు. షేక్ తకీ విక్రమ శకం 1631 లో మరణించాడు.' ఇక్కడ 1651 లో కబీరు పరమపదించినట్లు చెప్పటంవల్ల ఆయన సూఫీమతానికి చెందిన మరియొక మహనీయుడు కావచ్చుని తోస్తుంది. పొరబాటున ఆయనా, కాశీనగరంలోని సాధుపుంగవుడైన కబీరూ ఒకరే అని భ్రమపడి వుండవచ్చు ననిపిస్తుంది.

షేక్‌తకీ పేరు కబీరు పేరుతో ముడిపడటానికి కారణం కబీర్ బిజాక్ అనే గ్రంథంలో రెండుచోట్ల ఆ ముస్లిం బోధకుడి ప్రసక్తి వున్నందువల్ల కావచ్చు. కబీరు అనుయాయులు ఈ గ్రంథాన్ని ఆయన రచనల అత్యుత్తమ సంకలనంగా భావిస్తారు. అందులో 48 వ రమైనీలో ఇలా వుంది:

మణిక్‌పూర్‌లో మకాం చేస్తున్నప్పుడు కబీరు షేక్‌తకీ ప్రశంసలు విన్నాడు.
63 వ రమైనీలో ఇలా వుంది:

ఆయన నర్తకుడై నృత్యం చేస్తున్నాడు.
వివిధ రాగాలకు అనుగుణంగా నృత్యం చేయిస్తున్నాడు.
ఆయన అనంతుడు, అందరిహృదయాల్లో నర్తిస్తున్నాడు.
ఆలకించవయ్యా ఈ సంగతి షేక్ తకీ!

పై ప్రశంసలను బట్టి ఆ సత్పురుషులిద్దరూ ఎప్పుడో ఒక సారి కలుసుకున్నారనే తేలుతున్నది. ఇటీవల పరిశోధనలను బట్టి *కబీర్ బిజాక్* ఆయన మరణానంతరం ఎన్నోయేళ్ల తరవాత సంకలితమైనట్లు నిర్ధారణగా తేలింది. అందులో వున్న కబీరు రచనలన్నీ ప్రామాణికమైన కబీరు రచనలుగా స్వీకరించటానికి వీలులేదు. వాటిలో చాలా ప్రక్షిప్తాలున్నాయనవచ్చు. కనక ఆయన జీవితచరిత్రకు ఆధారంగా *కబీర్ బిజాక్* గ్రంథాన్ని గ్రహించటానికి వీలు లేదు. చరిత్ర ప్రకారం షేక్ తకీ కబీరు సమకాలికుడు కాడు. ఆయన కబీరు గురువు అనటానికి చరిత్ర ప్రకారం ఆధారం కనిపించదు. షేక్ తకీ అని పేరుగలవారు ఇద్దరు సూఫీ భక్తులున్నారు. ఒకాయన మణిక్‌పూర్‌లోనూ ఇంకో ఆయన అలహాబాదు సమీపంలో ఝున్సీలోనూ నివసించారు. మొదటి ఆయన కబీరు తర్వాత వంద సంవత్సరాలకు మరణించాడు. రెండో ఆయన కబీరు పుట్టుకకు వందసంవత్సరాలకు పూర్వం చనిపోయాడు. కనక వీరిలో ఎవరూ కబీరు సమకాలికులు కాపటానికి అవకాశం లేదు. దీన్నిబట్టి షేక్ తకీ ప్రసక్తివున్న రెండు రమైనీలు ప్రక్షిప్తాలనీ, తరవాత ఎవరో రాసి కబీరు రచనావళిలో ప్రవేశపెట్టినవనీ స్పష్టమౌతున్నాది. ఒకవేళ అవి కబీరు రచనలుగా మనం అంగీకరించినప్పటికీ ఇద్దరూ సమకాలికులని గ్రహించ గలం కాని ఆయన కబీరుకు గురువు అనటానికి ఆస్కారం లేదు.

అయినప్పటికీ కబీరు శాఖకు చెందిన *నిర్భావ జ్ఞాన, అనురాగ సాగర* గ్రంథాల్లో షేక్ తకీ కబీరూ భూమికలుగావుండే గాథలెన్నో వున్నాయి. షేక్ తకీ కనీసం యాభై రెండుసార్లు కబీరును విషమపరీక్షలకు గురిచేసినట్లు వాటిలో వుంది. కొన్ని పరీక్షలనుగురించి లోగడ చెప్పాను. ఇంకొక రెండు కఠినపరీక్షలను గురించి మనం తప్పక తెలుసుకోవాలి. కమాల్,కమాలీ అనేవారిని పునరుజ్జీవితులను చేయటానికి సంబంధించినవే ఇవి రెండూ.

తన కళ్లతో కబీరు మహిమలను చూసిన తరవాత ఆయన గొప్ప సాధుసత్తముడని సికందర్ నిదర్శనపూర్వకంగా విశ్వసించాడు. ఆయన ఢిల్లీకి తిరిగి వెళ్ళే

టప్పుడు కబీరును రమ్మని కోరగా కబీరు సమ్మతించాడు. రాజ లాంఛనాలతో అలంకరించిన భద్రగజాన్ని కబీరు ప్రయాణానికి వినియోగించాడు. అలహాబాదు చేరుకోగానే గంగా, యమునా నదులు ప్రయాగలో సంగమించే త్రివేణిక్షేత్రం వద్ద మకాం వేయాలని సికందర్ ఆజ్ఞాపించాడు. రాత్రి భోజనాలైన తరవాత కబీరు ప్రవచనాలను వింటున్నారు అందరూ. అప్పుడు నదీ ప్రవాహంలో తూర్పు దిక్కుకు తేలిపోతున్న ఒక శిశుకళేబరం వాళ్ళకి కనిపించింది. షేక్ తకీ సికందరును సంబోధించి 'ప్రభూ! కబీరుకు తనవద్ద వున్నదన్న మహత్తు నిజంగా వున్నట్లయితే ఈ మృతశిశువుకు ప్రాణం పోయమనండి, అలా చేయగలిగితే అందరికీ విశ్వాసం కుదురుతుంది' అన్నాడు.

కబీరు తనచెయ్యి పైకెత్తి ఆ బాలుడి శవాన్ని నడిచిరమ్మన్నాడు. ఆ ప్రకారంగానే ఆ బాలునికళేబరం నీళ్లలోంచి గబగబా నడిచివచ్చి కబీరుదగ్గర నిలబడింది. కబీరు దేవుని ధ్యానించి 'ఈ శరీరం మళ్ళీ ప్రాణప్రతిష్ఠ జరగాలి' అని ప్రార్థించాడు. అప్పుడు కబీరు హస్తంలోంచి ఒక జ్యోతి వెలువడి ఆ కళేబరంలో ప్రవేశించింది. శిశువు నీటిలోంచి ఒడ్డుకువచ్చి కబీరు పాదాలదగ్గర వాలింది. సికందర్ ఆశ్చర్యచకితుడైపోయి, 'కమాల్' అని కేకపెట్టాడు. 'ఆ కుర్రవాడు కనబడగానే నువ్వు కమాల్ అని అరిచావు కనక ఆ బాలుడిపేరు కమాల్ అని పెడదాము' అన్నాడు కబీరు.

ఆ బాలుడి పూర్వజన్మను గురించి తెలుసుకోవాలనే కుతూహలం సికందరు వెల్లడించాడు. వారందరికీ తన పూర్వజన్మగాథను చెప్పవలసిందని కబీరు ఆదేశించాడు. అప్పుడా కుర్రవాడు ఇలా చెప్పాడు: 'నేను పూర్వజన్మలో కొన్ని సంవత్సరాల కిందట ఉత్తరఖండంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాను. నాకు ఒక సోదరి వుండేది. ఇద్దరమూకలిసి హిమాలయాల్లో తపస్సు చేసుకోటానికి వెళ్ళాము. మమ్మల్ని అనుగ్రహించి కబీరు ప్రత్యక్షమైనాడు. మాకు ఆత్మజ్ఞానం ప్రసాదించవలసిందని ప్రార్థించాము. తగిన తరుణం వచ్చినప్పుడు ఆత్మజ్ఞానం మాకు సిద్ధించగలదని ఆయన సెలవిచ్చారు. తర్వాత కొన్నిసంవత్సరాలు గడిచాయి. నేను మరణించాను. నా తల్లిదండ్రులు నన్ను గంగానదిలో పడేశారు. ఆ తర్వాత ఏమిజరిగిందో మీకు తెలుసుగదా' కబీరు అనుగ్రహంవల్లనే తనకు గతజన్మస్మృతి కలిగిందని ఆ బాలుడు అన్నాడు. ఇది విన్నాక షేక్ తకీ చాలా సిగ్గుపడిపోయాడు. ఆ బాలుడు కబీరుకు శిష్యుడయాడు. ఎన్నో కథలవల్ల ప్రసిద్ధుడైనాడు.

చాలామంది కమాల్ కబీరు కుమారుడంటారు. గ్రంథసాహెబ్‌లో వున్న ఈ కింది రెండుపాదాలూ ఆధారంగా ఉటంకిస్తారు:

కమల్ అనే పుత్రుని జననంవల్ల కబీరు పతనం ప్రారంభమయింది.

భగవంతుని మాట మరిచి ధనార్జనచేసి ఇంటికి తేవటం ప్రారంభించాడు కబీరు.

గురువు ఆధ్యాత్మిక మార్గంలో పితృతుల్యుడు. కనక శిష్యుడిని కుమారుడుగా భావన చేయవచ్చు. కమాల్ కబీరుకు శిష్యుడే కావచ్చు. కబీరు గృహస్థజీవితం ప్రారంభించినప్పుడు పైన చెప్పిన రెండు పాదాలూ ప్రచారంపొంది వుండవచ్చు. కబీరునూ, కమాల్‌నూ గురించి మూడోవ్యక్తి వెల్లడించిన అభిప్రాయంగా పై పాదాలు ధ్వనిస్తాయి. ఇదివరకు చెప్పినట్లు కబీరు నిర్యాణానంతరం ఇతరులు రాసిన పంక్తులెన్నో ఆయనకృతుల్లో ప్రక్షిప్తాలైనవి.

కమాలీని గురించిన కథ ఇటువంటిది ఇంకొకటి ప్రచారంలో వున్నది. సికందర్ లోడీ దర్బారు చేస్తున్నాడు. కబీరు దర్బారులో ప్రవచనం చేస్తున్నాడు. షేక్ తకీ ప్రవేశించాడు దర్బారు హాలులో. అప్పటికి కొన్నిదినాల కిందట అతని ముద్దులకూతురు మరణించింది. అందువల్ల గాఢసంతాపంలో మునిగివున్నాడు. 'అందరికీ తెలుసునుగదా కబీరు కొంతకాలంకిందట గంగానదిలో తేలిపోతున్న ఒక శవానికి ప్రాణం పోశాడు. అది ఘనకార్యం అనటానికి వీలులేదు. ఎందుకంటే ఒక్కొక్కప్పుడు మిగతాశరీరాన్ని విడిచిపెట్టిన ప్రాణం మెదడును పట్టుకునివుంటుంది. కొంచెం ప్రత్నంచేస్తే, కొంతనేర్పు ప్రదర్శిస్తే అటువంటిశరీరంలో ప్రాణ సంచారం చేయించవచ్చు. కాని నాకుమార్తె మరణించింది. సమాధి చేశాం. నా బిడ్డను గనక కబీరు బతికించగలిగితే నేను జీవితాంతమూ ఆయన భక్తుడినై మెలుగుతాను.' కబీరు సమాధిని తెరుచుకోవలసిందని ఆజ్ఞాపించగానే అది విచ్చుకుని అందులో శవం కనబడింది. 'షేక్‌తకీ పుత్రికా! లేచిరావమ్మా' అన్నాడు కబీరు. అదే విధంగా ముమ్మారు అన్నప్పటికీ కళేబరం కదల్లేదు. కబీరును హేళన చేస్తూ గుసగుసలు చెలరేగాయి. 'కబీరు పుత్రికా! లేచిరావమ్మా!' అని కబీరు మళ్ళీ అనేసరికీ ఆ పిల్ల లేచికూచుని కబీరు పాదాలమీద పడింది. కబీరు ఆ పిల్లకు కమాలీ అని పేరుపెట్టాడు. ఆ తరవాత కమాలీ ఎప్పుడూ కబీరునే తండ్రిగా భావించి అనుసరించేది. ఆ దృశ్యం చూడగానే షేక్ తకీ హృదయం ద్రవించిపోయింది. ఆయన చాలా పశ్చాత్తాపపడి కబీరును క్షమాభిక్ష వేడుకున్నాడు. కమాలీ షేక్ తకీవెంట వెళ్ళటానికి నిరాకరించి కబీరు పోషణలోనే జీవితమంతా గడిపింది.

కమాల్, కమాలీలకు సంబంధించిన కథలు కబీరు శాఖకుచెందిన గ్రంథాల లోనేకాక గరీబ్‌దాస్ ప్రభృతి మహనీయుల కృతుల్లోకూడా వాటి ప్రసక్తి వుంది. కాని ఈ రెండుకథల్లో ఏ ఒక్కదానిని గురించి కూడా అనంతదాస్ తన పరిచయ్ గ్రంథంలో పేర్కొనలేదు.ధరమ్‌దాస్ లాగే కమాల్, కమాలీలు కూడా కబీరు చని పోయినపిమ్మట చాలాకాలానికి జన్మించి వుండవచ్చు. ధర్మ్‌దాస్ లాగా వారి రువురూకూడా కబీరు అనుయాయులై వుండవచ్చు. అందువల్ల ధరమ్‌దాస్‌తో పాటు వారిరువురినికూడా కబీరు సన్నిహితశిష్యులుగా లోకులు పరిగణించివుం డవచ్చు. ఏమైనప్పటికీ కమాల్, కమాలీలు కబీరు బిడ్డలు కారని నిశ్చయంగా చెప్పవచ్చు. వారిరువురూ కబీరుకు సమకాలికులైనప్పటికీ ఆయన శిష్యులే కాని బిడ్డలు కారు.

కమాల్, కమాలీలు కబీరు బిడ్డలని వాదించేవారు కబీరు వివాహాన్ని గురించి కూడా కొన్ని సిద్ధాంతాలు సృష్టించారు. కబీరు భార్యపేరు లోయీ అనీ. వారి వివాహంవల్ల కమాల్, కమాలీలు జన్మించారనీ అంటారు. కబీరుకూ లోయీతో పరిచయం ఏర్పడటాన్నిగురించి ఒక చిత్రమైన కథ వున్నది. గంగానదీతీరంలో వున్న అరణ్యంలో ఒక సాధువు వుండేవాడు. ఒక నాడు నదిలో స్నానం చెయ్య టానికి వెళ్ళినప్పుడు *గొంగళిలో* చుట్టివున్న ఒక పసిపాప నదీ ప్రవాహంలో కొట్టుకుపోతూ కనిపించింది. ఆ బిడ్డను చూసి జాలిపడి తన గుడిసెకు తీసుకు పోయి పెంచి పెద్దదాన్ని చేశాడు. *లోయీ (గొంగళి)లో* చుట్టివున్నది కనక ఆ పాపకు సాధువు లోయీ అని పేరు పెట్టాడు. చాలాసంవత్సరాలు గడిచాక ఆ శిశువు యుక్తవయస్కురాలైన తరవాత ఒక నాడు కబీరు ఆ దారివెంటవెళ్తూ సాధువు ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పుడు సాధువు ఆశ్రమంలో లేడు. తన పెంపు డుతండ్రి పక్షాన లోయీ కబీరుకు స్వాగతం పలికింది. ఇంతలో మరికొందరు సాధువులు అక్కడికి వచ్చారు. లోయీ సాధువులకు గిన్నెలలో పాలుపోసి ఇచ్చిం ది. అందరూ ఆరగించారు కాని కబీరు తనకిచ్చిన పాలగిన్నెను ముందు పెట్టు కుని తాగకుండా కూచున్నాడు. ఎందుకు పాలు తాగటంలేదని అడిగితే కబీరు కొంచెంసేపట్లో గంగానది దాటి ఒక సాధువు ఇక్కడికి వస్తున్నాడని నాకు తోస్తున్నది. ఆయనకు ఈ గిన్నెలోపాలు అట్టే పెట్టాను ఇవ్వటానికి' అన్నాడు. అన్న ప్రకారంగా కొంచెంసేపట్లో ఇంకోసాధువు వచ్చాడు. ఈ సంఘటన చూసి లోయీ నిశ్చేష్టు రాలై పోయింది. వెళ్ళివస్తానని కబీరు లేవగానే కూడా నేనూ వస్తానన్నది లోయీ. వెంట తీసుకువెళ్ళమని బతిమాలుకున్నది. కబీరు అంగీకరించాడు. లోయీ ఆయ

నను అనుసరించింది. తరవాత ఇద్దరూ వివాహం చేసుకున్నారు. జీవితాంతమూ ఆమె కబీరును సేవించింది.

కబీరుశాఖకు చెందిన కొన్ని గ్రంథాల్లో లోయీ కబీరు శిష్యురాలు మాత్రమే కాని భార్యకాదని కనిపిస్తుంది. వారు చెప్పేకథ ఇది. లోయీని సాకిన సాధువు మరణసమయంలో ఆమెను దగ్గరికిపిలిచి 'బిడ్డా నేను త్వరలో నిన్నువిడిచి వెళ్తాను. నాకాలం తీరిపోయింది. నువ్వు మాత్రం ఈ ఆశ్రమంలోనే వుండు. ఒకనాడు ఇక్కడికి ఒక మహాత్ముడు వస్తాడు. ఆయన అన్ని ప్రశ్నలకూ ఒకేసమాధానం చెబుతాడు. నువ్వు ఆయనను అనుసరించు. ఆయన రాక కోసం ఇక్కడే నిరీక్షించు' అని కళ్లు మూసుకున్నాడు. లోయీ ఒంటరిదై పోయింది. ఆ మహాత్ముని ఆగమనంకోసం ఎదురుచూస్తూ ఆశ్రమంలో కాలం గడుపుతోంది. ఒకనాడు ఆమె ఆశ్రమానికి ఇద్దరు మహాత్ములు వచ్చారు. ఇద్దరకీ స్వాగతం చెప్పి గిన్నెల్లో పాలుపోసి ఇచ్చింది. ఒకాయన ఇచ్చిన వెంటనే పాలుతాగేశాడు. రెండో ఆయన 'త్వరలోనే ఇక్కడికి ఇంకో మహాత్ముడు రానున్నాడు. ఆయనకోసం పాలు అట్టే పెట్టాను' అన్నాడు. ఈయనను 'మీ పేరేమిటి?' అని ప్రశ్నించింది లోయీ. కబీరు అని బదులు చెప్పాడు. మీ మతమేమిటి? అని అడిగితే మళ్ళీ కబీరు అని సమాధానం చెప్పాడు. మీ శాఖ యేమిటి అని ప్రశ్నిస్తే మళ్ళీ అదే ప్రత్యుత్తరం. కబీరు అని. అన్ని ప్రశ్నలకూ ఆ మహాత్ముడు కబీరు అనే సమాధానమే చెప్పటంవల్ల తన పెంపుడు తండ్రి అవసాన దశలో సూచించిన మహాత్ముడీయనే అని లోయీ గ్రహించింది. 'నన్ను మీ శిష్యురాలుగా స్వీకరించండి. ఎవరూలేని నాకు మీరే ఆశ్రయం' అంది లోయీ.

'బిడ్డా! నన్ను అనుసరించు. భగవంతుని ధ్యానించు. ఈశ్వరసేవకు జీవితం అంకితం చేసుకో' అని కబీరు బదులుచెప్పాడు.

కబీరు రచనల్లో తరుచుగా లోయీ అనేమాట కనిపిస్తుంది. అది ఒక స్త్రీ పేరు అని, ఆపేరుమీద కథలు అల్లటంవల్ల ప్రజాభిప్రాయం పొరబాటుకు గురి అయిందని చెప్పక తప్పదు. కబీరు తనబోధలను లోయీని సంబోధించి ఆలపిస్తున్నట్లుగా రచనల్లో కానవస్తుంది.

ఉదాహరణకు: 'కబీరు అంటున్నాడు, విను, లోయీ
నే నెవరికీ కాను, నాకెవరూ లేరోయీ'
'కబీరు చెబుతున్నాడు విను, లోయీ

ఏదీ చూసి మోసపోరాదోయా

శబ్దపరిణామక్రమంలో ప్రజలు అనే అర్థంలో వాడే సంస్కృతశబ్దం లోకం, లోయి, లో, లోగ్ రూపాలుపొంది హిందీలో ప్రస్తుతంవున్న లోగ్ అనే రూపం ధరించింది. 'విను లోయీ! అని కబీరు అన్నదానికి జనులారా వినండి అనే అర్థం. కొందరు ఆశబ్దాన్ని స్త్రీపరంగా అన్వయించుకుని ఎన్నో కథలు అల్లారు. అమాయకులు కల్పించే కథల వల్ల కబీరు పేరు కళంకితం కావటం గమనించి, ఆయన పంథాను అనుసరించేవాళ్ళు కథలో కొంచెం మార్పుచేసి, లోయీ కబీరు భార్యకాదు శిష్యురాలని అన్నారు. లోయీనిగురించిన ప్రసక్తి అనంత దాస విరచిత పరిచయ్ లో కాని, ప్రాచీన కాలంలో రచితమైన జీవితకథల్లోగానీ కనిపించదు. కబీరు రచనల్లో ప్రామాణికంగా పరిగణింపబడే బానీలో ఎక్కడా లోయీ అనే పదం జనులు అనే అర్థంలోకాక మరొక అర్థంలో ప్రయుక్తం కాలే దు. లోయీశబ్దాన్ని స్త్రీ పరంగా అన్వయించటానికి ఆస్కారం కనబడదు.

మరికొందరు కబీరుకు రెండో పెళ్ళాం కూడా వున్నట్లు వూహించారు. ఆమెకు ధనియా, రామ్‌జనియా అని రెండు పేర్లున్నాయట. సిక్కుల పవిత్ర గ్రంథమైన *గ్రంథసాహెబ్*లో కబీరు రాసిన పదాలు కొన్ని కనిపిస్తాయి:

'ధనియా నా కోడలు
వాళ్లు ఆమెను రమ్‌జనియా అని సంభోధించారు.
ఈ వితంతువులు నా గృహం నాశనం చేశారు.'

ఇటువంటి పదాలన్నీ నిజంగా కబీరు రాసినవే అయితే ఆయనకి సంసార మున్నదని అంగీకరించాలి. కాని గ్రంథసాహెబ్‌లో కబీరుపేరుతో ఆయన రచిం చని పదాలెన్నో వున్నాయని అందరికీ తెలిసినవిషయమే. కబీరు తన రచనలను పత్రాలమీద వ్రాయలేదు. ఆయన నోటితో చెప్పేవాడు. వాటిని జాగర్తగా రాసి వుంచుకోలేదు. కబీరు గ్రంథజాలంలో ఆయన జీవిత కాలంలో సంకలితమై ప్రక టితమైనది ఒకటైనా లేదు. రచనలన్నీ ఆయన మరణానంతరమే సంకలితమై వెలువడినాయి. అందుచేత అన్నిట్లోనూ చేర్పులూ, మార్పులూ, ప్రక్షిప్తాలూ వున్నా యి. కొన్నిట్లో ఎక్కువగానూ, కొన్నిట్లో తక్కువగానూ వున్నప్పటికీ అన్నిట్లోనూ ఈ దోషాలున్నాయి. కబీరు రచనల్లో ఏదో ప్రమాణికమో, ఏది అనుకరణమో తేల్చి చెప్పలేనంత తికమక ఏర్పడింది. అందువల్లనే 'కబీరు చెప్పింది కొంతా,

సాధువులు అల్లింది కొంత' అనే సామెత చాలాకాలంగా వాడుకలో వుంది. కాబట్టి పైన ఉటంకించిన పదాల వంటివి కబీరు రచించాడా తరవాత సాధువు లెవరైనా కల్పించారా అనేవిషయం నిర్ధారణగా చెప్పలేము. కబీరు రచనల్లో ప్రామాణిక మైనవాటిని కృతకమైనవాటి నుంచి విడదీయటానికి నేను ఎంతో కృషి చేశాను. ఆయన ప్రామాణిక రచనలుగా నేను నిశ్చయించినవాటిని కబీరు గ్రంథావళి అనే శీర్షికతో ప్రకటించాను. వాటిలో పైన ఉల్లేఖించిన పదం కాని ఇటువంటి ఇతర పదాలు కాని కనబడవు. అవి కబీరు రచనలు కావని నా నిశ్చయమైన అభిప్రాయం. నిజంగా ఆయన రాసినవే అయితే వాటికి ఏదో గూఢార్థం వుండొచ్చు, సామాన్యంగా చెప్పుకునే అర్థం అన్ని సందర్భాల్లోనూ సరిపోదు. మామూలు అర్థంవల్ల ఆయన హృదయం అవగాహన కాదు. ఆయన రచనల్లో ఛాయాత్మక మైన మార్మిక దృష్టి వుంది.

కబీరు రచనగా చెలామణి అవుతున్న ద్విపద ఇంకోటి ఉంది:

అవివేకినై కొంతకాలం వుంచుకున్నాను ఒక కాంతను
ఆఖరికి విసర్జించాను ఆ దుష్టురాలి చింతను.

ఇది కబీరు రచనకాదని వెంటనే చెప్పవచ్చును. విశ్వసనీయమైన గ్రంథ సంకలనాల్లో ఈ ద్విపద లేదు. కాని ప్రామాణిక రచనల్లో కూడా కొన్ని సందర్భాల్లో చిక్కులు ఎదురవుతాయి.

కబీరు తల్లి దిగులుపడి అంటుంది
ఈ బిడ్డ ఎల్లా జీవిస్తాడు దైవమా!
కాని, విను తల్లీ అంటాడు కబీరు
సర్వేశ్వరుడే మనకూ ఇస్తాడు ఆహారం.

ఈ పదంలో ఈ బిడ్డ అనేది కబీరు కుమారుడిని సూచిస్తుందని వాదించవచ్చు. కానీ కబీరు తల్లి వేదనతో వేగిపోయేహృదయంతో కబీరును గురించే ఈ బిడ్డ అని వుండటం సహజం. ఎంత వయస్సు వచ్చినా తల్లిదృష్టికి కబీరు బిడ్డగానే కనబడటం మాతృస్వభావమునకు అనుగుణం.

సారాంశమేమంటే కబీరు సంసారిగా జీవించినప్పటికీ, కుటుంబ భారం వహించినప్పటికీ ఆయనకు వివాహం అయినట్లుగాని, సంతానం కలిగినట్లుగాని చెప్ప

టానికి ఆధారం లేదు.

కబీరు వివాహితుడై సంతానవంతుడై కుటుంబపోషణ చేసినట్లు కొందరు విశ్వసించటానికి ఉత్సుకత ప్రదర్శిస్తుంటే మరికొందరు కబీరు బ్రహ్మచర్యదీక్షను నిరూపించటానికి ఉత్సాహపడుతున్నారు. ఆయన జితేంద్రియత్వాన్ని నిరూపించే కథ ఒకటి వున్నది. ఒకసారి విష్ణుమూర్తి ఒక అప్సరసను పిలిచి 'కాశీనగరంలో నా భక్తుడు కబీరు వున్నాడు. నీ సమ్మోహనశక్తులన్నీ ప్రదర్శించి అతన్ని పరీక్షించు. నువ్వు జయిస్తావో నిన్నేజయిస్తాడో తేల్చుకో' అన్నాడు. అప్పుడా అప్సర అద్భుతంగా సింగారించుకుంది. స్వర్గంలో లభించే దివ్యాభరణాలతో అలంకరించుకుంది. కబీరును జయించాలనే వుద్దేశంతో కాశీకి బయలుదేరింది. ఆమె వాక్కులలో సుధామధుర నిష్యందం. ఆమె సౌందర్యం సృష్టికర్తయైన బ్రహ్మనుకూడా ముగ్ధుణ్ణి చేయగలదు. ఆమెనడక నృత్యంలాగుంది. ఎవరివైపు ఒక చూపు ప్రసరించినా ఆ వ్యక్తిహృదయం మరుని తూపులతో గాయపడి కదలలేకుండా పోతుంది.

ఆమె కబీరు దగ్గరికి వెళ్ళి 'అలా నేలచూపులు చూస్తావెందుకు? నా కళ్ళలోకి తొంగిచూడు. నాప్రేమనూ సౌందర్యాన్ని పొందటానికి ప్రజలు ఏ పనికైనా సిద్ధపడతారు. హిమాలయాలకుపోయి తపస్సు చేయమన్నాచేస్తారు. కాశీకి పోయి ఉపవాసాలుండమన్నా వుంటారు. అయినా నన్ను వాళ్లు పొందలేరు. నా అంతట నేను నిన్నువలచి వచ్చాను. నన్ను నీ దానినిగా చేసుకుని ఏలుకో. నీ చిరతపస్సులఫలాన్ని అనుభవించు' అన్నది కులుకుతూ. కబీరు చలించలేదు. 'అయితే నువ్వు స్వర్గాన్ని వదిలి ఎందుకు వచ్చావు తల్లీ! అక్కడ నీకు ఏమికష్టాలు వచ్చాయి? నేను నిరుపేద సాలెవాడిని. నావృత్తి చాలా న్యూనత కలిగినటువంటిది. కస్తూరీ పరిమళాలు గుభాళించే రాజకుమారుల అంతరంగ మందిరాలలో సంచారం చేయవలసినదానివి. నేను కరగని కఠిన శిలను. నా పక్కనవుంటే నీకు అవమానాలు తప్పవు. నాకు నీ కళ్లలో విషజ్వాలలే కనిపిస్తున్నాయి. నీకు నా హృదయంలో చోటులేదు. నా ఆత్మ భగవంతునికి సంపూర్ణంగా సమర్పితమై పోయింది. నన్ను మన్నించు' అన్నాడు.

ఆ అప్సరస ఎన్ని పన్నాగాలు పన్నినా ఎత్తులు వేసినా లాభం లేక పోయింది. చివరికి విష్ణుమూర్తిదగ్గరికి తిరిగివెళ్ళి 'సూర్యుడు పడమట ఉదయిస్తాడేమో కాని కబీరు హృదయంమాత్రం చలించదు' అని చెప్పింది. ఇది విని విష్ణుమూర్తి చాలా సంతోషించాడు. కబీరు ముందు సాక్షాత్కరించి నీకు ఏ వరం కావాలో

కోరుకో, నేను ప్రసాదిస్తాను. సార్వభౌమాధికార సూచకమైన కిరీటం కావాలా. అష్టసిద్ధులూ కావాలా, సమస్తవిశ్వాన్నీ పాలించే పదవి కావాలా కోరుకో' అని అడిగాడు.

'త్రిలోకాధిపతీ! నేను ఏమీకోరను. నా అల్పబుద్ధికి నీ సంకల్పం ఎలా అర్థమవుతుంది? ఒక చీమ పర్వతాన్ని మోయగలదా? నక్షత్రాలు చంద్రుని కాంతిని మరుగుపరచలేవు. మహాసముద్రం చిన్న దోసిలిలో ఇముడుతుందా?' అనేసరికీ విష్ణువు మరింత ఆనందభరితుడైనాడు. కబీరు తలపైన తన హస్తంవుంచి జరా మరణాలకు అతీతుడవు కాగలవని ఆశీర్వదించి అదృశ్యుడైనాడు.

ఈ కథను గురించి వ్యాఖ్యానించ నవసరంలేదు. ప్రతి మహాత్మునికీ ఇటువంటి కథలు ఆపాదించటం జరుగుతున్నది. ఈ కథల వల్ల భగవంతునికి అంకితమై పోయిన చిత్తాలను ఏ ప్రలోభాలూ ఆకర్షించ లేవనే విషయం స్పష్టమౌతుంది.

కబీరు తన బోధనలను ప్రచారంచేయటంలో ఆసక్తి చూపిసప్పటికీ ప్రత్యేకమైన మతాన్ని స్థాపించలేదు. కాని నేడు కబీరుమతాన్ని ప్రచారంచేసే శాఖలూ ఉపశాఖలూ కేంద్రాలూ దేశంలో పలుతావుల్లో వున్నాయి. కబీరు శిష్యుల్లో ప్రముఖులు ఈ శాఖోపశాఖలను స్థాపించినట్లు భావిస్తున్నారు. ధర్మదాసు సాహెబ్ చేత చటిస్‌గరీశాఖ నెకొల్పబడింది. ఈ శాఖను అనుసరించేవారు కబీరు తన నిర్యాణానంతరం బాంధవగర్‌లో అవతరించి తన బోధలన్నీ ధర్మదాసుకు అందించి ఆయనను ఒక శాఖను నెలకొల్పవలసిందని ఆదేశించినట్లు విశ్వసిస్తారు. ఈ శాఖ కబీరు పేరుతో కొనసాగుతున్నప్పటికీ కబీరు మరణానంతరమే దీన్ని నెలకొల్పినట్లు ఇందువల్ల స్పష్టమౌతున్నది. బీహారు రాష్ట్రంలో సరన్ జిల్లాలో ధనౌతీవద్ద ఆరామంలో కేంద్రం ఏర్పరుచుకుని విస్తరించినశాఖను భగవాన్‌దాస్ అనే ఒకరు నెలకొల్పినట్లు భావిస్తున్నారు. ఆయన కబీరు అంతేవాసియనీ, కబీరు రచించిన భజనలన్నీ ఆయన లిఖితరూపంలో భద్రపరిచాడనీ భావించబడుతున్నది. ఆయన కబీరు రచించిన ఆరువందల భజనలను సంకలనపరిచాడు. దీనికి తరవాత బిజాక్ అని పేరు కలిగింది. కాని భగవాన్‌దాస్ కబీరుకు సమకాలికుడన్న విషయం ఇంతవరకూ నిర్ధారణ కాలేదు. కాశీలోని కబీర్‌చౌరాలో ప్రథమ పూజారియైన మహంత్ సూరత్ గోపాల్‌ను గురించి కూడా ఇటువంటి అభిప్రాయమే ప్రచారం పొందింది. ఎందరు బతిమాలినప్పటికీ కమాల్ కబీరు పేరగాని తనపేరుతోగాని ప్రత్యేక మతాన్నిస్థాపించటానికి అంగీకరించలేదట. ప్రత్యేక మత స్థాపన అవసరమని కమాల్ తలపోయలేదు. కబీరు ప్రత్యేక మతాల స్థాపనను

నిరసించాడు. నిజాయితీతోకూడిన కృషితో నిరాడంబరమైన సార్థక జీవితం గడపాలనే కబీరు ఉద్ఘాటించాడు. కబీరు ప్రముఖ శిష్యుల్లో కమాల్‌ను ప్రథముడుగా పరిగణించవచ్చును. కాని అతని జీవితం తాలూకు సంఘటనలు తెలియరావటం లేదు. కమాలీని గురించి లోగడ ముచ్చటించాము. వీరుకాక పద్మనాభ, తత్వ, జీవ, జ్ఞాని, జగదాస్, రామ్‌కృపాల్ ప్రభృతులు కబీరు శిష్యుల్లో ముఖ్యులు.

కబీరు ఏమీ చదువుకోలేదట. *బిజాక్* లోవున్న సాకీ ఈ అభిప్రాయానికి ఉపపత్తిని కల్పిస్తున్నది. అది ఈ విధంగా వుంది:

> కబీరు కలమూ కాగితమూ ముట్టలేదు, సిరాను తాకలేదు.
> నాలుగుయుగాల్లో సాధుసత్తముడై వెలసిన కబీరు తన మాటల
> ద్వారానే బోధలు చేశాడు.

కబీరు బడికి పోయి చదువుకోలేదని అంగీకరించవచ్చును. కాని ఆయన అక్షరాస్యుడే. మతమునకూ ధార్మిక జీవనమునకూ, సంబంధించిన విషయాలలో ఆయన గాఢమైన పరిజ్ఞానమూ, అవగాహనమూ పెంపొందించుకున్నాడు. వేదములూ, ఉపనిషత్తులూ, బోధించిన విషయాలన్నీ ఆయనకు పరిచితాలు. భగవద్గీత. భాగవతం ఆయనకు అందుబాటులోనివే. గోరఖ్‌నాథశాఖకు చెందిన తంత్రాలతో మర్మాలతో ఆయనకు ప్రగాఢమైన పరిచయమున్నది. ఆ సంప్రదాయానికి చెందిన యోగుల భావనలతో ఆయనకు పరిచయమున్నది. శైవశాక్తజైన మతాల ముఖ్యసిద్ధాంతాలు ఆయనకు తెలుసు. ఇస్లాం మతాన్ని గురించి ఆమూలాగ్రంగా ఆయనకు తెలుసు. అయినప్పటికీ ఈ మతాలను వేటినీ గుడ్డిగా అనుసరించకపోవటమే ఆయన విశిష్టత. జటిలమైన ఆధ్యాత్మిక సమస్యలను అవగాహన చేసుకోటంలోనూ, పరిష్కరించటం లోనూ కబీరు ప్రత్యేకత గోచరిస్తుంది. ఆయన మేధాశక్తి సునిశితం, సముజ్వలం. ఎంతోకాలం మనస్సులో మధనం జరిగినతరవాతనే నిర్గుణభక్తి మార్గాన్ని ఆయన ప్రతిపాదించాడు. ఈ మార్గాన ప్రేమకూ విరహానికి ప్రముఖస్థానం ఇచ్చాడు. బాహ్యాడంబరాలనూ, కపటాచారాలను నిరసించాడు. మానసిక పరివర్తనం అవశ్యమని ప్రబోధం చేశాడు. ఈ పరివర్తనం సాధించటంకోసం సురటియోగమనే నూతన విధానం రూపొందించాడు. స్వచ్ఛందమైన సహజ జీవనం గడపాలనీ వైదికవిధి నిషేధాలనూ, ప్రజాభిప్రాయాలనూ లక్ష్యం చేయకుండా సరళమైన జీవనం గడపాలని కబీరు ఉపదేశించాడు.

కబీరు రచనల్లో ఆయన అభిప్రాయాలు ప్రకటితమైనాయి. దురదృష్టవశాన ఆయనరచనల్లో ఆయనవి కానివికూడా చేరటంవల్ల ఏది ఆయనదో, ఏది కాదో

విడదీయటం జటిలసమస్యగా తయారయింది. కబీరు కలమూ, కాగితమూ వాడ కపోవటం వల్లనూ, కృతులను గ్రంథస్థం చేయనందువల్లనూ, వాటిని క్రమబద్ధం చేయకపోవటంవల్లనూ ఇంత క్లిష్టపరిస్థితి ఏర్పడింది. పోనీ ఇతరులెవరూ కబీరు అనుమతి సంపాదించి ఈ పని చేయలేదు. భగవాన్ సాహెబ్ ఒక్కడు మాత్రమే కబీరు రచనలను *బిజాక్* అనే సంకలనంగా రూపొందించాడని ఇదివరకే చెప్పాను. ఈ సంకలనం పరీక్షిస్తే ఇది అనుకున్నంత పురాతనం కాదని స్పష్టపడుతుంది. కాని ముద్రితమైన కబీరు గ్రంథాల్లో *బిజాక్* ప్రథమంగా చెప్పవలసింది. ఇప్పుడు సుమారు ముప్పై నలభై ముద్రణలు వెలువడ్డాయి. ఈ భిన్నమైన ముద్రణలన్నీ ఇప్పుడు లభ్యమౌతున్నాయి. కబీరుమతస్థులు *బిజాక్*ను మతగ్రంథంగా ఉన్నత పీఠం ఏర్పరచటంవల్ల ఇన్ని ముద్రణలు జరిగాయి. అది పవిత్రగ్రంథమనీ, అందు లోనివన్నీ స్వచ్ఛమైన ప్రామాణిక రచనలనీ వారు భావిస్తారు. కాని సత్యం చెప్పాలంటే ఇప్పుడు లభ్యమౌతున్న కబీరు రచనలు ఏవీ పూర్తిగా ప్రామాణికా లనటానికి వీలులేదు. కబీరు జీవితకాలం నాటి సంకలనాలుకాని, ఆయన నిర్యాణం పొందినవెంటనే వెలువడినవికానీ మనకు లభ్యం కావటంలేదు. ఇందువల్ల రచనా క్రమంలోనూ, పాఠభేదాలలోనూ ఒక పుస్తకానికి మరొక పుస్తకానికీ సంతనపొం తనలేదు. విక్రమ శకం 1661 లో అయిదవ గురువైన అర్జునసింగ్ ఆదేశానుసా రంగా సిక్కుల మతగ్రంథం *గ్రంథసాహెబ్* వెలువడింది. ఇది సంత్‌వాఙ్మయా నికి గొప్ప భాండాగారం. సిక్కుగురువుల బోధలతోపాటు ఇతర సంత్‌కవుల రచ నలెన్నో ఇందులో చేర్చారు. ఇందులో కబీరు రచించినట్లు చెప్పేవి 225 పదా లూ, 250 ద్విపదలూ వున్నాయి. తమగురువుల ఆత్మలు గ్రంథసాహెబ్‌లో అక్ష రరూపంలో నివసిస్తాయని సిక్కుల విశ్వాసం. అందువల్ల పునర్ముద్రణ చేసేట ప్పుడు ఒక్క అక్షరంకూడ మార్చకూడదనే భావంతో అతి జాగర్తగా ఉన్నపాళం గానే ప్రకటిస్తారు. కనక శతాబ్దాలతరబడిగా గ్రంథసాహెబ్‌లోని రచనల పా ఠంలో భేదం రాలేదని గ్రహించవచ్చు. కాని మొదటిసారి గ్రంథసాహెబ్‌లో చేర్చ టానికి ఎంచుకున్న కబీరు రచనల పాఠంలోనే దోషాలుండవచ్చు. కారణం ఏమైనా గ్రంథసాహెబ్‌లో చేర్చిన కబీరు రచనలు నిర్దుష్టము లనటానికి వీలులేదు. ప్రామా ణికాలుగా ఎంచటానికి వీలులేదు. ఇదేవిధంగా ఇతర మతగ్రంథాల్లో కొన్నిట్లో కబీ రు రచనలు కనపడతాయి. అన్ని మతాలవారూ కబీరుకు ఉన్నతస్థానం ఇచ్చి గౌరవిస్తారు. రాజస్థాన్‌లో దాదూమతం బాగా ప్రచారం పొందింది. పూర్వం ఇంకా విస్తృతంగా వుండేది. వారి పవిత్రగ్రంథం *పంచవాణి*. ఇందులో సంత్ పంచక

రచనలు చేర్చి వెలువరించారు. ఆ మతస్తులు నిత్యమూ గ్రంథాన్ని పూజించి అయిదుగురు సంత్‌పురుషులనూ ఆరాధిస్తారు. దాదూ, కబీరు, నామదేవ్, రాయ్ దాస్, హరిదాస్‌ల రచనలూ పైన చెప్పినక్రమంలో పంచబాణీలో వున్నాయి. కబీరుకు ప్రత్యేకించినపుటలలో ఆయనవి 400 పదాలూ, 800 సాఖీలూ, కొన్ని నాలుగుపాదాల రచనలూ వున్నాయి. ఇటువంటి సంకలనమునే కాశీలోని నాగరీ ప్రచారసభ కబీరు *గ్రంథావళి* అనే మకుటంతో ప్రకటించింది. సిమా, బరోడా లలో వున్న కబీరు ప్రెస్సూ, బొంబాయిలోని వెంకటేశ్వర ప్రెస్సూ కబీరు సాఖీల సంకలనాలు ప్రచురించారు. అలహాబాద్‌లోవున్న బెల్వడీర్ ప్రెస్సూ, వారణాసి లోని కబీర్ చౌరా శబ్దావళి అనే మకుటంతో కబీరు పదాలను మాత్రం ప్రకటించా రు. శాంతి నికేతనవాసియైన క్షితిమోహన్ సేన్ ప్రశంసనీయమైన కృషిచేసి కబీరు రచనలు సేకరించి నాలుగు సంపుటాలుగా ప్రకటించాడు. వీటిలో ఒక పందరచనలను రబీంద్రనాథ్ టాగోరు ఆంగ్లీకరించారు. ఆయన ప్రేరణతో జరిగిన ఈ కృషిమూలాన కబీరువాణి భారతదేశాన్ని దాటి విదేశాల్లో ముఖరించింది. కబీరు రచనలవల్ల రవీంద్రుడు బాగా ప్రభావితుడైనాడు.

కాని ప్రచురితమైన రచనల విషయంలో కొన్నిటి ప్రామాణికతను గురించిన సంశయం వుండనే వుంది. ఆయన రచనల్లో ప్రామాణికమైన వాటిని ఇతరమైనవాటి నుంచి విడదీయగలిగినప్పుడే ఈ మహాపురుషుని ప్రాముఖ్యాన్ని మనం సరిగ్గా తెలుసుకోగలుగుతాము. నేను అసంఖ్యాకములైన వ్రాతప్రతులను పరిశోధించాను. ముద్రితగ్రంథాలను పరిశీలించాను. 1600 పదాలనూ, 4500 సాఖీలనూ. 134 రమైనీలను (నాలుగు పంక్తులుగల రచనలు) సేకరించాను. వీటిలో నిజంగా కబీరు రచించినవి ఎన్ని? కాని కబీరు అనుయాయుల అభిప్రాయంలో ఆయన రచనలు అనంతాలు. చెట్టునవున్న ఆకులు ఎన్నో, గంగానదిఒడ్డున ఇసుకరేణువు లెన్నో ఎవరూ లెక్కపెట్టలేనట్లే కబీరు రచనలు కూడా అగుణితములని. అపరిమేయములనీ వారి నమ్మకం. కనక అవి మానవులబుద్ధికి అగమ్యగోచరములని వారి విశ్వాసం. అయినప్పటికీ కబీరు మరణించిన పిమ్మట తొలినాళ్ళలో గ్రంథస్థం చేయబడిన పదాలను గుర్తించటానికి ప్రయత్నం చెయ్యవచ్చు. తరవాత వెలువడిన సంకలనాలన్నీ దీనిపైన ఆధారపడినవే. నిస్సంకోచంగా ప్రామాణికములని చెప్పదగినవి. సుమారు 200 పదాలూ, 20 రమైనీలూ. 750 సాఖీలు వున్నాయనే నిశ్చయానికి వచ్చాను. ఈ సంకలనం కబీరు *గ్రంథావళి* అనే పేరుతో అలహాబాదు విశ్వవిద్యాలయం తాలూకు హిందీ విభాగం ద్వారా

ప్రకటితమయింది. కాని ప్రకటితమైన పాఠాలకూ తొలుత కబీరు కంఠం నుంచి వెలువవడిన రూపాలకూ వ్యత్యాసంలేదని చెప్పటం కష్టం. కాని కబీరు పేరుతో వెలువడ్డ రచనలన్నిటిలోనూ ఇవే అత్యంత ప్రామాణికమైనవని ప్రతిపాదించవచ్చు.

కబీరు అనుచరులు ఆయన ఇతరులతో మతసంబంధమైన వాదాలూ చర్చలూ జరిపి వాళ్లని తనవైపుకు తిప్పుకోగలిగాడని అంటారు. తన అనుయాయులకు తరుచుగా ప్రబోధాలు చేస్తూ వుండేవాడని చెబుతారు. కబీరు గోరఖ్‌నాథ్, శంకరాచార్య, యోగజిత్, సర్వజిత్, హనుమాన్, వశిష్ఠ, రాయ్‌దాసప్రభృతి మహనీయులతోనూ, దేవతల దూతయైన దత్తాత్రేయునితోనూ వాదాలు జరిపినట్లు నిరూపించే లిఖితమైన దాఖలాలు చాలావున్నాయి. మహమ్మద్, సుల్తాన్. గరుడ. అమర్‌సింగు, వీరసింగు, జగజీవన్, భూపాల్, కమాల్, ధర్మదాస ప్రభృతులకు చెప్పిన ప్రవచనాలున్నాయి. కబీరుతో వాదించినట్లు పేర్కొనబడిన వారంతా ఆయన సమకాలికులు కారు. కొందరు వాస్తవవ్యక్తులు కారు. దేశ, కాల, చరిత్రాది విషయాలపట్ల శ్రద్ధ చూపలేదు. ఆయన వాదప్రౌఢిమ నిరూపించదలచిన వారు. అయినా కబీరు అనుచరులు ఈ వాదాలన్నీ అక్షరాలా ఆయన కంఠం నుంచే వెలువడిన పరమతసత్యాలని భావిస్తారు. కబీరుకు అన్నితావుల్లోనూ అన్ని సమయాల్లోనూ సంకల్పమాత్రంచేతనే అవతరించగల శక్తి వుందని ఆయన అనుయాయుల విశ్వాసం. కబీరు మతం ఇతర మతాలతో పోటీచేసి నిలబడవలసిన అవసరం ఏర్పడినప్పుడు, కబీరు మతప్రాశస్త్యాన్ని నిరూపించవలసిన అగత్యం కలిగినప్పుడు ఈ వాదాల తాలూకు కథలు బయలు దేరివుండవచ్చు. వివాదాలను గురించిన గ్రంథాల్లో వున్న కొన్ని విషయాలు అసంభవాలుగా తోస్తాయి. కబీరుతో మతసంబంధమైన వాదాలు చెయ్యటానికి వెళ్ళినప్పుడు గోరఖ్‌నాథ్ తన త్రిశూలం నేలలో నాటి ఒక మొనపైన తాను కూర్చుని రెండోమొనపైన కూర్చోటానికి రమ్మని కబీరును పిలిచాడట. కబీరు మగ్గాన్ని ఒకసారి కదిపి పొడుగైన దారపుపోగు ఒకటి తీసి ఆకాశంలోకి విసిరేసి దాని కొనపైన కూచుని 'నాథ్‌జీ! మీ త్రిశూలం నేలమీద వుంది. నా దారంపోగు నీలాకాశంలో వుంది. నేలమీదికంటే ఇక్కడ సుఖంగా వుంటుంది. మనం ఇక్కడ కూచుని వాదంలో దిగుదాం' అన్నాడట కబీరు.

ఈ సన్నివేశం గోరఖ్‌గోష్ఠిగ్రంథంలో పేర్కొనబడింది.

ఆ గ్రంథంలో ఇంకో సంవాదం ఇది:

గోరఖ్‌నాథ్ ప్రశ్న : ఎవరిచ్చారు నీకు దండం, భిక్షాపాత్ర, కృష్ణాజినం? రుద్రాక్షమాల ఎవరిచ్చారు? నామం ఎవరుపదేశించారు?

కబీరు ప్రత్యుత్తరం : బ్రహ్మదేవుడు దండమూ భిక్షాపాత్రా ఇచ్చాడు. శివుడు కృష్ణాజినం ఇచ్చాడు. గురువు నామం ఉపదేశించాడు. విష్ణువు జపమాల ఇచ్చాడు.

గోరఖ్‌నాథ్ ప్రశ్న : అడుగునా, తలమీదా, నాలుగు డెక్కలూ, రెండు చెవులూ.

తెలిస్తే సమాధానం చెప్పు, లేకపోతే నీ జోలీ, నీ జపమాలా వొదిలేసి పో.

కబీరు సమాధానం : అడుగున నేల, తలమీద ఆకాశం నాలుగు దిక్కులూ నాలుగు డెక్కలు, సూర్యచంద్రులు రెండు చెవులు.

నేను ఓడిపోను, నా జోలీ, నా జపమాలా వొదిలిపోను. రామానందుడు నా గురువు. ఆయనమీద ప్రమాణం చేస్తున్నాను. ఈ కొమ్ము, ఈ జోలె, ఈ దండం ఇంకొక అర్థాన్ని సూచించవు.

ఇటువంటి పంక్తుల కర్తృత్వం కబీరుకు ఆపాదించటం చాలా అసమంజసం. గోరఖ్ మతస్థులతోనూ, ఇతరులతోనూ వాదవివాదాలు ఏర్పడినప్పుడు కబీరు అనుయాయులే ఇటువంటి ప్రశ్నోత్తరాలు కల్పించి వుండొచ్చు.

కబీరు తన జీవితావసాన దశలో కాశీ విడిచి నప్పుడు బస్తీజిల్లాలో పున్నమఘర్ పట్టణానికి వెళ్ళాడు. కాశీ విడిచి వెళ్ళటానికి అనేక కారణాలు చూపిస్తున్నారు. మఘర్ పట్టణంలో చనిపోయినవారికి మోక్షప్రాప్తి కలగదని హిందువుల్లో ఒక నమ్మకం వుంది. ఈ నమ్మకానికి మూలాధారం పురాణాల్లో వుంది. పూర్వకాలంలో దక్షప్రజాపతి మఘర్ పట్టణంలో ఒక యజ్ఞం చేసి శివుణ్ణి ఆహ్వానించలేదు. తన భర్తను అవమానపరిచినందుకు సహించలేక సతీదేవి ప్రాణత్యాగం చేసింది. ఇది విని రుద్రుడు ఉగ్రుడైపోయి యజ్ఞాన్ని ధ్వంసం చేయవలసిందని తన ప్రమథగణాలకు ఆజ్ఞాపించాడు. మఘర్ పట్టణంలో మరణించిన వాళ్ళు గాడిదలుగా పుడతారని శపించాడు. మఘర్ పట్టణానికి శాపవిమోచన కలిగించటానికి, ఈ మూఢవిశ్వాసాన్ని నిరసించటానికి కబీరు కాశీ విడిచి అక్కడికి వెళ్ళాడట. కబీరు కాశీ విడిచి వెళ్లటానికి నిశ్చయించుకున్నట్లు విని, మఘర్‌పట్టణంలో దేహం విడిచిపెట్టటానికి పోతున్నాడని తెలుసుకుని రాజులూ. నవాబులూ, సామాన్యప్రజలూ తండోపతండాలుగా కబీరును చివరిసారి దర్శించి సెలపు తీసుకోటానికి వెళ్ళినట్లు కబీరు మతగ్రంథాల్లో వర్ణించారు. కాశీరాజు వీరసింగ్‌దే

వు, రేవారాజు రామ్‌సింగ్, అయోధ్య నవాబు మహమద్‌ధౌలా కబీరువద్దకు వెళ్ళి తమను మఘర్ పట్టణందాకా వెంట రానీయవలసిందని బతిమాలుకున్నారు. వాళ్ళ కోరికను మన్నించి తనవెంట రావటానికి కబీరు అనుమతించాడు. తనవెంట వచ్చిన ప్రముఖులతో పాటు కబీరు మఘర్‌పట్టణం చేరుకోగానే అది జనసందోహంతో క్రిక్కిరిసిపోయింది. కాశీ నగరం కళావిహీనమైపోయి ఎడారిగా శూన్యంగా తోచింది. మఘర్ నవాబు బిజిలీభాను పఠాను అతిథులందరికీ విందుభోజనాలు ఏర్పాటు చేశాడు. కాని అతిథులసంఖ్య అపరిమితం కావటం చేత మంచినీరు సరిపోలేదు. శివుని శాపఫలితంగా ఆపూరిదగ్గరి నదిలో నీరు ఇంకిపోయింది. మఘర్ పురవాసులకష్టాలు కడతేర్చటంకోసం కబీరు తన దివ్యమహిమను ప్రయోగించాడు. నదిలో కొత్తనీరు వెల్లువలై పారింది. కొత్తనీరు అమృతంలా చల్లగా మధురంగా వుంది. అందువల్ల ఆ నదికి అమీ అనేపేరు వచ్చింది. అప్పుడు కబీరు తన కడపటి ప్రవచనం చేసి గుమికూడిన శ్రోతలను అలరించి చేరువలో వున్న ఒక సత్పురుషుని కుటీరంలో ప్రవేశించి తలుపువేసుకుని లోపలగడియ బిగించుకున్నాడు. కొంచెంసేపట్లో ఏదో బద్దలైనట్లు శబ్దం వినిపించింది. జ్యోతిర్మయమైన గోళం ఒకటి ఆ గుడిసెనువీడి గగనవీధికి ఎగసిపోవటం అందరికీ కనిపించింది. కబీరు తమను వీడ్కొని సిద్ధిపొందాడని అందరూ గ్రహించారు.

అప్పుడు పెద్ద తగాదా రేగింది. కాశీరాజు, వీరసింగూ తదితర హిందువులూ కబీరు తమ గురువుకనక హిందూధర్మం ప్రకారం ఆయన దేహానికి దహన క్రియలు జరపాలని వాదించారు. నవాబు బిజ్లీభానూ తదితర ముస్లిములూ కబీరు తమ వీరుల్లో ఒకడనీ కనక ముస్లిం సంప్రదాయానుగుణంగా కబీరుశరీరాన్ని సమాధి చెయ్యాలని పట్టుపట్టారు. వివాదం తెగలేదు. ఉద్రేకాలు రెచ్చిపోయాయి. చివరికి బలాబలాలు తేల్చుకునేదానికి ఒరలోంచి కత్తులు దూశారు. అప్పుడు ఆకాశవాణి అందరికీ వినిపించింది. 'నా ప్రియజనులారా! పరస్పర హత్యలకు దిగవద్దు. మొదట కుటీరంలోకి ఒకసారి వెళ్ళిచూడండి' అని అశరీరవాణి ఉద్బోధించింది. కుటీరం తలుపులు భేదించిచూశారు. జనం లోపలికి తోసుకువెళ్ళారు. అక్కడ కబీరు శరీరం వాళ్ళకు కనిపించలేదు. శరీరం వుండవలసినచోట ఒక తెల్లటిబట్టా, కొన్నిపువ్వులూ కనబడ్డాయి. కబీరు శరీరంతో సహా స్వర్గానికి చేరుకున్నాడని అందరూ సంతసించారు ఆయనకు మోక్షప్రాప్తి కలిగినందుకు ఆనందించారు. అప్పుడు ఆ తెల్లబట్టనూ, పువ్వులనూ రెండుభాగాలు చేసి హిందువులూ, ముస్లిములూ సమంగా పంచుకున్నారు. సగభాగం దహనం చేయ

టానికీ, మరొకసగం సమాధిచేయటానికీ సమాధానపడ్డారు.

గరీబ్‌దాసు ఇలా చెబుతున్నాడు :

కాశీ విడిచి మఘర్‌కు వెళ్లి అంతర్ధానమైపోయాడు కబీరు.
ఒక వస్త్రం, కొన్నిపుష్పాలూ, తనవాక్కులూ మనకు మిగిల్చాడు.

మాలుక్‌దాస్ ఈ విధంగా అంటున్నాడు:
ఉభయ మతస్తులకు గురువైన కబీరు కాశీనుంచి మఘర్‌కు తరలిపోయాడు.
ఉద్రిక్తులైన శిష్యులు కొందరు దహనంచెయ్యాలనీ, కొందరు సమాధి జర పాలనీ వాదాలు చేశారు.
సద్గురువు పంచభూతాలకు అతీతుడు, ఆయన అజరామరమూర్తి.
మాలుక్‌దాసు అంటున్నాడు: కబీరులో ప్రభువును కనుగొనండి.

కబీరు శరీరం నేల, నిప్పూ, గాలీ, నీరూ అనే భూతాలను అతిక్రమిం చింది. ఆయన సకల భూతాతీతుడని ఆయన పథాన్ని అనుసరించే భక్తుల విశ్వాసం.

కొందరు పండితుల అభిప్రాయంలో కబీరు పుట్టిన కుటుంబంలో ఖననమూ. దహనమూ రెండూ వున్నాయంటారు. మృతశరీరాన్ని దహనంచేసి చితాభస్మ రాసులమీద సమాధి నిర్మించేవారట. ఆకాలంలో కొన్ని భిక్షుకజాతులుండేవి. ఆ జాతులవారు కొత్తగా ఇస్లాంమతం పుచ్చుకొని వుంటారు. అందువల్ల వాళ్లు హిందూ ముస్లిమ్ మతాలకు రెంటికీ చెందిన ఆచారాలను పాటిస్తూ వుండవచ్చు. ఈ తెగ కుచెందిన చాలామందికి వృత్తి చేనేత. కబీరుకూడా ఈ తెగవాడు అయివుండొ చ్చు. ప్రాచీన రచనల్లో తెల్లబట్టనూ పువ్వులనూ గురించిన ప్రసక్తి లేనిమాట నిజ మే. పరిచయ్ గ్రంథంలో కబీరు కాశీ విడిచి మఘర్‌కు వెళ్ళినట్లు మాత్రం చెప్పాడు కాని పువ్వుల మాట అందులో అనంతదాసు చెప్పలేదు.

అయినప్పటికీ కబీరు మఘర్ పట్టణంలో సిద్ధిపొందా డనటానికి సందేహంలేదు. ఆయన రచించిన రెండు పదాలలో చివరి రోజుల్లో కాశీ నుంచి మఘర్‌కు వెళ్లి నట్లు కబీరే చెప్పుకున్నాడు. అందులో ఒక పదంలో ఈ విధంగా వుంది:

దైవమా! ఇప్పుడు నాకేదిదారి?
బతుకంతా కాశీలో గడిపాను

అవివేకినై మఘర్‌లో మరణించటానికి వచ్చాను.
ఎంతోకాలం కాశీలో సాగింది నా తపస్సు.
ఇప్పుడు మఘర్‌లో వింటాను
మరణభుజంగం బుస్సు!

రెండో పదంలో కబీరు నిశ్వాసం వెల్లడి అవుతున్నది :

ఓ ప్రజలారా! ఎంత అమాయకులు మీరు?
కాశీలో మరణిస్తే భగవంతుని చేరుకోగలడా కబీరు!
హృదయంలో నిశ్చలభక్తి వున్నవారికి అసాధ్యంలేదు.
జలం జలంలో కలిసినట్లుగా
ఈ సాలె సర్వేశ్వరునిలో లీనమై పోతాడుగా!
ప్రజలారా వినండి ఈ రహస్యం
కాశీ అయినా మఘర్ అయినా ఒకటేకదా
ఆత్మలోదైవం నెలకొనివుంటే సదా!

కాశీలో చనిపోయినా మఘర్‌లో మరణించినా తన విశ్వాసంద్వారా మోక్ష ప్రాప్తి కలుగుతుందని కబీరుకు గట్టినమ్మకం. నీరూనీరూ ఏకమైనట్లు తన రాము నిలో తాను లీనమౌతానని కబీరు నిశ్చల విశ్వాసం.

కాబట్టి కబీరు మఘర్‌లో తనువు చాలించడనటానికి విప్రతిపత్తి లేదు. ఆయన పరమపదించిన కాలాన్ని గురించి అనేక వాద భేదాలున్నాయి. ఈ క్రింది నాలుగు పదాల ఆధారంగా నాలుగు భిన్నాభిప్రాయాలు బయలు దేరాయి.

1. 1575 లో కబీరు కాశీ నుంచి మఘర్‌కు వెళ్ళాడు. మాఘమాసపు కృష్ణ పక్ష ఏకాదశి నిశీధంలో శ్వాస గాలిలో కలిసిపోయింది.
2. 1505 లో కబీరు కాశీ విడిచి మఘర్‌కు వెళ్ళాడు. ఆగహన్ మాసంలో కృష్ణపక్ష ఏకాదశి రాత్రి శ్వాస గాలిలో ఏకమైపోయింది.
3. 1549 లో కబీరు కాశీ వదిలి మఘర్ చేరుకున్నాడు, ఆగహన్ మాసంలో కృష్ణపక్ష ఏకాదశి రాత్రి శ్వాస గాలిలో లీనమైపోయింది.
4. 1569 లో సద్గురువు నిష్క్రమించాడు. హంస ఎగసిపోయింది.

పైన చెప్పిన సంవత్సరాలు విక్రమ శకాన్నిబట్టి పేర్కొన్నవే.

మొదటి పదానికి చెందిన కొన్ని పాఠాంతరాల్లో 'అగహన్ మాసంలో ఏకాదశి చీకటిరాత్రి, అని వున్నది, ఈ పదాలకు ప్రామాణికమైన పాఠాలు లభించటం లేదు. అవి ప్రజల ముఖతఃప్రచారం పొంది జ్ఞాపకశక్తి ఆధారంగా గ్రంథస్థమైనవి. ఈ నాలుగు పదాలకూ కర్తలెవరో తెలియదు. కబీరు అనుయాయులు మొదటి పదం వైపు ఎక్కు మొగ్గుచూపి కబీరు విక్రమ శకం 1575 లో సిద్ధిపొందినట్లు విశ్వసిస్తున్నారు. కనక కబీరు 1456 జ్యేష్ఠ పూర్ణిమనాడు జన్మించి 1575 లో అగహన్ మాసంలో ఏకాదశి నిశీధందాకా, కృష్ణపక్ష ఏకాద శిదాకా అంటే 119 సంవత్సరాల 5 మాసాల 27 దినాలు జీవించినట్లు విశ్వసిస్తున్నారు ఆయన మతస్తులు. కబీరు మతానికి చెందిన బాబూ లహన్‌సింగ్ తన *కబీర్ కసౌటీ* గ్రంథంలో 1575 వ సంవత్సరంలో మాఘమాసంలో కృష్ణపక్ష ఏకాదశి బుధవారంనాడు కబీరు పరమ పదించినట్లు ఆనాడే ఆయన కాశీ నుంచి మఘర్‌కు చేరుకున్నట్లు రాశాడు. కాని పంచాంగం ప్రకారం ఆనాడు బుధవారం కాదు మంగళవారం అవుతుంది.

కాని భారతదేశ పురాతత్వశాఖ ఒక నివేదికలో బస్తీజిల్లాలో అమీనది తీరంలో బిజ్లీభాను కబీరుకు విక్ర మశకం 1507 లో సమాధి నిర్మించి నట్లు పేర్కొంటున్నది. ఈ సమాధిని 1567 A.D. అంటే విక్రమ శకం 1624 లో 117 సంవత్సరాలతరవాత నవాబ్ ఫిదాయ్‌ఖాన్ మరమ్మతు చేయించాడు. దీన్ని బట్టి రెండో పదంలో చెప్పినప్రకారం కబీరు 1505 లో కీర్తిశేషుడైనట్లు తేలుతున్నది. ఎవరైనా మరణించినవెంటనే సమాధి నిర్మించటం సాధారణంగా జరుగుతుంది. కనక మొదటి పదంలో చెప్పిన 1575 అన్నది 1605 కావచ్చు. ఆనోటా ఆనోటా పడి అది చివరికి 1575 అని పొరబాటున పడివుండవచ్చు. ఆ పదం రచింపబడిన మాండలిక భాషలో 1575 అనే శబ్దం ఉచ్చరించే రీతి 1505 తరవాత అన్నట్లు వుండవచ్చు. పచహాతర్ అనేమాట పశ్చాత్ అనే శబ్దానికి దగ్గరగా వుంటుంది ఉచ్చారణలో. ఇది సరియైన తేదీ అయితే కబీరు చనిపోయేనాటికి ఆయన వయస్సు 50 సంవత్సరా లన్నమాట.

పూర్వకాలపు భక్తులూ, మహాత్ములూ తమ జీవితచరిత్రల వివరాలు అందించటానికి శ్రద్ధవహించేవారు కారు. తమగురించి ఏమైనా చెప్పుకోవలసివస్తే వినయభావం ప్రకటించుకోటానికే చెప్పుకునేవారు. సూరదాస్, తులసీదాస్‌వంటి సముజ్వలమూర్తులను గురించి కూడా మనకు చాలా స్వల్పంగా తెలుసు. కొందరిని గురించి వారి ప్రత్యక్ష శిష్యప్రముఖులు గురువుల జీవిత చరిత్ర సంఘటనలను ఉల్లేఖించటం తమకర్తవ్యంగా భావించుకుని జీవిత కథలను రాశారు. కాని ఈ

కథల్లో సత్యం కొంతపాలుమాత్రమే. సంత్ ప్రాణనాథ్‌ను గురించి ఇటువంటి జీవితచరిత్రలు వెలువడినాయి. దురదృష్టవశాన కబీరును గురించి అటువంటి చరిత్రలు వెలువడలేదు. వాస్తవమూ కల్పనా అల్లిబిల్లిగా పెనవేసుకుపోయాయి. అందులో జొరబడి దారి చేసుకుని కొన్ని వాస్తవాంశాలను మీముందు వుంచగలిగాను. అందులో ముఖ్యమైనవి రెండున్నాయి.

ఒకటి, కబీరు కాశీ నగరానికి చెందిన సాలెకులంవాడు.

రెండు, ఆయన మఘర్ పట్టణంలో మరణించాడు.

ఇవిరెండే వాస్తవమైన సత్యాలు.

కాని కవులనూ ద్రష్టలనూ గురించి చెప్పేటప్పుడు వారు పుట్టినది ఎక్కడ, గిట్టినది ఎక్కడ అన్న అంశాలు ముఖ్యమైనవిగా మనం ఎంచకూడదు. మానవజాతికి వారు వారసత్వంగా అందించివెళ్లిన కృతులకే ప్రాముఖ్యం ఇవ్వాలి. ఒక వ్యక్తితాలూకు జీవిత సంఘటనలను గురించిన వివరాలు మనకేమీ తెలియకుండా పోయినప్పటికీ ఆయన కృతులను బట్టి మానవోత్తముడుగా పరిగణన పొందవచ్చును. ఈ సత్యాన్ని నిరూపించటానికి కబీరు రచనలే నిదర్శనాలు. భక్తమాల గ్రంథంలో నాభాదాసు కబీరు గురించి ఇలా అన్నాడు : 'కబీరు వర్ణాశ్రమాలనూ, షడ్దర్శనాలనూ విసర్జించలేదు.' భగవంతునిపట్ల కబీరుకు అచంచల విశ్వాసం వున్నది. కాబట్టి ఆయనజీవితం దైవభావంతో పెనవేసుకుని దైవంలో విలీనమయింది. ఆయన ద్వంద్వాలకు అతీతుడై పోయాడు. వర్గాలూ, భేదాలూ అతిక్రమించిన తత్వం ఆయనది. ఆయన ఇలా అంటున్నారు:

మరణించేది నేను కాదు, ఈ జగత్తు.
కనుగొన్నాను రక్షకుడైన ఏకేశ్వరుని మహత్తు.
ఆయన మరణిస్తే నేనూ మరణిస్తాను.
ఆయన అమరుడు కనక నాకూ లేదు మరణం.
కబీరు అంటున్నాడు హృదయంతో హృదయం కావాలి ఏకం.
అప్పుడే సిద్ధించగలదు అమరత్వం.
అందుకోగలవు ఆనందసాగరం.

కబీరు నిజంగా అమరుడు. ఆనందసాగరంలో ఈదులాడే ఆయనకు మరణం లేదు.

ఆయన పరమసత్యాన్ని ప్రత్యక్షంగా సందర్శించాడు.

# కబీరు రచనలు

# పదాలు

1

గురువు భ్రమరం వంటివాడు.
గూటిలో కీటకాలను చేర్చి వాటికి కొత్తరంగులూ, కొత్త రెక్కలూ,
కొత్త కాళ్లూ ఇచ్చి తనరంగునే వాటికి అద్దుతాడు.
ఏకులం, ఏశాఖ అని అడగరు ఎవరూ, పాకీమనిషి పరమహంస[illegible] పోగలడు
గంగలో కలిసే ప్రవాహాలన్నిటికీ గంగ అనే పేరు.
సముద్రంలో చేరిన నది సాగరంలాగే అపారమై పోతుంది.
చంచలబుద్ధిని నిశ్చలంచేసి అంతర్ముఖమైన చిత్తాన్ని అనుగ్రహించాడు.
పంచభూతాలలోనూ వాటికి అతీతమైన సత్యాన్ని దర్శించగల దృష్టిని
ప్రసాదించాడు.
అన్ని శృంఖాలాలూ ఛేదించి నన్ను బంధవిముక్తుని చేశాడు.
అందని దానిని నాకు అందించాడు అంటాడు కబీరు.

2

విఠలా, గోకులాధిపతీ, నాహృదయం నీకు సమర్పించాను.
ఎంతోకాలం నీకు దూరమై దీర్ఘవిరహం అనుభవించాను.
ఇప్పుడు నిన్నే స్మరిస్తున్నాను.
లక్షవసులతో కట్టుకున్నాను నా ఇల్లు.
వలపులే వానిమీద నిలుపుకున్నాను నా ఆశలు.
నా కరాలతోనే తగిలించుకున్నాను సంకెలలు
నీ కోసం ఎదురుతెన్నులు చూస్తున్నాయి కన్నులు.
ఇతరులను సమదృష్టితో నిన్ను చూసుకున్నంత మమకారంతో
చూడగలిగితే అంతా ఒకటిగానే అగుపిస్తారు.
కపటమూ, గర్వమూ విసర్జించిన సమదృష్టికి కనబడతాడు ఈశ్వరుడు.

ఎక్కడికీ వెళ్లనక్కర్లేదు. ఏ బరువూ నెత్తికి ఎత్తుకోవద్దు.
శ్రీరంగా, సారంగధరా అనే నామాలు నీ అధరాలమీద మధువును చిందించాలి.
ప్రతి కృషికీ ప్రతిఫలం లభించకపోవచ్చు.
నిజమైన జ్ఞానం లభించకపోతే నైరాశ్యంతో మనిషి మరణించడు.
ప్రతిపనికీ ఫలం యోగమో భోగమో కావచ్చు.
రామనామం ప్రసాదించగలదు భోగమూ యోగమూ,
ఇది కేవలం పదం కాదు, బ్రహ్మజ్ఞానానికి ఆస్పదం.
ఇందులో అందించాను ఆత్మజ్ఞాన సారాంశం.
వదలరాదు నీహృదయం రాముని పదకమలం.
కీర్తించాలి నిరంతరం రామనామ విభవం.
కబీరు అంటాడు రామనామమే నీకు,
ఇహలోకంలో సౌఖ్యమూ మోక్షమూ కూడా,
ప్రసాదించగల తారకమంత్రం.

3

హరినామమే నా సర్వసంపదలూ, హరినామమే నా ఏకైకధనం.
అది కూడ బెట్టరానిదీ, విక్రయించలేనిదీ.
హరినామమే నా క్షేత్రం, నా ఆరామం,
సేవకుడినైన నాకు నీ చరణాలచెంతనే శరణం.
నీ నామమే నా విధానం, నా మూలధనం,
నీవే నా ఏకైక బంధువు, నీవే నా భ్రాతవు,
అవసానవేళ నీవే నా ఆశాజ్యోతి.
నిరుపేదకు నీ నామమే పెన్నిధి,
ఆకలిగొన్నవాడికి లభించిన మధురాహారం
అంటాడు కబీరు అనవరతం.

4

భగవంతునికి అర్పితమైన వ్యక్తులు లోకంలో అరుదు.
కామ క్రోధ లోభ మోహ రహితునికే దైవదర్శనం,
నిందాస్తుతులకూ మానావమానాలకూ అతీతునికే దైవసాక్షాత్కారం.

ఇనుమునూ, బంగారమునూ ఒకేదృష్టితో వీక్షించగలవాడికే ఈశ్వరదర్శనం.
అటువంటిమనిషి దైవానికి ప్రతిమాకృతి.
ప్రతిబింబ సమానం.
సత్వరజ స్తమోగుణాలు నీ కల్పనలు,
తురీయస్థితిని పొందినవాడే పరమ గమ్యమైన భగవంతుని చేరుకోగలడు.
మాధవునికి చిత్తం అంకితమైనవాడు,
నిస్సంగుడై భగవంతునిలో లీనమైనవాడు,
భయాందోళనలకూ దర్పానికీ దూరమైనవాడు,
భగవంతునికి దగ్గరివాడు నిజమైన భక్తుడు
అని కబీరు చెబుతున్నాడు.

5

ఇంక నే నీ గ్రామంలో చెయ్యను కాపురం;
ఈ దేహపు యజమాని బాధిస్తాడు అనుక్షణం.
శరీరమే గ్రామం. గ్రామాధికారి జీవుడు; అయిదుగురు రైతులున్నారు గ్రామంలో. కళ్ళూ ముక్కూ చెవులూ నోరూ విప్లవం చేసిన అవయవాలు.
ధర్మరాజు వచ్చి బాకీ పరిష్కారం చెయ్యమన్నాడు. అప్పులు విపరీతంగా పెరిగిపోయాయి. అప్పులు ఎగవేసి అయిదుగురు రైతులూ పారిపోయారు. అప్పుడు గ్రామాధికారియైన జీవుడిని పట్టుకున్నారు.
కబీరు వాళ్లతో అంటున్నాడు: 'దయవుంచండి అధికారులారా!' పొలం కట్టుకుని బాకీ పరిష్కారం చేసుకొండి. ఈ ఒక్కసారికి జీవుణ్ణి క్షమించండి. దేహయాత్ర అనే మహాసముద్రంలోకి జీవుణ్ణి నెట్టివేయకండి.

6

మిత్రులారా. ఆత్మను అన్వేషించండి. శరీరం లేనప్పుడు ఎక్కడికి పోగలదు ఆత్మ ?
సనక, సనందన, జయదేవ, నామదేవులు భక్తులేకాని ఆత్మను గురించి వారికి తెలియదు.
శివబ్రహ్మాదులూ, నారదమహర్షీ ఆత్మతత్వాన్ని గుర్తెరుగరు.
ధృవ, ప్రహ్లాద, విభీషణ, శేషాది భక్తులు ఆత్మముఖమైనా దర్శించలేదు.

ఆత్మమర్మం ఎవరూ ఎరుగరు. శుకదేవుడు దానిలో లీనమయాడు.
గోపీచందూ భర్తృహరీ అందులో నివసించారు ఆనందంగా.
నిర్మలమైన నిరంజనమైన నిఖిలాంతర్యామియైన ఆత్మతత్వంతో కబీరు ఏకీభావం పొందాడు.

7

నే నింక చెయ్యలేను నృత్యం; మనస్సు ఆలాపించటంలేదు రాగం.
శుష్కమైనదిప్పుడు పూర్ణమైనది; వాంఛాకలశం భగ్నమైశకలాలై పోయింది.
ఆశల ఆంబరం జీర్ణశీర్ణమై పోయింది. భ్రాంతులన్నీ వీడిపోయాయి.
భూమిక లెన్నో ధరించాను, ఇంక నేను నటించలేదు.
సఖుల్గూ సహచరులూ అందరూ నన్ను విసర్జించారు. భగవన్నామమే నాకు ఏకైక సౌభాగ్యం.
అలజడి చేసినవాళ్లు సర్దుమణిగారు. వివాదాలన్నీ సమసిపోయాయి.
కబీరు అంటున్నాడు: రాముని అను గ్రహంవల్ల తనకు సంపూర్ణ ఫలం లభించింది.

8

సజ్జనులారా, జ్ఞానప్రభంజనం విజృంభించింది.
దోషాల తెరలన్నీ తొలగిపోతున్నాయి: మాయాబంధాలు సడలి పోతున్నాయి.
సంశయాల దూలాలు కూలిపోయాయి. అనుబంధాలగోడలు వాలి పోయాయి.
కామనల పూరికప్పు దిగజారిపోయింది.
అజ్ఞానభాండం బద్దలై పోయింది. తుఫాను వెలిసినపిదప కురిసిన వర్షంలో కబీరు తడసి ముద్దయిపోయాడు.
అరుణోదయంలో కబీరు హృదయం ఉజ్వలంగా మెరిసింది.

9

నన్ను కాపాడినపిదప ఎక్కడికి కొనిపోతావు, రామా?
నీకారుణ్యం నాకు అనుగ్రహించదలచిన వైకుంఠం ఎక్కడ వుంది? ఎల్లాగుంది?
నువ్వు నన్ను ఎడబాసిపోతే నాకు విముక్తి దయచెయ్యి..
నువ్వే అన్నిటిలో వున్నప్పుడు నన్ను ఎందుకు వంచిస్తావు?
దివ్యజ్ఞానం అలవడేదాకా మోక్షంగురించి ప్రసంగిస్తాడు.

తన అంతరంగంలోవున్న రామునే కబీరు అందరిలోనూ సందర్శిస్తున్నాడు.

10

మనం ఈ లోకంలోకి మళ్ళీ ఎందుకు రావాలి?
పంచభూతాల లీల ముగిసిన తరవాత రాముడు సాక్షాత్కరిస్తాడు.
నీరు నేలతో కలిసినప్పుడు, గాలీ ఆకాశమూ ఒకటైనప్పుడు, నిప్పూ గాలీ
ఏకమైనప్పుడు సమాధిలో ప్రవేశిస్తాం,
స్వర్ణాభరణాలను కరిగించినప్పుడు మేలిమి ముద్దలో కలిసిపోయినట్లు మనం
లోకమార్గం నుంచి వైదొలగినపిదప శూన్యంలో కరిగిపోతాం.
అప్పుడు మనం నీటిపైన అలలం.
గురువు ఆనందసాగరుడు అంటున్నాడు కబీరు.
కడపటికి హంసను హంస కలుసుకు తీరు.

11

నా హృదయమా! చాంచల్యం విడనాడు. సందేహాలు తొలగించుకో నువ్వు
అగ్నిప్రవేశంచేసి హస్తంలో కుంకుమధరించి మరణించాలి భయం
దలి పారవశ్యంతో నృత్యంచేయాలి. లోభమోహాలను విడనాడాలి.
వీరులు మృత్యువునిచూసి జంకరు. పతివ్రతలు వస్తువులకోసం ఆశపడరు
సంప్రదాయం, కర్మానుష్ఠానం, ఆభిజాత్యం నీ కంఠం చుట్టూ బిగిసే
ఉచ్చులు, సగందూరందాకా వచ్చి వెనుదిరిగితే లోకం వెక్కిరిస్తుంది
మలినమైన ఈ లోకంలో రామనామం జపించేవ్యక్తి ఒక్కడే నిర్మలమైనవాడు
ఆ నామాన్ని విడవకు, జారిపడినా పైకి ఎగబ్రాకటం మానకు.

12

ఓ సోదరా! మాటలనుగురించి ఏమని చెప్పేది?
మాటలవల్ల సత్యసారాంశం అందకుండా పోతుంది.
మాలిన్యం ఎక్కువౌతుంది. కాని మాటలేకుండా ఆలోచించటం ఎలాగు?
సజ్జనులసమక్షంలో వున్నప్పుడు మాట్లాడు,
వాళ్లమాటలు విను. దుష్టులమధ్య వున్నప్పుడు మాట్లాడకు.
అజ్ఞానులతో మాట్లాడటం నిష్ఫలం.

కబీరు అంటున్నాడు : సగం నిండినకూజా గుడగుడ చప్పుడు చేస్తుంది. నిండుకుండ నిశ్శబ్దంగా వుంటుంది.

13

శరీరం అశాశ్వతం. దీన్ని చూసి మురిసిపోవద్దు గర్వంతో. నువ్వు గతించాక అది క్షణంకూడా వుండదు. పాలతో, వెన్నతో, మిఠాయిలతో పోషించిన ఈ శరీరం ప్రాణం పోయిన కొన్ని క్షణాలలోనే బైటికి మోసుకుపోయి తగల వేస్తారు. తలపాగా చుట్టి అలంకరించుకునే నీ తలను కాకులు పొడిచివేస్తాయి. నీ బొమికెలు కట్టెపుల్లల్లాగా కాలిపోతాయి. నీ శిరోజాలు గడ్డిలాగా తగలబడతాయి.

కాని కబీరు అంటున్నాడు : మృత్యువు సమ్మెటపోటు తలమీద పడేదాకా మానవుడు కళ్లు తెరవడు.

14

ఓ హృదయమా! జీవికను గురించి ఆందోళన చెందకు.

నీ సత్కర్మల ఫలాలను పరిమితంగా అనుభవించు.

ఒకేమట్టితో కుమ్మరి అనేక రూపాలు సృజిస్తాడు. ముత్యాలు కొందరికీ, బాధలు కొందరికీ అందిస్తాడు, కొందరికి మెరిసే పట్టువస్త్రాలు, పరుపులూ, వైభవాలూ ఇచ్చి కొందరికి చినిగిన పేలికలుకూడా నిరాకరిస్తాడు. లోభి ఎంతో ధనం కూడబెట్టుతూ ఇదంతా నాది అనుకుంటాడు. అతని తలపైన మృత్యువు సమ్మెటదెబ్బ పడినప్పుడు అంతా సరి అవుతుంది.

కబీరు అంటున్నాడు : సజ్జనులారా ఆలకించండి. నాది అనేమాట అసత్యం. శవం మీద కప్పిన గుడ్డకూడా తీసేసుకుంటారు. కట్టుబట్టకూడా లాగివేసుకుంటారు.

15

మూర్ఖుడా! నువ్వు హరినామం ఎందుకు జపించవు? నీ కాలమంతా ఎందుకు వ్యర్థం చేస్తున్నావు?

అయిదుగురు దొంగలు కోటను పగలూ రాత్రీ లూటీ చేస్తున్నారు.

యజమాని జాగర్తగావుంటే ఈ లూటీ జరగదు. చీకటిగా వున్నప్పుడు కనబడని వస్తువులను కనుగొనటానికి దీపం కావాలి.
అద్దంలో నీ ముఖం చూసుకోవాలంటే దర్పణం నిర్మలంగా వుండాలి.
అది మసకగా వుంటే నీ ప్రతిబింబం కనిపించదు.
పఠనం, మననం, వేదశ్రవణం నీకు ఏమిలాభం చేకూర్చగలవు?
నీవు వెదుకుతున్న వస్తువు వెలుపల దొరక్కపోతే చదువుల మూలాన ఒరిగే దేమున్నది? కబీరు అంటున్నాడు : నేను సిద్ధి పొందాను.
నేను జ్ఞానసిద్ధి పొందానని గుర్తించుకున్నాను. ఆత్మజ్ఞానంలో విశ్వాసంలేని మనిషిని ఎవరూ కాపాడలేరు.

## 16

నాది నాది అనుకోటంతోనే జీవితకాలం గడిచిపోతోంది. ఒక్కసారియైనా రామా అనకుండానే కాలం చెల్లిపోతోంది. పణ్నెండేళ్ళు బాల్యంలో గడిచిపోయాయి, ఇరవైయేళ్ళు జపతపాలు లేకుండా వ్యర్థమైపోయాయి. ముప్పైయేళ్ళు రాముని స్మరణలేకుండా సాగిపోయాయి. అప్పుడే ముసలితనం వచ్చేస్తున్నదని విచారపడతావు. పశ్చాత్తాపం పొందుతావు. ఎందుకు గత జలసేతుబంధనం? పైరు మాడిపోయినాక పొలానికి నీరు పట్టటం దేనికి? గుఱ్ఱాన్ని దొంగలు ఎత్తుకుపోయాక ఇంకెందుకు నీకీ జీనూ కళ్లెమూ? తల కదలిపోతుంది. కరచరణాలూ కంపించిపోతాయి.
కళ్లకు నీళ్లపొరలు అడ్డుపడతాయి. నాలుక పలుకలేక పోతుంది.
అప్పుడు నువ్వు సత్కర్మలు చేయాలనిభావిస్తే ఏం లాభం?
కబీరు అంటున్నాడు : సజ్జనులారా! కూడబెట్టిన ధనం కూడారాదు మీతో. కాలుని పిలుపు రాగానే అన్నీ వదిలేసి మీరు తరలివెళ్లాలి.

## 17

ఈ లోకం దారికనిపించని పొగమంచుతెర. నెత్తిమీద దుముకటానికి సిద్ధంగా వుంది మృత్యువు. విగ్రహాలను ఆరాధిస్తూ హిందువులూ, హాజ్‌యాత్రలు చేస్తూ ముస్లిములూ కాలమంతా వెచ్చిస్తారు. జడదారులైన యోగులు నీ మర్మాన్ని గ్రహించలేక నశిస్తారు. కవులు యతిప్రాసలతో కాలమంతా

వమ్ము చేసుకుని గతిస్తారు. సన్యాసులు కేదారయాత్రలు చేస్తూ మరణిస్తారు. జైనమునులు శిరోముండనాలు చేయించుకుంటూ హరించిపోతారు. కాని ఒక్కరికీ నీ రహస్యం అంతుచిక్కదు. రాజులు ధనరాసులు కూడ బెట్టటంలో కాలమంతా పాడుచేసి మరణిస్తే చివరికి అవన్నీ భూస్థాపితమైన చోటనే దిక్కుమొక్కు లేకుండా వుండిపోతాయి. వేదాలు వల్లిస్తూ విప్రులూ, అందచందాలు చూసుకుని మురిసిపోతూ వనితలూ కాలుని వలలో చిక్కుతారు.

ఈ దేహాన్ని పరిశీలించి సత్యం గ్రహించుకో, రామనామం లేక పోతే ఇదంతా నిరర్థకం.

కబీరు ప్రశ్నిస్తున్నాడు: హరినామస్మరణ చెయ్యకుండా ఎవరైనా రక్షింపబడ్డారా?

## 18

కాపలాలేని పొలాన్ని పశువులు ధ్వంసంచేశాయి. పగలూ రాత్రీచేలో జొరబడేవాటిని తరిమికొట్టటం ఎవరికీ సాధ్యంకాదు.

అవి కడుపునిండామేసి ఇచ్చవచ్చినట్లు తిరుగాడుతున్నాయి. పొగరు తలకెక్కి అవి ఎవరినీ ఖాతరు చెయ్యటంలేదు. వాటితో వేగలేక విసిగిపోయారు.

నేను జ్ఞానమనే పైరు వేశాను. గురువును దిష్టిబొమ్మగా నిలబెట్టాను. రామనామమే నా పొలానికి కావలివాడు.

దొంగమేతలకు అలవాటుపడిన పశువులు నా పొలంలో పైరును పాడు చెయ్యలేవు అంటున్నాడు కబీరు.

## 19

ఓ వెర్రిదేహమా! శ్వాస నిన్ను వీడిపోతుంటే విలపిస్తావెందుకు?

మన సంయోగం నిత్యంకాదని హంస అంటున్నది ఆలకించు. నేను శరీరాన్ని చూసి మురిసిపోయి దాన్ని ప్రతి ఉదయమూ శుభ్రం చేశాను.

కాని ఇది ఒకనాడు కూలి కాలి ధూళిపాలుకాక తప్పదు. దీన్ని అంతావొదిలేస్తారు. శివుడు, సనకుడు, బ్రహ్మదేవుడు, సహస్రఫణి శేషువు, ఎవరైనాసరే కాయంతోవచ్చి కలకాలం వుండలేరు. మంచి చెడుగులు రెండే మనకు తోడునీడలని జీవితాంతమూ వీడని నెచ్చెలులనీ గుర్తించండి.

ఇదే సత్యం.

కబీరు అంటున్నాడు: ప్రభుని లీలలు గ్రహించగలవారు చాలా అరుదుగా వుంటారు.

## 20

మరణించేది నేనుకాను, మరణించేది ఈ జగత్తు. నేను రక్షకుని కనుగొన్నాను. దురాత్ములు మరణిస్తారు. రామనామ సుధారసపానంచేసే మహాత్ములు చిరంజీవులు.

హరి మరణిస్తే నేను మరణిస్తాను. హరి మరణించకపోతే, నేను మాత్రం ఎందుకు మరణిస్తాను?

కబీరు అంటున్నాడు: చిత్తమూ చిత్తమూ ఏకమైపోయాయి. ఆనందసింధువు లభించింది. అమృతత్వం సిద్ధించింది.

## 21

నాకిప్పుడు అన్నితావుల్లో కళ్యాణోత్సవమే. నాకు ఆత్మశాంతి లభించింది. గోవిందుడు నావాడు అయినాడు.

శరీరసంబంధమైన సహస్రదోషాలు నేడు నిర్మల శాంతిసుఖాలుగా పర్యవసించాయి. భేదం మోదంగానూ యముడు రాముడుగానూ పరిణమించారు. శత్రువులే మిత్రులైనారు, దుర్మార్గులు సన్మార్గులైపోయారు.

ఆత్మతత్వంగ్రహించినప్పుడు, ఆత్మ రూపాంతరం పొందినప్పుడు తాపత్రయాలు సమసిపోగలవు.

కబీరు అంటున్నాడు : నేను సులభప్రాప్తమైన సౌఖ్యంలో మునిగి తేలుతున్నాను. నాకు భయభ్రాంతులు లేవు.

## 22

రామరాయి ఒక బట్టనేయటానికి తెచ్చాడు. కాని సాలెమనిషి ఇంటికి వెళ్ళబోతున్నాడు. తొమ్మిది. పది. పంధొమ్మిది గజాలు మగ్గం మీద వేశాడు. ఏడుదారాలూ, డెబ్బదిరెండు పుంజాలు ఆబట్టనిడివి. దాన్ని నువ్వు కొలవలేవు. తూకం వెయ్యలేవు. దాని పరిమాణం రెండున్నరశేర్లు. అది కాస్త తగ్గినా ఇంటిదగ్గర ఆడంగులుగొణుగుతారుట. రోజంతా ప..

చేస్తే యజమానికి తృప్తి కలుగుతుంది. అందులో మూడోవంతు పోతుంది పన్నులకింద.

తడిపిన నూలు మగ్గం మీదనే వొదిలేసి సాలెవాడు విసుగెత్తి పారి పోయాడు. వంకరపోయిన మగ్గం పనిచెయ్యదు. దారాలు మరింత చిక్కులు పడతాయి.

కబీరు అంటాడు : మూర్ఖుడా! ఈ పని కట్టిపెట్టు. రాముని స్మరించు.

## 23

మూర్ఖుడా! రాముని ధ్యానించు. కాయం కలకాలం నిలువదు. ఎవరు కొనితెచ్చారు ఈ ధనం ? ఎవరు కొనిపోగలరు తమవెంట? దుర్మార్గుడా ఇదంతా ఒక సంత. దీన్ని సర్దివేసి తరలిపోతారు.

స్వర్ణపురి లంకానగరం ధూళిపాలైపోక తప్పలేదు. మరుక్షణంలో రావణుని సామ్రాజ్య వైభవం కలలా కరిగిపోయింది. పన్నెన్నెండు మైళ్లువిస్తరించిన నగరంలో ఛత్రాలనీడల్లో విహరించిన దుర్యోధనుడు ధూళిలో కలిసిపోయాడు. కబీరు ఇళ్లకప్పులమీద నిలబడి ఉద్బోధిస్తున్నాడు. నాది అనుకున్నది ఏదీ నీది కాదు. క్షణ భంగురమైన జీవితం స్వప్నంలాగా అదృశ్యమైపోతుంది.

## 24

మానవుడు లోకంలోకి వస్తాడు. కొద్దికాలంపాటు తన దుందుభి మ్రోగిస్తాడు. తరవాత మరి కనిపించడు. ఏడుకట్ల సవారిపైన తలపైకి ఎత్తిచూస్తూ చివరిసారి పయనమై వెళ్ళేవేళ వెంట ఏదీ రాదు. గడపదగ్గిరే భార్య ఏడుస్తూ వుండిపోతుంది. తల్లివాకిలి దాకావచ్చి ఆగిపోతుంది. బంధువులు శ్మశానందాకా వస్తారు. ఆ తరవాత హంస ఏకాకియై పయనిస్తుంది. ఇక బిడ్డలూ, ధనమూ, మరేవి కంటపడవు.

కబీరు అంటున్నాడు: మానవుడా! దైవభక్తిలేని జీవితం శుష్కమైనది. శూన్యమైనది.

## 25

అంతర్ముఖమైన మనస్సు మనస్సుతో ఐక్యమయింది. అజ్ఞానినైన నేను

గురుకటాక్షంవల్ల జ్ఞానం పొందగలిగాను. శ్వాసను బంధించి షట్ చక్రాలను భేదించి మనస్సు శూన్యం పైన లగ్నమయింది. ఓ సన్యాసీ, రాకపోకలు లేని వానికోసం అన్వేషించు.

పుట్టుటా గిట్టుటా లేనివానిని వెదకు. మన దృష్టినిబట్టి ఆయన ఎంతో దూరాన వున్నప్పటికీ చెంతనే వున్నట్లనిపిస్తుంది.

చెంతనే వున్నా దూరాన వున్నట్లనిపిస్తుంది. ఊర్ధ్వగతిని ప్రవహించే జల ధారను గ్రోలి సోలినవానికే దానిరుచి తెలుస్తుంది.

సకల గుణాతీతుడవైన నిన్నుగురించి చెబితే విని తెలుసుకోగల వివేకి ఎక్కడ? గురువు వెలిగించిన దివిటీనుంచి వెలువడే రవ్వలను చూడగలవారు కొద్దిమంది.

## 26

చిత్తమే ఒకచర్ఖా, రసనయే చీలినకొయ్య. హరినామస్మరణచేస్తూ చకచకా దారం తియ్యి ఓ వనితా! రెండుదారాలూ నాలుగు పిడులూ నాటారు, చక్రం గిరగిరా తిరుగుతోంది. వడకటం ఆరునెలలు, దారం చుట్టటం ఏడాది. జనం అన్నారు నూలు బాగా వడికిందని.

కబీరు అంటున్నాడు : నిజమే నూలు బాగా వడికినదే. ఇది చర్ఖాకాదు. ఉత్తమ స్థితిని ప్రసాదించే చక్రం ఇది.

## 27

జనులారా! కృష్ణుడు నందకుమారు డంటారుకదా. మరి నందుడు ఎవరి పుత్రుడు? భూమీ ఆకాశమూ అవతరించని దశలో నందుడు ఎక్కడుండేవాడు? ఎనభైనాలుగు లక్షల జన్మలు ఎత్తుతూ నందుడు వేసారి పోయాడు. అప్పుడు భక్తునికోసం కృష్ణుడు అవతరించాడు. నందుని భాగ్యం పండింది.

జననమరణ రహితుడు, బాధాతీతుడు, రూపవిరహితుడు, జననీ జనకులు లేనివాడు కబీరు ఆరాధించే ప్రభువు.

## 28

ప్రాణి ఎక్కడికి పోతుందని యోచిస్తుంటే ఈ లోకాన్ని పరిత్యజించాలనిపి

స్తుంది. పైనా, కిందా అంతా ఆకాశమే, దిక్కులు పదికోణాల్లోనూ ఆకాశమే.

భగవంతుడే ఆనందప్రదాత. కుండ పగులుతుంది కాని గగనం మిగులుతుంది.

పంచభూతాలతో దేహం ఏర్పడింది, కాని పంచభూతాలు ఎక్కడి నుంచి వచ్చాయి? జీవుడు కర్మబద్ధుడు అంటారు. మరి ఆ కర్మలు చేసేదీ చేయించేదీ ఎవరు? దేహంలో దేవుడున్నాడు, దేవునిలో దేహమున్నది. ఆయన అన్నిటిలోనూ అంతటా వున్నాడు.

కబీరు అంటున్నాడు: ఏమి జరిగినాసరే నేను భగవన్నామం విడవను.

## 29

కబీరు చెడిపోయాడంటున్నారు, రామా కృపజూపు. మిత్రుడా! నువ్వు చెడిపోకుండా జాగర్తపడు మరి, చందన తరువు చెంతనున్న వృక్షం సుగంధ భరితమై చెడిపోతుంది. పరుసవేదిసోకిన ఇనుము బంగారమై చెడిపోతుంది. గంగానదిలో చేరిన నీరు గంగాజలమై చెడిపోతుంది.

కబీరు అంటున్నాడు: రామనామం జపించే మానవుడు రాముడై చెడిపోతాడు.

## 30

నువ్వు యోగాసనాలూ ప్రాణాయామమూ విసర్జించాలి. కపటవేషాలు కట్టిపెట్టి హరినామ సంకీర్తనం చెయ్యాలి. కొమ్ములూ వుంగరాలూ నిగనిగలాడేట్లు తోముకుని సాధించేదేమిటి? దేహంనిండా భస్మం అలదుకొని పొందే లాభమేమిటి? నిర్మల వర్తనం కలవాడే అసలైన హిందువు, నిజమైన ముసల్మాను. దైవచింతన చేసేవాడే యోగి, బ్రహ్మజ్ఞానం కలవాడే బ్రాహ్మణుడు.

కబీరు అంటున్నాడు: నువ్వు ఏమీ చెయ్యనక్కర్లేదు. రామనామ జపం వల్లనే నీకు అన్నీ లభిస్తాయి.

## 31

నీ నిలువెల్లా ఆత్మరాగరంజితం చేసుకుని సుఖించు.

హృదయం రాగద్వేషరహితం కాకుండా అరణ్యంలో నివసించినా లాభం ఏముంది? గృహంలోనూ అరణ్యంలోనూ ఒకే ఆనందం అను

భవించేవారు కొద్దిమంది వున్నారు. జడలుధరించి, బూడిద వొంటినిండా పూసుకుని గుహల్లో నివసించి లాభమేమిటి?

విషయవాసనలకు లొంగకుండా వుంటే మనస్సును జయించవచ్చు. మనస్సును జయించినవాడు లోకాన్ని జయించగలడు.

కళ్లకు కజ్జలరేఖలు దిద్దుకుని అందాన్ని ఇనుమడించుకోటానికే అంతా తంటాలు పడతారు. హృదయాన్ని వశం చేసుకోగలిగినవే అందమైన కళ్ళు.

కబీరు అంటున్నాడు: దివ్యానుగ్రహంవల్ల నాగురువు నాకు నిజమైన జ్ఞానం ప్రాదించాడు. నా హృదయం భగవంతుని పాదాలవద్ద శరణుజొచ్చింది. సంపూర్ణంగా నా హృదయం దేవునికి అంకితమయింది. ఇక అది ఎన్నడూ చలించదు.

## 32

ఓరామా, ఓ అల్లా: నేను నీకోసమే జీవిస్తున్నాను. నీకటాక్షం నాపైన ప్రసరించు, ప్రభూ!

తల నేలకు వేసి రాయటంవల్ల స్నానాలు చేయటంవల్ల లాభం ఏమిటి?

హత్యానేరాలు చేసి దోషాలు దాచుకుంటూ సాధువుగా చెలామణి కావాలని చూస్తావు. నైవేద్యాలు పెట్టటంవల్ల మసీదుల్లో మోకరిల్లటం వల్ల లాభం ఏమిటి? హృదయంలో కపటమైన నమాజులు చేస్తూ హజ్‌యాత్రకు పోయి లాభం ఏమిటి?

బ్రాహ్మణుడు ఏకాదశినాడు, ముసల్మాను రంజాన్‌దినాల్లో ఉపవాసం చేస్తున్నారు. పదకొండు నెలలు ఒక్క మంచి పనీ చెయ్యక ఒక్క నెలలోనే సత్కర్మలు కొల్లలు జరపటం దేనికి?

భగవంతుడు మసీదులో మాత్రమే వుంటే మిగిలిన ప్రదేశంమాట ఏమిటి? దేవుడు విగ్రహాలలోనూ తీర్థయాత్రా స్థలాల్లోనూ వున్నాడంటారు. ఆ రెంటిలోనూ ఆయన్ని దర్శించిన వారెవరూ కనిపించరు.

తూర్పున వుంటాడట హిందువుల దైవం, ముసల్మానుల అల్లా పడమట వుంటాడుట.

ఆయనకోసం నీ హృదయంలోనే అన్వేషించు, ఇతరస్థలాల్లో కాదు.

రామ్ రహీములిద్దరూ నీఅంతరంగంలోనే కొలువుతీర్చికనిపిస్తారు.

లోకంలోవుండిన, వుంటున్న నరనారీ జనలందరూ నీలోని ఆత్మతత్వ ప్రతిబింబాలే.

కబీరు రామునికీ రహీముకూ ముద్దుబిడ్డ. వారే ఆయనకు గురువులు, ప్రభువులు.

## 33

నా నాలుకమీద విష్ణువు, కన్నులలో నారాయణుడు, హృదయంలో గోవిందుడు, మృత్యువు వచ్చి లెక్కలు తేల్చమంటే 'ముకుందా!' అని కేక పెడతాను.

నువ్వు బ్రాహ్మణుడవు, నేను సాలెవాడిని. నాకున్న జ్ఞానమెంతో నువ్వు గణించలేవు. నువ్వు బతుకంతా రాజులనూ అధికారులనూ ప్రార్థించి సేవించావు. నేను రాముడినే నమ్మి కొలుస్తున్నాను.

గతజన్మలో నేను బ్రాహ్మణుడినే. అప్పుడు నేను మంచిపనులు చేయలేదు. రాముని చరణకమలాలను విస్మరించాను. అందుకే సాలెకులంలో పుట్టాను.

ఓ బ్రాహ్మణుడా! నేను గోవును, నువ్వు గోపాలకుడవు. జన్మజన్మలనుంచీ నన్ను మేతకోసం మంచి మైదానంలోకి తోలుకొనిపోలేదు. ఏమి యజమానివయ్యా నువ్వు?

భవసాగరంలో మునిగిపోతున్నాను. దరికిచేరే ఉపాయమేదీ?

రామనామమే భవజలధిని దాటించే నావ.

ఇదే కబీరు ఉపదేశం.

## 34

విప్రుడా! ఎందుకు దుర్బోధలు విని చెడిపోతావు?

రాముని విస్మరిస్తే నువ్వూ నీ కుటుంబమూ మునిగిపోతారు. వేదాలు వల్లించటమూ పురాణాలూ చదవటమూ గార్ధభంవీపున గంధపు చెక్కలమోపు వేయటమే.

రామనామ మహిమ తెలియకపోతే అవతలిగటుకు ఎల్లా చేరుతావు?

నీచేత్తోచంపిఅది ధర్మమంటావు. అయితే అధర్మం ఏదంటావు?

సత్పురుషుడవని చాటుకుంటావు. మరి దుర్మార్గు డెవరంటావు?

అజ్ఞానాంధకారంలో అలమటించే అంధుడివి నువ్వు ఇతరులకు ఏమి బోధించగలవు? నీ జ్ఞానాన్ని, ధనానికి విక్రయిస్తున్నావు.

నీ జీవితలక్ష్యమే దెబ్బతినిపోతున్నది. ఈ మాటనే నారదుడూ, వ్యాసుడూ,

శుకుడూ చెప్పగా విన్నావు.

కబీరుకూడా ఇదే చెబుతున్నాడు: రాముని భజించి సేవించు. లేకపోతే తప్పకుండా మునిగిపోతావు.

35

విప్రుడా! మైలపడని తావు ఏదో చెప్పు, అక్కడ నేను భోజనం చేస్తాను. తల్లి మైలపడింది, తండ్రి మైలపడ్డాడు బిడ్డలుకూడా అపరిశుభ్రమైన వారే. వచ్చేవారూ వెళ్ళేవారూ అపరిశుభ్రమైన వారే. మరణించేవారూ అపరిశుభ్రమైన వారే. అగ్ని అపరిశుభ్రమే. వండే ప్రదేశమూ అపరిశుభ్రమే. వడ్డించే గరిట అపరిశుభ్రమే.

అపరిశుభ్రమైనవాడే అపరిశుభ్ర వస్తువులను తింటున్నాడు.

రాగద్వేష రహితులై హరినామసంకీర్తనం చేసేవారే పరిశుభ్రమైన వారు. మైలపడనివారు.

36

నేను వచ్చేవాడిని కాను. వెళ్ళేవాడిని కాను. నా గురువు సరసన మకరందం ఆస్వాదిస్తాను. ఒకరు తస్బీ, ఇంకొకరు జపమాల తిప్పుతారు. జనులారా, ఇద్దరు జీతంకోసమే చేస్తున్నారు. ఒకరు మక్కాకు. ఇంకొకరు కాశీకి పోతున్నారు.

కాని ఇద్దరి కంఠాలచుట్టూ ఉరిత్రాళ్ళున్నాయి.

కబీరు అంటున్నాడు: జనులారా వినండి. నేను ఎవరివాడినీ కాను. ఎవరూ నావారు కారు.

37

పుట్టేవాడెవరు? గిట్టేవాడెవరు? స్వర్గనరకాలద్వారా సాగేదెవరు?

శాశ్వత తత్వంనుంచే పంచభూతాలు ప్రభవించాయి. పంచభూతాలలో నివసించేవాడు ఆయనే. పంచభూతాలూ నశించినవేళ ఆయన మళ్ళీ తనలో తాను లీనమైపోతాడు. విభాగరేఖ లేశంకూడా కనబడదు. కూజాలో నీరు వుంది. నీటిలో కూజా వుంది. వెలుపలా లోపలా వున్నది జలం. ఘటం పగిలినప్పుడు లోపలిజలం వెలుపలి జలంతో కలిసిపోతుంది.

విజ్ఞులు తెలిపే మర్మం ఇదే.
ఆదిలో శూన్యం. మధ్యలో శూన్యం. అంతంలోనూ శూన్యమే.
కర్మలు మనల్ని ఎలా అంటుకోగలవు? అదంతా ఆధారంలేని అనుమానం.

## 38

విప్రుడా! నువ్వు రామనామం ఎందుకు మరిచిపోయావు?
రామనామ జపం చేయకపోతే నరకానికి పోతావు.
వేదాలూ గాయత్రీమంత్రం నిత్యం నోటితో ఉచ్చరించేవాడివి,
తప్పులు ఎందుకు చేస్తావు? ప్రపంచమంతా తన పాదాలమీద సాగిల పడినసూ విప్రుడు జంతువధ చేస్తాడెందుకు? ఉత్తమకులజుడైనా నీచులతో విందులు ఆరగిస్తాడు. క్షుద్రమైన మార్గాల ద్వారా ఉదరపోషణ చేసుకుంటాడు.
గ్రహణపుదినాల్లో, అమావాస్యలలో ఇష్టంవచ్చినట్టు ముష్టి ఎత్తుకో. కర దీపిక పట్టుకుని బావిలో దిగు.
బ్రాహ్మణుడివి నువ్వు. సాలెవాడివి నేను.
కబీరు అంటున్నాడు: రాముని దయ నన్ను రక్షించింది. వేదాలమీద ఆధారపడి నువ్వు మునిగిపోతావు.

## 39

దైవభక్తిలేక దుర్మార్గులు పెడదారులు పడతారు.
నాకు విముక్తిమార్గం చూపుతారనే ఆశతో ఎవరిదగ్గరకు వెళ్ళానో వారే వలలో చిక్కుకుని వున్నారు.
యోగులు యోగంతప్ప ఇంకోమార్గం లేదంటారు. గిరజాలు పెంచుకునేవారు. తలలు బోడులైన సాధువులు ఇద్దరూ తాము సిద్ధిపొందినట్లు చాటుకుంటారు.
పండితుడు. యుద్ధవీరుడు. కవి. పోషకుడు, ఎవడిమటుకు వాడు తనే గొప్ప అని చెప్పుకుంటాడు. దైవప్రేమకు దూరమైనవాడు వచ్చినచోటికే తిరిగిపోతాడు. నీ కుడి ఎడముల ఇరుగడలా రాగద్వేషాలు వర్జించు. హరిచరణాలను పట్టుకుని విడవకు.
కబీరు అంటున్నాడు: మిఠాయితిన్న మూగవాడు రుచి ఏమని చెప్పగలడు?

40

జనులారా! మీరు బొత్తిగా అమాయకులు. కబీరు మరణించటం కోసం కాశీకి పోతే ఇక రాముని గొప్ప ఏముంది.

ప్రేమభక్తి తత్వమెరిగినవారికి సాలెవాడైన కబీరు రామునిలో తాదాత్మ్యం పొందాలంటే వింతగా తోచదు. జలధిలో కలిసిన జలం జలమే అవుతుంది.

కబీరు అంటున్నాడు: జనులారా, పొరబడకండి. సత్యం చెబుతాను వినండి. హృదయంలో రాముడున్నప్పుడే కాశీయైనా, మఘర్ అయినా ఒక్కటే.

# రమైనీలు

1

ప్రథమంగా అనన్యుని అద్వితీయుని స్మరిస్తాను - ఎవరూ ఆయన లోతు కనుగొనలేరు. ఆయన ఆద్యంతము లెవరికీ తెలియవు. ఆయన సాకారుడా నిరాకారుడా ఎవరూ చెప్పలేరు.

ఆయన బలువు సులువులు ఎవరూ తూకం వేయలేరు.

ఆకలి దప్పికలకూ, ఛాయాతపాలకూ సుఖదుఃఖాలకూ అతీతుడై ఆయన అందరిలో నివసిస్తాడు.

ఆయన సర్వాంతర్యామి. అనంత బ్రహ్మస్వరూపుడు.

భాసరూపమై అంతటా భాసిస్తున్నాడు.

దీర్ఘంగా ఆలోచించినమీదట, రామునిపోలికవారే లేరని చెప్పగలను.

2

ప్రభువును సహచరుని చేసుకుని సుఖదుఃఖాల నుంచి విముక్తిపొందు.

ఆయనదశరథకుమారుడై జన్మించలేదు. లంకాధిపతిని సంహరించనూ లేదు.

ఆయన దేవకిగర్భంలో జన్మించలేదు. యశోద ఆయననుసాకలేదు. గోపాలకులతో సంచరించలేదు. గోవర్ధనగిరిని పైకి ఎత్తలేదు.

వామనరూపుడై బలిచక్రవర్తిని వంచించలేదు.

భూమినీ వేదాలనూ రక్షించలేదు.

ఆయన గండక్‌లో సాలగ్రామం కాదు.

ఆయన వరాహ మత్స్య కూర్మరూపాలు ధరించలేదు.
బదరీదేవాలయంలో ఆయన తపస్సు చేయలేదు.
ఆయన పరశురాముడై క్షత్రియులను హింసించలేదు.
ఆయన ద్వారాకాపురిలో నిర్యాణం చెందలేదు.
పూరీక్షేత్రంలో ప్రతిష్ఠించినది ఆయన విగ్రహంకాదు.
బాగాయోచించి కబీరు అంటున్నాడు : ఇదంతా అసత్యం.
వీటన్నిటికీ అతీతుడైన ప్రభువే ఈ లోకాన్ని నడిపిస్తున్నాడు.

3

కలియుగంలో ఆయన కలామాను బోధించినవాడు.
ఆయన నిజతత్వాన్ని శోధించలేకపోయాడు.
ఆయన కరుణవల్లనే అన్నీ కొనసాగుతున్నాయి. వేదాలూ, కొరానూ కూడా శుష్కమైనవే.
గర్భంనుంచి జన్మించినది అసత్యం, నామం ధరించినది అసత్యం.
సున్నత్‌లూ, యజ్ఞోపవీతాలూ అసత్యాలే.
ఆయన మర్మం హిందువులకూ ముస్లిములకూ ఇరువురికీ అందనిది.
ఆయన విధానాలు ఇరువురికీ తెలియవు.
ఇరువురూ తప్పులలో కాలువేసి అదే మతం అంటున్నారు.
గాలితో నీటితో ఆయన ఈ లోకాన్ని సృజించాడు.
ఈ జగత్తు శూన్యంలో అదృశ్యమైపోతుంది. అప్పుడు కులాల ప్రసక్తి ఎవరు ఎత్తుతారు?

4

వేదాలు వల్లించి బ్రాహ్మణుడు దారితప్పాడు.
తన ఆత్మస్వభావమే ఆయన తెలుసుకోలేకపోయాడు.
ఇంట్లో సంధ్య, తర్పణాది షట్కర్మలూ సాగుతూనేవుంటాయి.
నాలుగుయుగాల్లోనూ గాయత్రీ మంత్రం నేర్పుతునేవున్నారు.
కాని అందువల్ల ఎవరికి దొరికింది మోక్షం?
ఇతరులు తాకితే స్నానం చేస్తాడు.
ఆయనకంటే తక్కువ వారెవరో అడగండి.

తన సద్గుణాలను చూసుకుని మహా గర్వపడతాడు.
అమితగర్వంవల్ల సత్ప్రయోజనాలు కలగవు.
అన్నిదర్పాలనూ అణిచేప్రభువు వీళ్ళగర్వాన్ని సహించడు.
ఈ అహంభావాన్ని వొదిలేసి నిర్వాణస్థితిని చేరుకోవాలి.
విత్తనం నశించినప్పుడు, అంకురం అంతరించినప్పుడు రూపరహితస్థితి కనిపిస్తుంది.
అవినాశమైన రామనామాన్ని ఆశ్రయించు. ఇంకెవరికోసమూ హరిని విడనాడకు.

5

నువ్వు ఎక్కడికి వెళ్ళినా శలభముపై పోతావు. సత్యం గ్రహించు.
కోరికలజ్వాలలో మాడి మసికాబోకు.
నీ హృదయంలో రామనామం నెలకొన్నప్పుడు భ్రమరకీటకాల భేదం అంతరిస్తుంది.
ఈ భవసాగరం అపారం. తరణోపాయం ఆలోచించుకో.
మనస్సు కామక్రోధాల తరంగముల్లో డోలలూగాలని కోరుతుంది.
తీరాన్ని చేరే ఉపాయం ఆలోచించదు.
ఈ సాగరజలాలు అగాధమైనవి.
దాటించే నావ రాము డొక్కడే.
హరిని శరణువేడుకో అంటున్నాడు కబీరు.
ఈ సముద్రం గోష్పాదమంత అయిపోతుంది.

## కబీరు దోహాలు (ద్విపదలు)

1. నేను ఇవ్వగలిగింది రామనామం ఒక్కటే.
ఏ దక్షిణ అర్పిస్తే గురువు ఆనందిస్తాడో తెలియక తికమకపడుతున్నాను.
2. గురుకృపామహిమ అనంతం, ఆయన నాకు చేసిన మహోపకారం అపారం. అనంతుని దర్శించగల అనంతవీక్షణం అనుగ్రహించాడు.
3. రాత్రి విడిపోయిన చక్రవాకపక్షులు ఉదయాన కలుసుకుంటాయి. రాముని విడిచినవాడు ఆయనను పగలు కానీ రాత్రికానీ కలుసుకోలేడు.
4. వీడ్కోలువల్ల కలిగే బాధనుగురించి మొరపెట్టకు.

ఆబాధ రాజులకు సైతం అనివార్యం. ఆబాధ తెలియనిహృదయం నిర్జీవమందిరం.

5. దారి కాచికాచి కళ్లచుట్టూ నల్లటివలయాలు ఏర్పడ్డాయి. రామరామ అని అని రసనపుండు పడిపోయింది.

6. అహర్నిశలూ కళ్లవెంట రాలుతున్నాయి అశ్రువులు.
పపీహా పక్షి లాగా పీపీ అని ఆక్రందిస్తున్నాను. ప్రియతమ రామా! ఇంకెన్నటికో కన్నుల కరువుతీరా నిన్నుచూసే భాగ్యం?

7. పాపాత్ముడూ మహాత్ముడూ రాల్చే కన్నీళ్లకు తేడాలు లేవు.
ప్రేమపూరిత హృదయం రక్తాశ్రువులు రాలుస్తుంది.

8. ఎందుకు నిద్రిస్తావు? మేలుకో. నీ విచారాన్ని నలుగురికీ తెలుపుకో.
మృత్యువే గమ్యమైనమనిషికి హాయిగా నిద్రపట్టదు.

9. నువ్వు నువ్వు అని స్మరిస్తూ నా అనేదాన్ని విస్మరించి నేను నీలో లీనమై పోయాను. ఇప్పుడు ఎల్లెడలా నువ్వే నువ్వే.

10. జ్ఞాని అనుదినమూ మరణిస్తూనేవుంటాడు. ఆరగించటమే పరమలక్ష్యంగా ఎంచుకునే అజ్ఞానికి సదసద్వివేకం వుండదు. ఇంట్లో పెత్తనం చెలాయిస్తూ వుంటాడు.

11. మహాపురుషుడు తెల్లటిబట్టవంటివాడు. కొంచెం మరకకూడా కావటానికి వీలులేదు. దుర్మార్గుడు నల్లటి దుప్పటి, ఎక్కడా పరిచినా ఫరవాలేదు.

12. మైత్రీబంధం కల్పించుకోదగిన మనిషి నాకు ఒక్కడూ కనబడలేదు.
అందరూ ఎవరిచితిలో వారు దగ్ధమైపోతూ కనిపిస్తారు.

13. యోధులందరూ క్షేమంగా వున్నారు. క్షతగాత్రుడు ఒకడైనా కనబడ లేదు. గాయపడినయోధుడు గాయపడిన ఇంకొకశూరుని చూసినప్పుడే రామ భక్తి గాఢతరం అవుతుంది.

14. కాగడాపట్టుకుని నా ఇంటికి నిప్పు పెట్టుకున్నాను.
ఇప్పుడు నన్ను అనుసరించదలచినవాడి ఇంటిని అంటిస్తాను.

15. నాది అనేది ఏదీ లేదు. అన్నీ నీవే. నీవు ప్రసాదించినవే నీకు నివేదించటంవల్ల నాకు తరిగిపోయేది లేదు.

16. నాభిలో కస్తూరివున్న లేడి అ పరిమళం ఎక్కడిదని వనమంతా వెదుకుతుంది.
రాముడు అందరి డెందాలలో కొలువున్నాడు. కాని లోకం గుర్తించలేదు.

17. వెదుకుతూ వెదుకుతూ కబీరు చివరికి తనను తాను కోలుపోయాడు. సింధువులో లీనమైపోయిన బిందువును ఎవరు గుర్తించగలరు?

18. ఇప్పుడు మనస్సు వెలుపలికి రావాలని కోరటంలేదు। లోపల నిలబడి పోవటంలోనే తృప్తి కనుగొన్నది. అగ్ని చల్లారిపోయింది. జ్వాలలు జల ధారలుగా మారిపోయాయి.

19. దేహమంతా సంగీతంతో ముఖరిస్తున్నది. తీగలు లేకుండానే వీణ రాగా లాపన చేస్తున్నది. ఇప్పుడు లోపలా వెలుపలా గంధర్వగానమే. భ్రాంతు లన్నీ పటాపంచలై పోయాయి.

20. గంగాయమునల మధ్య కొంత శూన్యప్రదేశం వుంది. మునులు ఇంకా వేచిచూస్తుంటే కబీరు అక్కడ తన దేవాలయం నిర్మించాడు.

21. నేను కళ్ళుమూసే సమయంలో నా కనులలో జొరబడిపో, ఇక నేను ఇతర వస్తువులను చూడను. ఇక నిన్ను ఇతరులను చూడనీయను.

22. నేను నరకాన్ని ఆలింగనం చేసుకుంటాను. నాకు భయంలేదు. ప్రియతమా! నువ్వు తోడులేని స్వర్గాన్ని నేను కోరను.

23. భగవత్ప్రేమతో మత్తుడైనవాడికి ఆమైకం దిగిపోదు. శరీరాన్ని లక్ష్యం చెయ్యకుండా విచ్చలవిడిగా సంచరిస్తాడు.

24. ప్రేమ అనేది పొలంలో పండదు. బజారులో దొరకదు. కావాలనుకుంటే ప్రభువైనా దాసుడైనా తన శిరస్సును సమర్పించి దాన్ని పొందవచ్చు.

25. కబీరు అంటాడు: పది దినాలపాటు డప్పు కొట్టుకుంటూ తిరుగుతావు. అటుతరవాత ఈ పురమూ ఈ వీధీ నీకు కనిపించవు.

26. కబీరు అంటున్నాడు : ఈ శరీరం ధూళితో చేసినది. ఇది నాలుగు గంటల నాటకం. మూడునాళ్ల ముచ్చట. ఆతరవాత ధూళిలో కలిసిపోతుంది.

27. మానవజన్మ అసాధారణం. దుర్లభం. మళ్లీ మళ్ళీ లభించదు. వృక్షం నుంచి నేలరాలిన పరిపక్వఫలానికి ఇక పరిణామం వుండదు.

28. విర్రవీగబోకు. మృత్యువు నీ జుట్టు పట్టుకున్నది. ఇంట్లోనో బైటనో ఎప్పుడు నిన్ను చావుదెబ్బ కొడుతుందో ఎవరికితెలుసు అంటున్నాడు కబీరు.

29. లక్షల విలువైన ఈ మందిరం మణిమౌక్తిక సుందరం. అదీ మూడూ నాళ్ల ముచ్చటే. దానికీ తప్పదు వినాశనం.

30. శిథిలమైనగ్రామంలో దొరికినవి పగిలిన కుండపెంకులు.

వాటిని చేసిన కుమ్మరివారు గతించిపోయారు.
లంకాధీశ్వరుడు రావణుడు కూడా నిష్క్రమించక తప్పలేదు.

31. నేడో రేపో కాక కొన్నాళ్లతరవాతో నువ్వు మరుభూమిలో శయనిస్తావు. అప్పుడు పశువులు నీ మీద నుంచి మేతకు నడిచివెళ్తాయి.

32. బట్ట నేసే సాలెవాడు నేత ముగించినట్లు మృత్యువు నీ జీవితాన్ని సమాప్తంచేస్తుంది. పారిపో నీకు చేతనైతే.

33. సంచితబుద్ధి కలవారిముందు నీ నోరు విప్పకు. విశాలహృదయులముందు నీ మనస్సు విప్పి చెప్పుకో అంటున్నాడు కబీరు.

34. సున్నం అడుసూ తెచ్చి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నావా? ఏం లాభం? ఆ మాయదారి మృత్యువు వింటే దానిని పడగొట్టివేస్తుంది.

35. వీణ ఇక మీటదు. తీగెలన్నీ తెగిపోయాయి. అంటాడు కబీరు.
కానీ పాపం వీణని దూషించడ మెందుకు?
వాయించే వ్యక్తి వెళ్లి పోయినప్పుడు.

36. గిరగిరతిరిగే తిరుగలినిచూస్తే కబీరు కన్నీరు మున్నీరు ఈ రాళ్లమధ్య నలగని గింజ ఒకటైనా వుండనీరు.

37. ఓ వెర్రిచేపా! జాలరి వల విసిరేశాడు విశాలంగా.
చిన్నచిన్న చెఱువుల్లో నీకు ముప్పు తప్పదు. మహాసముద్రాన్ని చేరుకో.

38. ఇంత పెద్ద గోడలతో ఎందుకంత విశాలభవనం నిర్మిస్తున్నావు?
ఆరడుగులజాగా నీకు సరిపోతుంది కదా!

39. ఒకరి తరవాత ఒకరుగా నా పూర్వమిత్రులంతా నిష్క్రమించారు.
ఓ హృదయమా! ఇక నీకాలం చేరువ అవుతున్నది. వస్తున్నది నీ వంతు.

40. మానవజీవితం బుద్బుదప్రాయం. క్షణకాలంలో ఉదయాకాశంలోని నక్షత్రంలాగా మటుమాయమైపోతాడు.

41. ఏడ్చినవాళ్ళు చనిపోయారు. దహనం చేసినవాళ్లు గతించారు.
శోకాలుపెట్టినవాళ్లూ పోయారు. ఇంకెవరిని పిలవాలి?

42. వీపున బరువుమూట మోసుకుంటూ బాటసారి దారిలో నిలబడ్డాడు.
ముందు మృత్యువు ఆవరిస్తూ నిలబడివుంది.
ఇక జీవితాన్ని గురించిన కబుర్లన్నీ కల్లలే.

43. మనలను కన్నవారు కనుమరుగైపోయారు. మనమూ తరలిపోవటానికి తయారుగా వున్నాము. మనం కనిపెంచిన బిడ్డలుకూడా మూటా ముల్లే సర్దుకుంటున్నారు.

44. కబీరు అంటున్నాడు: ఈ లోకం మిథ్య. ఒకక్షణంలో మధురంగా మరు సటి క్షణంలో క్షారంగా తోస్తుంది.
నిన్న రాజసౌధాలలో విహరించినవారు నేడు శ్మశానవాటికను పరిపాలి స్తున్నారు.

45. పుత్రోదయం అయినందుకు భేరీనాదాలు చేసి ఉప్పొంగి పోవటం దేనికి? ఈ రాకపోకలు ఎడతెరిపి లేకుండా చీమల బారులాగా సాగుతూనే వుంటాయి.

46. రాముడనే రతనాలమూట దొరికినప్పుడు ముడి విప్పకు.
అమ్మే విఫణిలేదు. ఖరీదు చెప్పే షరాబులేడు, దాన్ని కొనేవాడు లేడు. దానివిలువ ఇంతని చెప్పేందుకు వీలుకాదు.

47. పల్లెటూరిసంతలో వజ్రాన్ని అమ్మబోకు, దాన్ని పదిలంగా మూట కట్టు కుని కదిలిపో అక్కడి నుంచి.

48. ప్రపంచం మరణిస్తూనే వుంది అనాది నుంచీ, అయినా ఎలా మరణిం చాలో ఎవరికీ తెలియదు. మళ్ళీ చావటం అవసరంలేని విధంగా చనిపో వటం నేర్చుకున్నాడు కబీరు.

49. హృదయం గంగాజలంలాగా పునీతమైనప్పుడు భగవంతుడే కబీరు వెంట వచ్చి పేరుపెట్టి ఎన్నోసార్లు పిలిచాడు.

50. మరణించటం ఎలాగో తెలుసుకుంటే జీవితంకంటే అదే నయం. మృత్యు వుముంచుకు రాకముసుపే మరణించగలవాడు జరామరణాలను జయిం చగలడు.

51. పచ్చటి పసుపూ, తెల్లటిసున్నమూ కలిపినప్పుడు రెంటి అసలు రంగులూ మారిపోతాయి. అలాగే నేనూ నా ప్రియుడైన రాముడూ సంయోగంపొంది మా స్వరూపస్వభావాలను కోలుపోతాము అంటాడు కబీరు.

52. పరిమితులను గౌరవించేవాడు సామాన్యుడు. వాటిని అతిక్రమించేవాడు సాధు సత్పురుషుడు.
ద్వంద్వభావాలను అధిగమించినవాడు అగాధప్రజ్ఞాన సంపన్నుడు.

53. రామరామ అంటూ ప్రాణం విడుస్తారు హిందువులు. ఖుదాపేరు తలుస్తూ తనువులు చాలిస్తారు ముస్లిములు. ఇరువురికీ దూరంగా వున్నవాడే జీవిం చగలడు అంటారు కబీరు.

54. కాబా మారిపోయి కాశీ అయింది. రహీము అయ్యాడు రాముడుగా. బరకరప్వ మెత్తటిపిండి అయింది. విందును ఆనందంగా ఆరగిస్తున్నాడు కబీరు.

55. ఓ షేక్! నీ హృదయంలో ప్రశాంతి లేకుండా హాజ్ యాత్రకు ఎందుకు

బయలుదేరుతావు? హృదయం సవ్యంగా శాంతంగా సంతోషంగా లేని వాడికి దైవం కనిపిస్తాడా?

56. కాశీలో నివసించి నిర్మల గంగాజలం పానం చేయవచ్చును. కాని భగవన్నామస్మరణ లేకుండా విముక్తి దొరకదు అంటున్నాడు కబీరు.

57. ప్రభువుపట్ల విశ్వాసపాత్రుడవై, సాటిమానవులయెడల నిర్మలవర్తనుడవై మసలుకోవాలి. అప్పుడు నువ్వు జుట్టుబారుగా పెంచుకోనూవచ్చు. అడుగంటా గొరగించుకోనూ వచ్చు.

58. రుద్రాక్షమాలలు సేకరించి సాధువుగా చెలామణీ అవటంవల్ల లాభమేమిటి? పెట్టె పైన తళతళ మెరుస్తూవుంటుంది. కాని లోపల వున్నదంతా చెత్త.

59. జుట్టు నీకు ఏమి అపకారం చేసింది? దాన్ని పాపం మాటిమాటికీ తీయించి వేస్తావేం? కామక్రోధాలతో నిండిన మనస్సును పునీతం చేసుకోవేం? ఖండించవలసింది నీ తలమీది వెంట్రుకలు కాదు; తల లోపలి చెడు తలపులను ఖండించు.

60. అవే అక్షరాలూ, అవే మాటలూ, పలువురు పలువిధాలుగా పలిస్తారు. వాటికి కొంచెం పోపు తగిలించు. అప్పుడవి సుధామధురమై అందరినీ ఆకర్షిస్తాయి.

61. నీళ్లకంటే నిర్మలమైనవాడు. ధూమం కంటే తేలికైనవాడు, జోరుగాలికంటె విశృంఖలమైసవాడు. ఆయనే నామిత్రుడు అంటాడు కబీరు.

62. అడుక్కొని తెచ్చుకున్న అన్నమే మిన్న. రకరకాల ఆధరువులు దొరుకుతాయి. అందులో భాగం కావాలనే వారుండరు.
అప్పుడు నువ్వు మకుటంలేని మహీపతివి.

63. ఆదుర్దాలు, భయాలూ మాని హాయిగా బతుకు. ఆయనశక్తి మహిమాన్వితం. పశువులూ, పక్షులూ, కీటకాలూ ఎంత సౌభాగ్యం అనుభవిస్తున్నాయో చూడు.

64. నా హృదయం రామార్పితం. నాకూ మరణానికీ నడుమ అగాధం. దైవంపట్ల నాకు అచంచల విశ్వాసం. కనక ఈ దాసునికి లేదు నరకవాసం.

65. ఆక్రందనంలోనే గానం, గానంలోనే ఆక్రోశం. సన్యాసి సంసారి అయ్యాడు. సంసారి వైరాగ్యంతో జీవిస్తున్నాడు.

66. చదువులు కట్టిపెట్టు, పుస్తకాల గిరాటువెయ్యి, అక్షరమాలలో వున్న యాభై

రెండు వర్ణాలలో రా-మా- అనే రెంటిమీదనే నీ హృదయం కేంద్రీకరించు.

67. అన్నీ అంతరించాయి. బిడ్డలు, సంపదలు, భార్య, వాంఛలు అంతా గతిం చారు.

కబీరు నేడు రామునిలో సంపూర్ణంగా ఐక్యమైపోయాడు.

Lasertypeset at Unique Graphics, New Delhi - 110 060 and printed at
J.J. Offset Printers, Wazirpur Printing Area, Delhi - 110 035